RNI.No. APTEL/2014/57702

ESTD: 1999

www.voodayam.com



వుదయం



గుంటూరు | 14-11-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 236 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

భారత్ సమిట్‌పై విపక్షాల

విమర్శలు అర్థరహితం



హైదరాబాద్, నవంబర్ 13 (వుదయం) :

భారత్ సమిట్ నిర్వహణను విపక్షాలు ఉద్దేశపూర్వకంగా వ్యతిరేకిస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ప్రత్యేకతలు, రాష్ట్రంలోని అనుకూల పరిస్థితులను ప్రపంచ దేశాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ సమిట్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సదస్సుకు ముందుగా భారత్ సమిట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బెంగళూరు, చెన్నై, దిల్లీలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టామని, త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ నిర్వహించనున్నట్లు వివరించారు. కొందరు ప్రతినిధులను చివరి నిమిషంలో కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడంతో, వారు విమానాశ్రయానికి చేరుకున్నప్పటికీ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. భారత్ సమిట్ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారో అర్థం కావడం లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాధనాన్ని వృథా చేస్తున్నామంటూ భాజపా నేతలు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.

రూ.3,470 కోట్లతో బెంగళూరులో మెట్రో పింక్ లైన్



బెంగళూరు, నవంబర్ 13 (ఎఎంస్) :

నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా నిర్మించిన నమ్మ మెట్రో పింక్ లైన్‌లోని కలేన అగ్రహార నుంచి తవరెకెరె వరకు నూతన మార్గాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.3,470 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మార్గంలో మోదీ, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి ప్రారంభ సేవలకు జెండా ఊపారు. అనంతరం ఇద్దరూ మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మోదీ, డీకే శివకుమార్ టికెట్ కౌంటర్ వద్ద విడివిడిగా టికెట్లు కొనుగోలు చేయడం విశేషం. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు నిర్మించిన రెండంచెల ఎత్తైన రహదారి ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రధానమంత్రికి వివరించారు.

నా ఫోన్ ట్యాప్ చేయిస్తున్నారు

న్యూఢిల్లీ, నవంబర్ 13 (ఎఎంస్) :



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మొబైల్ ఫోన్‌పై నిఘా పెట్టిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని వెల్లడించారు. శుక్రవారం సామాజిక మాధ్యమ వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా తన ఫోన్‌ను చూపిస్తూ, దానిలోనే నిఘాకు సంబంధించిన ఆధారాలున్నాయని పేర్కొన్నారు. ఫోన్ నిఘా అంశంపై ప్రధాని మోదీతో బహిరంగంగా ముఖాముఖి చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్చ ద్వారానే దేశానికి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరిస్తున్నారు, విదేశీయుల నియంత్రణలో ఎవరు ఉన్నారనే విషయాలు స్పష్టమవుతాయని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గతంలోనూ ఇదే తరహా ఆరోపణలు చేశారు. సుమారు మూడేళ్ల క్రితం తనతో పాటు పలువురు ప్రతిపక్ష నాయకుల ఫోన్లను పెగాసస్ నిఘా సాంకేతికత ద్వారా కేంద్ర దర్యాప్తు సంస్థలు పర్యవేక్షిస్తున్నాయని ఆరోపించారు. అయితే, అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండించింది. తాజాగా మరోసారి ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్ విసిరారు.

తలకోన చెక్‌పోస్టు ఆదాయం పంచాయతీకి దక్కేనా?

నెరబైలు అభివృద్ధికి ప్రధాన ఆదాయ వనరుగా మారే అవకాశం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారనున్న చెక్‌పోస్టు వ్యవహారం.

వనరులను సద్వినియోగం చేసుకుంటే స్వర్ణ పంచాయతీ లక్ష్యం సాధ్యమేనా....?

చంద్రగిరి,యర్రావారిపాలెం నవంబర్13 (వుదయం ప్రతినిధి):



మండలం లోని నెరబైలు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తలకోన గ్రామాభివృద్ధికి ప్రధాన ఆదాయ వనరుగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తలకోనకు నిత్యం వచ్చే భక్తులు, పర్యాటకుల వాహనాల నుంచి మొదటి వంక వద్ద చెక్‌పోస్టు పేరుతో రుసుములు వసూలు చేస్తున్నపేథ్యంలో, ఆ ఆదాయాన్ని నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి కేటాయిస్తే గ్రామాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

ఆదాయం ఎక్కడికి వెళ్తోంది....?

మొదటి వంక వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న చెక్‌పోస్టు ద్వారా వాహనాల వారీగా రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు గతంలోనే వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ వసూళ్లకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు, అధికారిక ఉత్తర్వులు, రోజువారీ ఆదాయం, ఖర్చుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన ప్రాంతం, వసూళ్లకు ఉన్న చట్టబద్ధత, ఆదాయం ఏ ఖాతాలో జమ అవుతోందన్న విషయాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

పంచాయతీకి ఆదాయం వస్తే అభివృద్ధికి బాట...!!!

నెరబైలు గ్రామపంచాయతీ పరిధిలోనే ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమైన తలకోన ఉండటంతో, అక్కడి పర్యాటక కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి కూడా ఉపయోగించే అవకాశాలను పరిశీలించాలన్నది స్థానికుల అభిప్రాయం. చెక్‌పోస్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంచాయతీకి కేటాయిస్తే తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.గ్రామపంచాయతీకి సొంత ఆదాయ వనరులు పెరిగితే ప్రభుత్వ నిధులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి కొంతవరకు తగ్గుతుంది. స్వర్ణ పంచాయతీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి కూడా ఇది దోహదపడుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో నాయకులకు ఇదో పరీక్ష...!!!

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు ఆదాయ వ్యవహారం గ్రామస్థాయిలో చర్చనీయాంశంగా మారే అవకాశం ఉంది. చెక్‌పోస్టు ఆదాయాన్ని పంచాయతీకి కేటాయించేలా కృషి చేస్తామని ఎవరు హామీ ఇస్తారు? దాని కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారు? గ్రామాభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తారు? అన్నది ప్రజలు పరిశీలించే అంశాలుగా మారుతున్నాయి. గ్రామ, మండల స్థాయి కూటమి నాయకులతో పాటు వైసీపీ నాయకులు కూడా ఈ అంశంపై తమ వైఖరిని వెల్లడించాల్సిన అవసరం ఉంది. కేవలం ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా, చెక్‌పోస్టు ఆదాయం గ్రామానికి ఉపయోగపడేలా చట్టబద్ధమైన మార్గాలను అన్వేషించి, అభివృద్ధికి కృషి చేస్తామని ప్రజలకు భరోసా కల్పించాల్సి ఉంది.

ఒక పంచాయతీ అభివృద్ధి.. మరో పంచాయతీకి ఆదర్శం కావాలి.!!!!

నెరబైలు గ్రామపంచాయతీ పరిధిలోని తలకోన పర్యాటక ప్రాంతం ద్వారా లభించే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి మళ్లించే అవకాశాలను ఇక ఆలస్యం చేయకుండా పరిశీలించాలి. సహజ నీటి వనరులు,పర్యాటక కేంద్రాలు, స్థానిక మార్కెట్లు, ఇతర ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేకపోవడం గ్రామీణాభివృద్ధికి పెద్ద అడ్డంకి. తలకోన వంటి వనరులు కేవలం సందర్శకులను ఆకర్షించడానికే కాకుండా, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగపడాలి.చుట్టుపక్కల గ్రామపంచాయతీలు కూడా తమ పరిధిలోని వనరులను గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలి. ప్రభుత్వ నిధుల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఆదాయాన్ని పెంచుకోవడం, పారదర్శకంగా వినియోగించడం, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడం ప్రతి పంచాయతీకి అవసరం.ఒక గ్రామ పంచాయతీ సాధించిన పురోగతి మరో గ్రామానికి ఆదర్శంగా మారాలి. గ్రామాల మధ్య ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీ ఏర్పడితే రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది. అభివృద్ధి కొద్దిమంది నిర్ణయాలతో కాకుండా ప్రజల భాగస్వామ్యంతో సాగాలి.ఆలోచనలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలి!!!

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రతి గ్రామపంచాయతీలో ఉన్న వనరులను గుర్తించి, ఆదాయ ప్రణాళికలు రూపొందించాలి. ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది? ఎలా వినియోగిస్తారు? దాని వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటి? అన్న వివరాలను ప్రజలకు తెలియజేయాలి. ఒక గ్రామంలో ప్రారంభమైన అభివృద్ధి ఆలోచన పక్క గ్రామాలకు కూడా విస్తరించేలా చర్యలు తీసుకోవాలి.

తలకోన చెక్‌పోస్టు ద్వారా వసూలవుతున్న ఆదాయానికి సంబంధించిన లెక్కలు ఏమిటి? ఆ ఆదాయాన్ని నెరబైలు పంచాయతీ అభివృద్ధికి కేటాయించే అవకాశం ఉందా? ఈ విషయంలో కూటమి, వైసీపీ నాయకులు ఎలాంటి కార్యాచరణ ప్రకటిస్తారు? చుట్టుపక్కల పంచాయతీల అభివృద్ధికి ఎలాంటిప్రణాళికలు రూపొందిస్తారు? అన్న ప్రశ్నలకు రాబోయే రోజుల్లో సమాధానం లభించాల్సి ఉంది.

ఒక చెక్‌పోస్టు ఆదాయం ఒక గ్రామ అభివృద్ధికి బాటలు వేయగలదా? ఒక గ్రామం అభివృద్ధి మరో గ్రామానికి స్ఫూర్తిగా నిలవగలదా? అన్నది ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవపై ఆధారపడి ఉంది.

నవంబర్‌లో 150 ప్రత్యేక రైళ్లకు హాల్టింగ్..
పండుగ రద్దీకి కాజీపేట, వరంగల్

రైల్వే స్టేషన్లలో విస్తృత ఏర్పాట్లు

హైదరాబాద్, నవంబర్ 13 (వుదయం) :



పండుగల సందర్భంగా రైళ్లలో పెరిగే ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు దక్షిణ మధ్య రైల్వే కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్లలో విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా నవంబర్ నెలలో కాజీపేట, వరంగల్ స్టేషన్లలో సుమారు 150 ప్రత్యేక రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించింది. పండుగల వేళ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు ముఖ్యమైన ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. దానాపూర్, రక్సౌల్, దర్భంగా, ససారం, ప్రయాగ్‌రాజ్, సంత్రాగాచి, బరౌని, అగర్తలా, సిల్చార్ వంటి గమ్యస్థానాలకు ఈ రైళ్లు సేవలందిస్తున్నాయి. వీటితో పాటు ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు కూడా ప్రత్యేక రైళ్లను నడుపుతూ ప్రయాణికుల అదనపు రద్దీని అధిగమించేందుకు చర్యలు చేపట్టింది. రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాధాన్యమిస్తోంది.

అంబర్‌పేటలో

హనుమంతరావు ప్రత్యేక పూజలు



హైదరాబాద్, నవంబర్ 13 (వుదయం) :

తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ, అభివృద్ధి సలహాదారు వీ. హనుమంతరావుతో నివాసంలో కలిసి వర్షాల కోసం సత్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు హోమం నిర్వహించి, ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో మరింత చురుకుగా వ్యవహరిస్తూ, అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి. లక్ష్మణ్ ఎస్సీ విభాగం చైర్మన్, బి. జయశంకర్, డి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కురుమూర్తి స్వామి జాతర ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టాలి
– అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్

కురుమూర్తి స్వామి జాతరను పురస్కరించుకుని దేవస్థానం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వివిధ శాఖల సన్నద్ధతపై అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై శాఖల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, వైద్య ఆరోగ్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, రవాణా సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, పారిశుద్ధ్యం, తాగునీరు,



విద్యుత్, వైద్య సేవలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
జాతర నిర్వహణ సమయంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.డి.పి.ఓ వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు

డా. ఏఎస్ రావు నగర్‌లో పార్కులు, క్రీడా సదుపాయాల అభివృద్ధికి
ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన

కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 12, మేడ్చల్ జిల్లా

ఉప్పల్ నియోజకవర్గం డా. ఏఎస్ రావు నగర్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, చిన్నారులకు ఆటస్థలాలు, యువతకు వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.1.45 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.
చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు:
* థీమ్ పార్క్ - ఓపెన్ జిమ్, EPDM ఫ్లోరింగ్ - రూ.17.50 లక్షలు.



* TSIIC గ్రౌండ్ - ఓపెన్ జిమ్, చైన్ లింక్ ఫెన్సింగ్ -రూ.36 లక్షలు.
* హాన్స్ అవెన్యూ పార్క్ - ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాలు, కాంపౌండ్ వాల్ గ్రిల్ - రూ.23 లక్షలు.
* విరాట్ నగర్ కాలనీ - వాకింగ్ పాత్‌వే, ఆట పరికరాలు - రూ.6.50 లక్షలు.* శ్రీనగర్ కాలనీ పార్క్ - ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాలు - రూ.22.50 లక్షలు.
* బీజేఆర్ కాలనీ - బీజేఆర్ జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సీసీ రోడ్డు నిర్మాణం - రూ.40 లక్షలు.
ఈ అభివృద్ధి పనుల ద్వారా స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. చిన్నారులకు సురక్షితమైన ఆట స్థలాలు కల్పించడంతో పాటు కాలనీల్లో రహదారి సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి BRS పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఫాక్స్ సాగర్‌కు మహర్దశ..
రూ.వేల కోట్ల సామర్థ్యంతో మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధికి హైడ్రా శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 13:

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల ప్రాంతంలో ఎంతో చారిత్రక వైభవం ఉన్న ఫాక్స్ సాగర్ పునరుద్ధరణ పనులను హైడ్రా శుక్రవారం ప్రారంభించింది. ఆక్రమణలతో పాటు దుర్గంధాన్ని తొలగించి చెరువుకు కొత్త రూపునిచ్చేందుకు హైడ్రా శ్రీకారం చుట్టింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు శుక్రవారం భూమి పూజ చేసి ఫాక్స్‌సాగర్ చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జీడిమెట్ల ఫాక్స్ సాగర్ చెరువును పునరుద్ధరించి, మినీ రిజర్వాయర్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాది కాలంలో ఇక్కడ అద్భుతమైన సరస్సును చూడబోతున్నారని పేర్కొన్నారు. చెరువు రూపురేఖలు మారి.. మినీ ట్యాంక్ బండ్‌గా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. మురుగు నీరు, కెమికల్ వ్యర్థాలతో దుర్గంధభరితంగా ఈ చెరువు మారిపోయింది. పెద్దమొత్తంలో పూడిక ఉండడంతో భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ పరిసరాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడమే కాదు.. కొద్ది మొత్తంలో ఉన్నా.. అవి క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులకు కారణమయ్యేవిగా మారాయి. ఇలాంటి తరుణంలో ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది.. శుద్ధ జలాలతో నింపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా హైడ్రా చర్యలు చేపట్టింది. ఒకప్పుడు మురుగునీరు, గుర్రపు డెక్కతో చెరువు ఉనికినే కోల్పోయే విధంగా ఉన్న మాధాపూర్‌లోని తమ్మిడికుంట నేడు ఎంతో సుందరంగా హైడ్రా తీర్చిదిద్దింది. అలాగే ఫాక్స్ సాగర్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నట్టు హైడ్రా కమిషనర్ చెప్పారు.

*** 5 మీటర్ల మేర పూడిక తొలగింపు..**

ప్లాస్టిక్, కెమికల్ వ్యర్థాలతో భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి ఉంది. 5 మీటర్ల మేర పూడికను తొలగించి ప్రస్తుతం 1000 మిలియన్ లీటర్ల సామర్థ్యానికి పరిమితమైపోయిన ఫాక్స్ సాగర్ చెరువును 4 వేల మిలియన్



లీటర్లకు పెంచడమే లక్ష్యంగా పనులు జరుతున్నాయని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. పూడికను తొలగించడం ద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. చెరువు అభివృద్ధికి ముందు తర్వాత.. జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధన సంస్థ (NEERI National Environmental Engineering Research Institute) ద్వారా చెరువు నీటితో పాటు.. పరిసరాల్లోని భూగర్భ జలాలను పరీక్షించనున్నామన్నారు. చెరువులోకి మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలు నేరుగా చేరకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (తTP) ఏర్పాటు చేస్తామన్నారు. చెరువులోకి వరద నీరు చేరేలా చర్యలు తీసుకోవడం తో పాటు.. 2000లో వరదల సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరదనీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేస్తామని చెప్పారు. చెరువు కట్టను పటిష్టం చేయడమే కాకుండా.. చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

*** హెరిటేజ్ ను కాపాడుతాం..**

1897లో నిజాం పాలకుల కాలంలో ఈ చెరువును నిర్మించారు. సాగునీటితో పాటు.. సికింద్రాబాద్ ప్రజలకు తాగు నీరు అందించేందుకు దీనిని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. ఈ చెరువు నీరు నేరుగా హుస్సేన్‌సాగర్‌కు చేరేలా వరద కాలువలు కూడా ఉన్నాయి. ఈ చెరువు కట్టపై నిర్మించిన పురాతన రాతి పంప్‌హౌస్ ద్వారా



తాగు నీటి సరఫరా ఉండేది. ఇప్పుడా రాతి పంప్ హౌస్ దెబ్బతినింది. వాటిని పునరుద్ధరించేందుకు యూరప్‌కు చెందిన నిపుణుల సహకారం తీసుకుంటాం. చెరువు చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. దాదాపు 500ల ఎకరాల పరిధిలో ఉన్న ఈ చెరువులో 150 ఎకరాల మేర ఆక్రమణలను గుర్తించామని.. వాటిని ఇప్పటికే చాలావరకు తొలగించామన్నారు. 2024 జులై 19 హైడ్రా ఏర్పడడానికి ముందు ఉన్న నివాస గృహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని స్పష్టం చేశారు. అక్కడ కొన్ని లే ఔట్లున్నాయని.. ఎవరైనా ప్లాట్లు, భూములు కోల్పోతే వారికి నిబంధనల ప్రకారం టీడీఆర్ (TDR) లభిస్తుందన్నారు. చెరువు ప్రధాన కట్ట, దాని పరిసర ప్రాంతాల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ బఫర్ జోన్‌ను పది మీటర్ల మేర పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కట్ట దిగువన ఉన్న ఆలయాలు, ఇతర నిర్మాణాల విషయంలోనూ వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కట్టకు ఆనుకొని ఉన్న ఆలయాలను మతపరమైన అంశాలతో సంబంధం లేకుండా పూర్తిగా పర్యావరణ పరిరక్షణ, ప్రజల భద్రత, జలవనరుల అభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్నామని స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలం నాటికి నీటిని నిల్వ చేసుకునేలా పనులు చేపట్టి, ఏడాదిలోపు ఫాక్స్ సాగర్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.




సీసీ కెమెరాల సాయంతో 45 నిమిషాల్లోనే తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారి ఆచూకీ.

.కుటుంబానికి అప్పగించిన అత్తాపూర్ పోలీసులు

అత్తాపూర్ ,వుదయం

ఇంటి బయట ఆడుకుంటూ తప్పిపోయిన 4 ఏళ్ల చిన్నారిని అత్తాపూర్ పోలీసులు కేవలం 45 నిమిషాల్లోనే గుర్తించి కుటుంబానికి అప్పగించారు. చింతల్ మెట్, అత్తాపూర్ కు చెందిన మొహమ్మద్ అహ్మద్, తండ్రి పేరు మొహమ్మద్ మహబూబ్, వయసు 32 సంవత్సరాలు, కార్ డ్రైవర్ గా పని చేస్తున్నారు. ఈ రోజు అనగా 12.11.2026న మధ్యాహ్నం 1 గంట సమయంలో తన కుమార్తె అబియా ఫాతిమా, వయసు 4 సంవత్సరాలు ఇంటి బయట ఆడుకుంటూ కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే అత్తాపూర్ పోలీసులు స్పందించారు. సిబ్బంది పి. రవి కుమార్ హెచ్ సి 3191 మరియు ఏఆర్ పిసి 12908 లను రంగంలోకి దింపి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. కేవలం 45 నిమిషాల్లోనే



తప్పిపోయిన చిన్నారి అబియా ఫాతిమా ఆచూకీ కనుగొని కుటుంబానికి అప్పగించారు.చిన్నారి సురక్షితంగా దొరకడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వేగంగా స్పందించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలి..

- **రెవెన్యూ నష్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి..**
- **సైబరాబాద్ డిప్యూటి కమిషనర్ జె.హరికిషన్.**
- **డ్రగ్స్, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను నివారించడానికి ఎక్సైజ్ యంత్రాంగం నిఘా పెంచాలని సైబరాబాద్ డిప్యూటి కమిషనర్ జె.హరికిషన్ అన్నారు.**

హైదరాబాద్, నవంబర్ 13:

ఆబ్కారీ భవన్ డీసీ కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
కొత్త బార్ల లైసెన్సీదారుతో పనులు పూర్తి చేయించి, బార్లకు సంబంధించిన గ్యారెంటీలను కట్టించే విధంగా చర్యలు చేపట్టాలని, ఏ 4 షాపస్‌కు సంబంధించి లైసెన్స్ ఫీజులకు త్వరితగతిన కట్టించాలని సీఐలను, ఈఎస్‌లను అదేశించారు.
ఎక్సైజ్ శాఖ ఆదాయానికి నష్టం కలించే వాటిని గుర్తించాలని, వాటిని అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అదేశించారు. వివిధ రూపాల్లో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను రాకుండా అడ్డుకోవాలని, ఈవెంట్ పర్మిషన్లు తీసుకొని ఎన్‌డీపీఎల్ మద్యం వినియోగంపై తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యల చేపట్టాలని అన్నారు.మరో పక్క లైసెన్సీలు నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి, కుత్బుల్లాపూర్, షేర్‌లింగంపల్లి ఈఎస్‌లు పి.ప్రవీణ్, వై. రాధాకృష్ణారెడ్డి తోపాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

800 గ్రాముల సిహెచ్ క్లోరోహైడ్రేడ్ పట్టివేత..

రంగారెడ్డి నవంబర్ 13 , వుదయం

ఎన్ఫోర్స్మెంట్ టీం ఫరూక్ నగర్ షాద్ నగర్ లోని కె యాదగిరి వద్ద 800 గ్రాముల క్లోరోహైడ్రేట్ పట్టుకున్నట్లు రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ బి జ్యోతి కిరణ్ తెలిపారు. కల్తీ కల్లుకు వినియోగించే క్లోరోహైడ్రేడ్ ను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుని సిహెచ్ ను షాద్నగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ హైస్కూల్‌ను
ఆకస్మికంగా తనిఖీ చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



సికింద్రాబాద్ కంటోన్మెంట్ నవంబర్ 13 , వుదయం

మడ్‌ఫోర్ట్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌ను శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే స్పెషల్ బడ్జెట్ (SDF) నిధుల నుంచి మంజూరైన రూ.50 లక్షల వ్యయంతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్‌లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. 8వ తరగతిలో టీచర్ పాఠం బోధిస్తున్న తీరును స్వయంగా పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.
పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యే విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన, క్రీడా, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వచ్చే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని ప్రకటించారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీలత ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు ఇందిర, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయ నిర్మాణంపై కీలక చర్చ

గుమ్మడిదల, నవంబర్ 13 (వుదయం):

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రామ్‌నగర్ కాలనీలో బీరప్ప దేవాలయ నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సంఘం సభ్యులతో సమావేశమై ఆలయ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

అనంతరం పలువురు స్వామీజీలతో సంప్రదించి దేవాలయ నిర్మాణ విధివిధానాలు, చేపట్టాల్సిన ఏర్పాట్లు, నిర్మాణ రూపకల్పన తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆలయ



నిర్మాణం విజయవంతంగా పూర్తయ్యేందుకు సంఘం సభ్యులు, గ్రామస్థులు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.
ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బీరప్ప, నాయకులు వెంకట్రాంరెడ్డి, సూర్యనారాయణ, సంఘం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ పునర్నిర్మాణంపై
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైంది?

10 అంతస్తుల మల్టీపర్పస్ భవనం నిర్మిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలి

కాంట్రాక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన జాతీయ ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం గ్రేటర్ హైదరాబాద్ బృందం

హైదరాబాద్, నవంబర్ 13 (వుదయం):

లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్ పునర్నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం గ్రేటర్ హైదరాబాద్ బృందం శుక్రవారం అంబేద్కర్ భవన్‌ను సందర్శించింది.
అంబేద్కర్ భవన్‌ను కూల్చివేసి, దాని స్థానంలో అన్ని వసతులతో కూడిన మల్టీపర్పస్ భవనాన్ని పది అంతస్తులతో నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హామీ ఇచ్చారని సంఘం నాయకులు



గుర్తుచేశారు. ఈ నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌ను కలిసి పనుల పురోగతి, ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుపై వివరాలు తెలుసుకునేందుకు బృందం అక్కడికి వెళ్లింది. అయితే కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆయనను కలవలేకపోయారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్ భవన్ అనేది కేవలం ఒక భవనం మాత్రమే కాదని, అంబేద్కర్ ఆశయాలకు, దళితుల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అలాంటి భవనం పునర్నిర్మాణం విషయంలో జాప్యం చేయడం తగదని, ప్రభుత్వం ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పది అంతస్తుల మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బోయమని సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పరశురామ్, ట్రెజరర్ ఈ. శ్రీనివాస్, సిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు వసంతి, సిటీ కార్యదర్శి క్రాంతి కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ సుబ్బారావు, సిటీ కార్యదర్శి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు నిర్మితమవుతుంది: ఎస్ఐ నాగరాజు

మల్కాపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

కోయిలకొండ: నవంబర్ 13, వుదయం

మల్కాపురం: విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, తరగతి గదుల్లోనే భావి భారత పౌరులు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకులు తయారవుతారని ఎస్ఐ నాగరాజు అన్నారు. శుక్రవారం మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ నాగరాజు విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలను గుర్తుచేస్తూ.. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, సమాజ సేవకులు, ఆదర్శ రైతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకొని, వాటిని సాధించే దిశగా క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి తల్లి దండ్రి తమ పిల్లలు ఉన్నత స్థానాలకు



చేరుకోవాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి భవిష్యత్తు కోసం అనేక కష్టనష్టాలను భరిస్తూ చదివిస్తున్నారని ఎస్ఐ నాగరాజు తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడిక అలవర్చుకోవాలని చెప్పారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు చెడు స్నేహాలు, క్షణికావేశం, తప్పుడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ హెచ్చరించారు. ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. సరదా కోసం లేదా స్నేహితుల ఒత్తిడికి లొంగి మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. ఒక్కసారి చెడు అలవాట్లకు బానిసైతే చదువు, ఆరోగ్యం, కుటుంబ గౌరవం, భవిష్యత్తు అన్నీ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసినా, అలాంటి పదార్థాల విక్రయాలు లేదా సరఫరా గురించి సమాచారం తెలిసినా భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చివరగా ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి దృష్టి సారించాలని ఎస్ఐ నాగరాజు పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి కుటుంబానికి, పాఠశాలకు, సమాజానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆక్రమణలను అడ్డుకునేందుకు
రెవెన్యూ అధికారుల చర్యలు – సూచిక బోర్డు ఏర్పాటు



బాలానగర్: నవంబర్ 13, వుదయం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బాలానగర్ మండల కేంద్రంలోని సర్వే నంబర్ 209లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుమారు 1.06 గుంటల ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించకుండా ఉండేందుకు శుక్రవారం రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని తెలియజేస్తూ, భూమి హద్దులను గుర్తించేలా బోర్డును ఏర్పాటు చేశారు. గతంలో కొందరు వ్యక్తులు ఈ ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు సమాచారం. దీంతో భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ భూములను కాపాడటం, ప్రజా ఆస్తులను పరిరక్షించడం రెవెన్యూ శాఖ బాధ్యతగా భావించి అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఎమ్మెల్యే సొంత నిధులతో
తాండలో బోరు బావి ఏర్పాటు

కుత్బుల్లాపూర్, నవంబర్ 13,(వుదయం ప్రతినిధి),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ, డివిజన్ 296, దుండిగల్ తాండా 1 వాసుల దాహార్తిని తీర్చుటకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు కె.పి. వివేకానంద్ తన సొంత నిధులతో మంచినీటి బోరు బావి వేయించి, మోటారు బిగించి తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ బోరు బావి కీ॥శే కె.వై.ఎం. పాండు జ్ఞాపకార్థం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండా వాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తాగునీటి సమస్య లేకుండా చూస్తానని హామీ



ఇచ్చారు. తాండా వాసులు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శంబిపూర్ కృష్ణ, స్థానిక నాయకులు మాలోత్ భీం సింగ్ నాయక్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాలోత్ జగన్ నాయక్, మాలోత్ మహేందర్ నాయక్, తాండా వాసులు, ప్రజా ప్రతినిధులు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పింఛనులు
- నేలకొండపల్లిలో లబ్ధిదారులకు క్రొత్త చేయూత పింఛన్ల మంజూరు ఆర్డర్లను పంపిణీ చేసిన మంత్రి



ఖమ్మం వుదయం బ్యూరో నేలకొండపల్లి, నవంబర్- 13

పేదవాని సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, నేలకొండపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నేలకొండపల్లి మండలంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్దిదారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు 7-8 సంవత్సరాల నుంచి భర్తలను కోల్పోయి, తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆడబిడ్డల బాధలను గతంలో గ్రామాల్లో నేరుగా వారి ఇంటికి వెళ్లినప్పుడు ప్రత్యక్షంగా చూశామని, వారి మనసులోని వేదనను స్వయంగా పంచుకున్నామని తెలిపారు. కేవలం ఆడబిడ్డలే కాకుండా, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు ఇలా వందలాది మంది పడిన వేదనను ఈ ప్రజా ప్రభుత్వం స్వయంగా చూసిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాళ్లకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే అర్హులైన ప్రతి పేదవాడికి పింఛన్ అందించాలనే లక్ష్యంతో మొన్న దీపావళి పండుగ రోజున రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి పైగా అర్హులకు పింఛన్లు అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గత 7-8 సంవత్సరాలుగా కాళ్లు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగిన మహిళలకు దీపావళి నాడు వారి ఇంట్లోనే శుభవార్త చెప్పడం జరిగిందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో క్రొత్తగా 1,138 మందికి ఆసరా పింఛన్లు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ మండలానికి గతంతో కలుపుకొని ప్రతి నెల రూ. ఒక కోటి 82 లక్షలు ప్రజా ప్రభుత్వం ద్వారా నేరుగా పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత బాగాలేకపోయినా, పేదవాళ్ల వద్దకు, ఆడబిడ్డల వద్దకు, వికలాంగులు, గీత, చేనేత కార్మికుల వద్దకు ఒక్క అడుగు కూడా వెనకడుగు వేయకుండా పూర్తి భరోసా కల్పించడమే ఈ ప్రభుత్వ ప్రధాన ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పెద్దోళ్లు తినే సన్నబియ్యాన్ని ఇకపై పేదోళ్లందరూ తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం 7 సంవత్సరాలు ఎదురుచూసిన వారికి, కొత్త కోడళ్లు లేదా కొత్త సభ్యులు చేరిన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం రాగానే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు.

గతంలో హామీ ఇచ్చిన విధంగా 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సులో ఎంత దూర ప్రయాణం చేసినా ఉచిత బస్సు సౌకర్యాన్ని విజయవంతంగా కల్పిస్తున్నామని తెలిపారు. రైతును రాజును చేస్తామన్న మాటకు కట్టుబడి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, ఎకరానికి రూ. 12 వేలు రెండు విడతలుగా రైతు భరోసా అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతన్నలకు మొదటి పంటకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కాళేశ్వరం కడితే లక్ష కోట్లు కమీషన్ వస్తుంది కాని, పేదోడికి ఇళ్లు ఇస్తే కమీషన్ రాదన్న దుర్బుద్ధితో గత పాలకులు వ్యవహరించారని, కానీ ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని, అలాగే హైదరాబాదులో ఒక లక్ష ఇళ్లు, మొత్తం 8 లక్షల ఇళ్లు రూ. 40 వేల కోట్లతో పేద ఆడబిడ్డలకు ఇస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల మతాలకతీతంగా పింక్ షర్టు వేసుకుని వచ్చినా, అర్హులైన ప్రతి పేద మహిళకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కె. శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూస సీతారాములు, ఎంపిడిఓ ఎర్రయ్య, తహసీల్దార్ రాంప్రసాద్, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

అనర్హులకు చేయూత.. అర్హులకు మొండిచేయి

మండలంలో పెన్షన్ మంజూరుపై సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

అనంతగిరి, నవంబర్ 13 వుదయం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా పెన్షన్ల మంజూరులో నిజమైన అర్హులకు న్యాయం జరుగుతోందా? అన్న ప్రశ్నలు అనంతగిరి మండలంలో వ్యక్తమవుతున్నాయి.వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తున్నప్పటికీ, మండలంలోని పలు గ్రామాల్లో అర్హత లేని వారికి సైతం పెన్షన్ మంజూరు పత్రాలు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి ముఖ్యంగా కొందరు దివ్యాంగులు కానప్పటికీ వారికి సదరం ధ్రువ పత్రాలు మంజూరైనట్లు సమాచారం.దీంతో నిజంగా వైకల్యంతో బాధపడుతూ పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్దిదారులకు చేరాల్సి ఉండగా, అర్హతల పరిశీలనలో లోపాలు ఉంటే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయే ప్రమాదం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అధికారులు స్పందించాలి.. అర్హతలపై సమగ్ర విచారణ చేపట్టాలి!

అనంతగిరి మండలంలోని అన్ని గ్రామాల్లో మంజూరైన పెన్షన్లపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, సదరం ధ్రువపత్రాల ప్రామాణికతను పరిశీలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.నిజమైన అర్హులను గుర్తించి వారికి పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా లబ్ది పొందినట్లు తేలితే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు...

పెన్షన్ల మంజూరుపై సమగ్ర విచారణ చేపడతాం : ఎంపీడీవో

అనంతగిరి మండలంలోని పెన్షన్ల మంజూరులో అర్హత లేని వారికి లబ్ది చేకూరుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఎంపీడీవోను వివరణ కోరగా . ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, క్షేత్రస్థాయిలో అర్హతలను పరిశీలిస్తామని తెలిపారు. విచారణలో అర్హత లేని వారు పెన్షన్లు పొందుతున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం వారిని తొలగిస్తామని స్పష్టం చేశారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య

భద్రాచలం 13/11/26 వుదయం ప్రతినిధి:



భద్రాచలం పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించకుండా అనర్హులకు ఇళ్లు కేటాయించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య అన్నారు. నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు సొంత ఇంటి కోసం ఎదురుచూస్తుంటే, కొంతమంది తమను నిరుపేదలుగా పేర్కొంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పొందిన అనంతరం వాటిని ఇతరులకు అద్దెకు ఇచ్చి నెలనెలా అద్దెలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. శుక్రవారం భద్రాచలంలోని మనుబోతుల చెరువు సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద అర్హులైన నిరుపేదలతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కనగాల చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని కనగాల చైతన్య స్పష్టం చేశారు. పేదల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన పార్టీ నిరంతరం అండగా ఉంటుందని, అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై పారదర్శక విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు.

రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ కలయిక

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును కలిసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)



దమ్మపేట మండల పర్యటనలో భాగంగా తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును వారి నివాసంలో ఆత్మీయంగా కలిశారు ఈ సందర్భంగా ఇద్దరు నేతలు ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు రాజకీయాల్లో వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా మంచి సంబంధాలు కొనసాగాలని పరస్పర గౌరవంతో ఆప్యాయంగా మాట్లాడుకున్నారు అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రజల సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై చర్చించుకున్నారు రాజకీయాలకు అతీతంగా ప్రజల మేలు నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమనే భావనతో సాగిన ఈ కలయిక అందరినీ ఆకట్టుకుంది. ప్రజా జీవితంలో రాజకీయాల కంటే మానవ సంబంధాలు ఆప్యాయతకు ఎంతో విలువ ఉంటుందని ఈ ఆత్మీయ భేటీ చాటిచెప్పింది.



క్విజ్ కాంపిటీషన్ పోటీలకు శిక్షణ

నల్గొండ, వుదయం ప్రతినిధి

శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్విజ్ కాంపిటీషన్ పోటీలకు శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యత ,ఓటు హక్కు సద్వినియోగం,తదితర అంశాల పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు.ఈ సందర్భంగా ఆయన పోటీలలో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ పరుశురాం, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు ఉన్నారు.

విలీన మండలాల్లో శాశ్వతంగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి

- చింతూరు లేదా ఎటపాకలో పూర్తిస్థాయి కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తులకు వినతిపత్రాలు సమర్పించిన న్యాయవాదుల సంఘం
- గిరిజన ప్రజలకు స్థానికంగానే సత్వర న్యాయం అందించాలి

భద్రాచలం, 13/11/26 వుదయం ప్రతినిధి:



పోలవరం జిల్లాలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం నాలుగు విలీన మండలాల ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, వారికి స్థానికంగానే సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో చింతూరు రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో గానీ, ఎటపాక మండల కేంద్రంలో గానీ పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాశ్వతంగా ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవ న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్‌లను కలిసి అధికారికంగా వినతిపత్రాలు సమర్పించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ అడ్వకేట్ జనరల్ శ్రీ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు కూడా వినతిపత్రం అందజేసి విలీన మండలాల్లో శాశ్వత కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. పోలవరం జిల్లాలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం నాలుగు విలీన ఏజెన్సీ మండలాల ప్రజలు కోర్టు సంబంధిత వ్యవహారాల కోసం ప్రస్తుతం సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు న్యాయస్థానాల్లో జరిగే విచారణలకు హాజరయ్యేందుకు అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. కోర్టుకు వెళ్లేందుకు రవాణా ఖర్చులు భరించడంతో పాటు ప్రయాణ సమయం కారణంగా రోజువారీ పనులకు దూరమవుతూ కూలీ ఆదాయాన్ని సైతం కోల్పోతున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని న్యాయవాదుల ప్రతినిధి బృందం హైకోర్టు న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లింది. నాలుగు విలీన మండలాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనమైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అందుబాటులో లేకపోవడం వల్ల అనేక కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని వారు వివరించారు. స్థానికంగా న్యాయస్థానం లేకపోవడంతో గిరిజన ప్రజలు చిన్నచిన్న న్యాయపరమైన వ్యవహారాల కోసం కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, డబ్బు వృథా కావడమే కాకుండా న్యాయప్రక్రియలో పాల్గొనడం వారికి భారంగా మారుతోందని పేర్కొన్నారు. చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాలకు రవాణా పరంగా అనుకూలంగా ఉండే చింతూరు రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో లేదా ఎటపాక మండల కేంద్రంలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ కోర్టు ఏర్పాటుతో నాలుగు మండలాల ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువవుతాయని, కేసుల విచారణ వేగవంతం కావడంతో పాటు కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్

- సూర్యాపేట పోలీసులకు చిక్కిన ముఠా
- 112 కిలోల గంజాయి పట్టివేత, ఇద్దరు అరెస్ట్ - రూ.25 లక్షల విలువ



సూర్యాపేట, నవంబర్ 13 : వుదయం ప్రతినిధి

ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును సూర్యాపేట పోలీసులు రట్టు చేశారు. 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ముఠాగా ఏర్పడ్డారు. ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఒడిశాలోని జగన్నాథపురి ప్రాంతంలో కిలో రూ.2 వేల చొప్పున 112 కిలోల గంజాయిని రూ.2.24 లక్షలకు కొనుగోలు చేశారు. 41 ప్యాకెట్లుగా తయారు చేసి ఇన్నోవా కారులో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పోలీసుల నుండి తప్పించుకునేందుకు ముందు మరో ఎర్టిగా కారును ఎస్కార్ట్ గా నడుపుతూ పోలీసుల కదలికలపై నిఘా పెట్టారు. నవంబర్ 7న సూర్యాపేట శివారులో జాతీయ రహదారి 65 పై పద్మావతి ఫంక్షన్ హాల్ వద్ద ఇన్నోవా కారు బ్రేక్ డౌన్ కావడంతో వాహనాన్ని వదిలి పరారయ్యారు. అనుమానాస్పదంగా కారు ఉందన్న సమాచారంతో సూర్యాపేట 2 టౌన్ ఎస్సైలు కె. గోపికృష్ణ, బి. రామచంద్రం సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా 41 ప్యాకెట్లలో 112 కిలోల గంజాయి బయటపడింది. గంజాయి, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వాహనాన్ని తిరిగి తీసుకెళ్లేందుకు నవంబర్ 12న సూర్యాపేటకు వచ్చిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అరెస్ట్ అయిన నిందితులు:

ఆకాష్ విజయ్ దాబేకర్ (23), బీడ్ జిల్లా, మహారాష్ట్ర

ఆకాష్ దిలీప్ మోరే (32), బుల్దానా జిల్లా, మహారాష్ట్ర

వారి నుండి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచి రిమాండ్ కు తరలించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.

మాదకద్రవ్యాలపై ఉపేక్షించేది లేదని, యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కోరారు. ఈ కేసును ఛేదించిన పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్సైలు గోపికృష్ణ, రామచందర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు కొండా రమేష్, ఎన్. నవీన్ లను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి, లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష

మునగాల, నవంబర్ 13 (వుదయం):

మహిళపై దాడి, లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో జగన్నాథపురం గ్రామానికి చెందిన బొల్లం సింహాద్రికి కోదాడ రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన కేసులో నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతిలోని 354, 354-ఏ, 323 సెక్షన్ల కింద కేసు నమోదైంది. విచారణ అనంతరం న్యాయమూర్తి మహమ్మద్ ఉమర్ శుక్రవారం తీర్పు వెల్లడిస్తూ 354 సెక్షన్ కింద రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా, 354-ఏ సెక్షన్ కింద మరో రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది. మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఆరోగ్య సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- నషా విముక్త్ భారత్ లో భాగంగా పాఠశాల విద్యార్థులకు చేపట్టిన క్విజ్ పోటీల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



ఖమ్మం వుదయం బ్యూరో నవంబర్ - 13

మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందులో సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నషా విముక్త్ భారత్ కింద పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ నిరోధ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు 600 మంది సభ్యులతో ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల కేసులు నమోదు చేసి, 19 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కఠిన సెక్షన్లు నమోదు చేశారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎవరు ఫోన్లు చేసి సిఫార్సులు చేసినా ఉపేక్షించేది లేదని, తన సొంత మనుషులైనా సరే చట్టప్రకారం జైలుకు పంపాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని మంత్రి తెలిపారు. కేవలం వినియోగదారులపైనే కాకుండా, డ్రగ్స్ సరఫరా మూలాలను గుర్తించి వాటిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు ఫ్యాషన్ కోసమో, స్నేహితుల ఒత్తిడితోనో మత్తు పదార్థాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మంత్రి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అదనపు కమిషనర్ కిషన్, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ డి. జానయ్య, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సూర్యాపేట జిల్లా సంక్షేమ శాఖ అధికారి కందిబండ నరసింహారావు

సూర్యాపేట, నవంబర్ 13, వుదయం ప్రతినిధి

వృద్ధాప్యానికి భరోసా కల్పిస్తూ వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కందిబండ నరసింహారావు అన్నారు. వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సయోధ్య డేకేర్ సెంటర్ లో శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధులకు పింఛన్ తో పాటు ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. వృద్ధుల హక్కులకు రక్షణ కల్పిస్తూ, వారి జీవితాలకు భద్రత కల్పిస్తుందన్నారు. వయోవృద్ధుల సంక్షేమ హక్కుల 2007 చట్టానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం వయోవృద్ధుల కోసం 2026 సమగ్ర చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. సయోధ్య కేంద్రం ఇంచార్జ్, కవి, గాయకుడు గొద్దలి నరసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షురాలు ఇరిగి కోటేశ్వరి మాట్లాడుతూ.. వృద్ధుల సంక్షేమమే సమాజ సంస్కారానికి నిదర్శనమని, వృద్ధులు సమాజానికి విజ్ఞాన భాండాగారాలని అన్నారు. సయోధ్య వ్యవస్థాపక చైర్మన్ సుమబాల మాట్లాడుతూ కన్నవారిని కాపాడటం కన్నబిడ్డల బాధ్యత అని, వృద్ధులను ఆదరించడం సమాజ ధర్మమని అన్నారు. వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కవి అమిద్ ఖాన్ మాట్లాడుతూ వృద్ధులకు ఆరోగ్య, ఆర్థిక, సామాజిక భద్రత ఉండాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కృష్ణ బంటు మాట్లాడుతూ వృద్ధులే ఉమ్మడి కుటుంబాలకు వెలుగులని, తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల కృష్ణారెడ్డి, యాదగిరి, మద్ది ఉపేందర్ రెడ్డి, సూరం రేణుక తదితరులు ప్రసంగించారు. గొద్దలి నరసన్న పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులను శాలువాలతో సన్మానించి, దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు.



ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం

అనంతగిరి, నవంబర్ 13 వుదయం

మండల పరిధిలోని పాలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలనా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ బాధ్యతలను స్వీకరించి ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూ పాఠశాల నిర్వహణలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరియాల వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ఆలోచనా విధానం పెంపొందించడమే స్వపరిపాలనా దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

చర్చిల వైట్ వాష్ నిధిని రూ.50 వేలకు పెంచాలి


నవంబర్ 25 లోపే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి - బిషప్ దుర్గం ప్రభాకర్

సూర్యాపేట రూరల్, నవంబర్ 13 :వుదయం ప్రతినిధి



తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు ఇచ్చే వైట్ వాష్, లైటింగ్ డెకరేషన్ నిధిని రూ.50 వేలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సూర్యాపేట రూరల్ మండలం కేసారం గ్రామంలోని బేతెస్థ ప్రార్థనా మందిరంలో శుక్రవారం జరిగిన మంత్లీ పాస్టర్స్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. గత ఏడాది ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చర్చిలకు రూ.30 వేలు మంజూరు చేసినప్పటికీ, జనవరిలో ఇవ్వడం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది అలా కాకుండా నవంబర్ 25 లోపే రూ.50 వేలు విడుదల చేసి, డిసెంబర్ నెలలో జరిగే క్రిస్మస్ పండుగను రాష్ట్రంలోని క్రైస్తవులు ఘనంగా, సంతోషంగా జరుపుకునేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ లను కోరారు. కార్యక్రమంలో సువార్త చర్చి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ శ్యామ్ ప్రసాద్, బిషప్ ముల్లంగి జాకబ్ రాజు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, రూరల్ అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, రెవ. డా. పంది మార్క్, సి.హెచ్. కిరణ్ కుమార్, పి.వి. బోయాజ్, పిట్టల సామెల్, బొల్లెద్దు మోషే, ఎన్. భాస్కర్, రూబెన్, ప్రేమ్ సాగర్, హెబ్రోన్ రాజు, రక్షకన్, యాకోబు, కొమ్ము హోసన్నా, రెంటాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్రికూట శివాలయానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు వినతి




దామరచర్ల మండలం నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామంలోని పురాతన త్రికూట శివాలయానికి విచ్చేసే భక్తులు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ శ్రీ కేతావత్ శంకర్ నాయక్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం త్రికూట శివాలయం నుంచి లక్ష్మీపురం గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు.


దళితబంధం అక్రమాలపై సమాధానం చెప్పిన తర్వాతే ప్రభుత్వాన్ని విమర్శించాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు

కోదాడ నవంబర్ 13(వుదయం)



దళితబంధం పథకం అమలులో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగిందా? లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం చోటుచేసుకుందా? అర్హులను పక్కనపెట్టి అనర్హులకు ప్రయోజనం కల్పించారా? అనే అంశాలపై బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ప్రజాస్వామ్యంలో భాగమేనని, అయితే రైతుల కష్టాలను రాజకీయ విమర్శలకు అస్త్రాలుగా ఉపయోగించుకోవడం సమంజసం కాదన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలు, పరిష్కరించిన సమస్యలపై మాజీ ఎమ్మెల్యే ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, బోనస్ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందన్నారు. గత పాలనలో జరిగిన పరిణామాలపై సమాధానం చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించడం సమంజసం కాదని, ముందుగా దళితబంధం పథకం అమలుపై ప్రజలకు స్పష్టత ఇచ్చిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై మాట్లాడాలని రావెళ్ల కృష్ణారావు హితవు పలికారు. రాజకీయ విమర్శలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు.



"ఆధునిక యుద్ధతంత్రం వేగంగా మారుతున్న నేపథ్యంలో సంప్రదాయ ముప్పులతో పాటు కొత్తగా ఎదురయ్యే ప్రమాదాలనూ సమర్థంగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలి. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన యుద్ధతంత్రాలను బలోపేతం చేసుకోవాలి. నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలి. ముప్పును ముందే పసిగట్టి నష్టాలను నివారించాలి. శత్రువులు కోలుకోవడానికి సమయం ఇవ్వని సామర్థ్యాలను రక్షణ దళాలు పెంపొందించుకోవాలి. మన చర్యలు వారిఊహకందని విధంగా ఉండాలి."

- రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి


వే'మన' పద్యం

పట్టుపట్టరాదు పట్టి విడువరాదు

పట్టెనేని బిగియ బట్టవలయు

బట్టివిడచుకన్న బరగ జచ్చుటమేలు

విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

ఎన్నికల పారదర్శకత ఏది?

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలే ప్రాణాధారం. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం తప్పనిసరి. కానీ, దేశంలో ఎన్నికల నిర్వహణ తీరు ఈ మౌలిక సూత్రాలకే విఘాతం కలిగిస్తోంది. ఎన్నికల కమిషనర్ల నియామకం నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు అనేక అంశాలు వివాదాస్పదమవుతున్నాయి. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు బలపడుతున్నాయి. తాజాగా 'రిపోర్టర్స్ కలెక్టివ్' వెల్లడించిన పరిశోధన ఎన్నికల నిర్వహణలోని లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది.2024 ఎన్నికలకు సంబంధించి మహారాష్ట్ర, హర్యానా, జమ్మూకశ్మీర్‌లలోని 530 లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నివేదికలను 'రిపోర్టర్స్ కలెక్టివ్' పరిశీలించింది. వీటిలో 19 నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల సంఖ్య నమోదు చేయాల్సిన చోట సున్నా లేదా నిల్ అని పేర్కొన్నారు. మరో 32 నియోజకవర్గాల్లో నమోదైన ఓట్లకు, ఈవీఎంలలో లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలున్నట్లు గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఈ వ్యత్యాసాలకు కారణాలేమిటో, వాటిని ఎలా పరిష్కరించారో సంబంధిత రికార్డుల్లో ఎలాంటి వివరణ లేదు.సాధారణంగా పోలింగ్ కేంద్రానికి వచ్చిన ప్రతి ఓటరు వివరాలను ఫారం 17ఎలో నమోదు చేస్తారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలో నమోదైన ఓట్ల వివరాలను ఫారం 17సిలో పొందుపరుస్తారు. ఈ రెండు రికార్డుల్లోని ఓట్ల సంఖ్య సరిపోలాలి. ఏవైనా తేడాలుంటే వాటికి కారణాలను గుర్తించి, తగిన వివరణ నమోదు చేయడం అధికారుల బాధ్యత. కానీ, 51 నియోజకవర్గాల్లో ఇలాంటి ప్రక్రియ పాటించకపోవడం ఎన్నికల నిర్వహణలోని నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. ఇది కేవలం సాంకేతిక తప్పిదంగా కొట్టిపారేయదగిన విషయం కాదు. ఎన్నికల విశ్వసనీయతకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్న. అయితే, ఇంతటి భారీ వ్యత్యాసాలు ఎలా చోటుచేసుకున్నాయి? వాటిని సరిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? బాధ్యులపై చర్యలు తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేవు. హర్యానాలోని కైతాల్‌లో కేవలం 215 మంది ఓటు వేసినట్లు రికార్డుల్లో ఉండగా, ఈవీఎంలో 1,67,285 ఓట్లు లెక్కించినట్లు నమోదైంది. ఇలాంటి అసాధారణ వ్యత్యాసాలపై ఎన్నికల సంఘం మౌనం వహించడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.ఇక్కడ ప్రధానంగా చర్చించాల్సింది తప్పిదాలు జరగడమే కాదు, వాటిపై వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘం ఎందుకు వెనుకాడుతోందన్నది. ఎన్నికల నిర్వహణలో పొరపాట్లు జరిగితే వాటిని అంగీకరించి సరిదిద్దుకోవాలి ఈ దాపరికానికి కేంద్ర ప్రభుత్వ చర్యలు మరింత బలం చేకూర్చాయి. 2024 డిసెంబర్ 20న కేంద్ర న్యాయ శాఖ ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 93(2)(ఎ)ను సవరించింది. గతంలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉన్న ఎన్నికల పత్రాల పరిధిని ఈ సవరణ ద్వారా కుదించింది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల పర్యవేక్షణను విస్తృతం చేయాల్సిన సమయంలో, సమాచారాన్ని పరిశీలించే అవకాశాలనే పరిమితం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వాలు, ఎన్నికల సంఘం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేవు.

ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను కాపాడుకోవాలంటే పారదర్శకతకు పెద్దపీట వేయాలి. రిటర్నింగ్ అధికారుల నివేదికలు, పోలింగ్ కేంద్రాల వారీగా ఫారం 17ఎ, ఫారం 17సి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఓట్ల లెక్కింపులో తేడాలు కనిపించిన ప్రతి సందర్భంలోనూ వాటికి సంబంధించిన కారణాలను స్పష్టంగా వెల్లడించాలి. అవసరమైన చోట స్వతంత్ర విచారణకు అవకాశం కల్పించాలి. ఎన్నికల నిర్వహణలో ప్రతి దశకూ జవాబుదారీతనం ఉండాలి.ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఒక గుర్తుపై వేసే ముద్ర కాదు. అది ప్రజల ఆకాంక్షలకు, రాజకీయ భవిష్యత్తుకు ప్రతీక. ఆ ఓటు సక్రమంగా నమోదైందా? లెక్కింపులోకి వచ్చిందా? ఫలితాల్లో ప్రతిబింబించిందా? అనే విషయాలను తెలుసుకునే హక్కు ప్రతి ఓటరుకూ ఉంది. ఆ హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రజల్లో అనుమానాలకు తావిచ్చేలా వ్యవహరించడం ఆందోళనకరం. ఎన్నికల విశ్వసనీయతపై ప్రజల్లో సందేహాలు పెరిగితే దెబ్బతినేది ఒక సంస్థ ప్రతిష్ఠ మాత్రమే కాదు.. దేశ ప్రజాస్వామ్య పునాదులే. అందుకే ఎన్నికల సంఘం మౌనం వీడి, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి. ఓటు విలువను కాపాడటమే ప్రజాస్వామ్య పరిరక్షణకు అసలైన గీటురాయి.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

నిశ్శబ్దహంతకి పట్ల అప్రమత్తంగా అనివార్యం

చక్కెర వ్యాధి... ఈ వ్యాధికి పేరులోనే చక్కెర... దాని ఫలితమంతా ఎంతో చేదు. ఆ వ్యాధి వస్తే చక్కెరకు ఇక దాదాపుగా దూరమైపోయినట్లే. షుగర్ వ్యాధిని ఆధునిక యుగపు మహమ్మారిగా భావించవచ్చు. అత్యంత వేగంగా పరుగెడుతున్న కాలంతో పాటే అనివార్యంగా జీవనశైలిలో చోటుచేసుకుంటున్న మార్పులే షుగర్ వ్యాధికి అసలు కారణం. మౌలికంగా ఇది జీవన శైలి సమస్య. వేదకాలంలో మధుమేహ ప్రస్తావన ఉంది. ఆ కాలంలో మధుమేహాన్ని 'అశ్రవ' అనే పేరుతో గుర్తించారు.ఈ వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి లక్షణాలు ఏమిటి అని చరక సంహిత, శుశ్రవ సంహిత, నాగభట్ట గ్రంథాలలో వివరించారు. క్రీస్తు శకానికి వెయ్యి సంవత్సరాల కిందటనే ఈ వ్యాధి వర్ణన ఉండడం విశేషం. యజ్ఞ సమయాలలో దేవతలకు సమర్పించే హవిస్సును భుజించడం వలన ఈవ్యాధి వచ్చినట్లు పేర్కొన్నారు. దక్ష ప్రజాపతి చేసిన యజ్ఞంలో హవిస్సు భుజించడం వలన ఈ వ్యాధి వచ్చినట్లు ప్రస్తావన ఉంది. క్రీస్తు శకం ఆరవ శతాబ్దంలో అష్టాంగ హృదయ అనే గ్రంథంలో మధుమేహం అనే పదం వాడబడింది. తేనెను మధువు అని అంటారు కనుక ఈ వ్యాధిగ్రస్థుల మూత్రం తేనెరంగు ఉంటుందని దీనికి ఈ పేరు వచ్చిందని భావన. 1400 సంవత్సరాల క్రితమే ఈ వ్యాధిని పత్యం, ఔషధం, వ్యాయామంతో క్రమపరచవచ్చని పేర్కొన్నారు. దాదాపు ఇప్పటికీ అనుసరిస్తున్న విధానం అదే కావడం గమనార్హం.అంత ర్జాతీయ మధు మేహ సమాఖ్య, ప్రపంచ ఆరోగ్య సంస్థలు 1991 నుండి ప్రతి సంవత్సరం నవంబరు 14వ తేదిని మధుమేహ దినంగా పాటిస్తున్నాయి. 1922లో ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బేంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న మధుమేహ దినంగా పాటిస్తున్నారు. 2006 డిసెంబర్ 20న ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లి ఆమోదించిన తీర్మానం ప్రకారం మధుమేహ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న, ఆందోళనకర దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి 2007నుండి మధుమేహ దినాన్ని ప్రజల్లో అవగాహం , చైతన్యం పెంచే కార్యక్రమాలతో సభ్యదేశాలన్ని అధికారికంగా జరపాలని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది. దయాబెటీస్ ఎలా వస్తుంది , దానివలం వచ్చే ముప్పు ఏమిటి , రాకుండా ఏమి చేయాలి , వచ్చాక ఎలాంటి జాగ్రత్తలు తీలుకోవాలి అనే అంశాలను ప్రచారము చేసే ప్రయత్నమే ఈ డయాబెటిక్ డే ముఖ్య ఉద్దేశము. ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ మారిపోయింది. మధుమేహ సమస్య భారత్‌లో అత్యధికంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో 15 కోట్ల మంది, దేశంలో 4 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. 2025 నాటికి భారత దేశంలో ఈ వ్యాధిపీడితుల సంఖ్య 7 కోట్లకు చేరుకోగలదని భావిస్తున్నారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ వ్యాధి మరింత అధికంగా ఉంది.మధుమేహం కారణంగా ప్రతీ నిమిషానికి ఆరుగురు మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 20 మరణాల్లో ఒకటి మధుమేహం కారణంగానే చోటు చేసుకుంటున్నది. మధుమేహం, సంబంధిత వ్యాధుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 32 లక్షల మంది మరణిస్తున్నారు. మధుమేహం ను నిశ్శబ్దహంతకిగా అభివర్ణిస్తారు. దీన్ని నివారించడం అంత తేలిక కానప్పటికీ, కొన్ని రకాల విధివిధానాలు పాటించడం ద్వారా దీన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్యభాషలో ''డయాబెటిస్ మెల్లిటస్'' అని వ్యవహరిస్తారు. డయాబెటిస్ అని కూడా వ్యవహరించే ఈ వ్యాధి, ఇన్సులిన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రిత మెటబాలిజం, రక్తంలో అధిక గ్లూకోజ్ స్థాయి వంటి లక్షణాలతో కూడిన ఒక రుగ్మత. అతిమూత్రం (పాలీయూరియా), దాహం ఎక్కువగా వేయడం (పాలీడిప్సియా), అతిగా ఆకలి వేయడము (పాలీ ఫేజియా), మంద గించిన చూపు, కారణం లేకుండా బరువు తగ్గడం, బద్ధకం దీని ముఖ్య లక్షణాలు. మధు మేహం లేదా చక్కెర వ్యాధిని సాధారణంగా రక్తంలో మితి మీరిన చక్కెర స్థాయిని బట్టి గుర్తిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారత దేశం, చైనా, అమెరికాలలో అత్యధికంగా ఈ వ్యాధి ప్రబలి ఉన్నది. ఈ వ్యాధిని పూర్తిగా తగ్గించే మందులు లేవు. జీవితాంతం తగిన జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే దీన్ని అదుపులో ఉంచుకోవడం సాధ్యం. 1921లో ఇన్సులిన్ అందుబాటులోకి రావడంతో అన్ని రకాలను నియంత్రించడం సాధ్యమయ్యింది. ఆహార అలవాట్ల మార్పు కూడా భాగమయినప్పటికీ, ఇన్సులిన్ ఉత్పత్తి లేని మొదటి రకాన్ని నియంత్రించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇవ్వటం తప్పనిసరి మార్గం. రెండవ రకం ఆహార అలవాట్ల మార్పు, ఆంటీ డయాబెటిక్ మందుల వాడకం వల్ల, అప్పుడప్పుడు ఇన్సులిన్ వాడకం వల్ల నియంత్రించవచ్చు.

చక్కెర శాతం 400 మి.గ్రా. కన్నా ఎక్కువ కావడం...దీనినే డయాబెటిక్ కీటో అసిడోసిస్ అని కూడా అంటారు. ఈ స్థితిలో ఎక్కువగా దాహం, నాలుక తడారి పోవడం, మత్తుగా ఉండడం, వాంతులు, పొత్తి కడుపునొప్పి, తలనొప్పి, తలతిరగడం, విపరీతమైన నీరసం, ఒళ్ళు నొప్పులు లక్షణాలుగా ఉంటాయి. ఈ సమయంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ దశలో కూడా తాత్సారం చేస్తే మరణానికి దారి తీయవచ్చు.

రక్తంలో చక్కెర శాతం 60 మి.గ్రా కన్నా తగ్గడం..షుగర్ లేదా హైపోగ్లైసి మియా అంటారు. మధుమేహ వ్యాధిని రక్త, మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. సాధారణంగా రక్తంలో చక్కెర శాతం 80 నుంచి 140 మి.గ్రా వరకు ఉంటుంది. ఇంత కన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు చక్కెర శాతం 60 నుంచి 90 ఎంజీ / డీఎల్, తిన్న తరువాత 110 నుంచి 140 ఎంజీ / డీఎల్ ఉండాలి. ఇంతకన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. చక్కెర వ్యాధికి ఆయుర్వేద మందులు కూడా ఉన్నాయి. భారతీయ ఆహారంలో తీపి, ఉప్పు, పులుపు, వగరు, చేదు, కారం లాంటి ఆరు రుచుల గురించి ప్రధానంగా పేర్కొన్నారు. ఆహారంలో తప్పని సరిగా ఆరు రుచులు ఉండాలన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు కారం, వగరు, చేదు, రసాలు కలిగిన కూరగాయలు బాగా తీసుకోవలసి ఉంటుంది. శక్తిని ఇచ్చే అన్నం ఎక్కువగా తీసు కోకుండా, పొట్టు కలిగిన జొన్నరొట్టె, గోధుమ పుల్కాలు, సజ్జ రొట్టె తీసుకుంటే రక్తంలో చక్కెర శాతం పెరగకుండా ఉంటుంది.అలజడి, కోపం తగ్గించుకొని మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. యోగా, ధ్యానం, నడక లాంటివి చక్కెర వ్యాధి రాకుండా నిరోధిస్తాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

స్వచ్ఛమైన నీటిలో..
చేపల సంపద తక్కువ
బురద నీటిలో మాత్రం...
చేపల సంత అత్యధికం
స్వచ్ఛమైన మనుషులకు..
నడవంత్రపు నరులు దూరం
దురాలోచనలు చేసే వారి
చుట్టు..
మూగుతారు జనసంద్రం!
పైలెట్ పేరు
తెలియకపోయినా..
విమానయానాన్ని ధైర్యంగా
చేస్తాం
జీవన ప్రయాణ వాహన విశ్వ
డ్రైవర్..
పైవాడిని తెలిసినా
సంకోచిస్తున్నాం
సత్కర్మతోనే అడ్డంకులు
మటుమాయం!

దిగదుడుపే..!

అలల్ని చూసి నావ
భయపడదు
కష్టాలను చూసి వెనకడుగు
వేయవద్దు
పడి లేవడం, లేచి పడడమే
జీవితం
సంఘర్షణ కొనసాగిస్తేనే
సాఫల్య తీరం
ప్రయత్నం చేస్తేనే తుదకు
గెలుపు ఖాయం!
అగ్గి పుల్లతో పొయ్యి
వెలిగించవచ్చు
పొరుగు ఇంటికి
నిప్పంటించవచ్చు
సిగరెట్ వెలిగించి పొగ
ఊదవచ్చు

అగ్గిపుల్లను వాడటం
తెలిసినోడే..
సమాజ పురోగతికి నిచ్చెనగా
నిలుస్తాడు!
తల్లిని ఒక కోరిక
కోరుకొమ్మంటే..
నా పిల్లల తలరాతను నేనే
రాసుకునే..
వరాన్ని
ప్రసాదించమంటుంది
పిల్లల ఉన్నతి ముందు..
అమ్మకు స్వర్గం కూడా
దిగదుడుపే కదా!



మధుసూదన్ రెడ్డి
9949700037

నిజం గొంతు నొక్కితే.. ప్రజాస్వామ్యమే మూగబోతుంది!

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు, ప్రభుత్వాల ఏర్పాటు, అధికార మార్పిడి మాత్రమే కాదు. ప్రజలు ప్రశ్నించే హక్కు కలిగి ఉండటం, పాలకులు జవాబుదారీగా వ్యవహరించడం, సమాజంలో భిన్నాభిప్రాయాలకు గౌరవం లభించడం కూడా ప్రజాస్వామ్యానికి అంతే ముఖ్యం. ఈ లక్షణాలన్నింటికీ అక్షర రూపమిచ్చే శక్తి పత్రికలకు ఉంది. అందుకే పత్రికా స్వేచ్ఛను ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా అభివర్ణిస్తారు. నవంబర్ 16 జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పత్రికల పాత్రను మాత్రమే కాకుండా, నేటి సమాజంలో వాటి స్వతంత్రత, విశ్వసనీయత, బాధ్యతల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

1966 నవంబర్ 16న భారత ప్రెస్ కౌన్సిల్ తన కార్యకలాపాలను ప్రారంభించింది. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడంతోపాటు జర్నలిజంలో నైతిక ప్రమాణాలను పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. పత్రికా స్వేచ్ఛతోపాటు బాధ్యతాయుతమైన జర్నలిజానికి గుర్తుగా ఈ రోజును జాతీయ పత్రికా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. స్వేచ్ఛకు బాధ్యత తోడైనప్పుడే దానికి సార్థకత ఉంటుందనే విషయాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) పౌరులకు భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా కల్పించింది. పత్రికా స్వేచ్ఛను ప్రత్యేకంగా పేర్కొనకపోయినా, సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా అది ఈ హక్కులో అంతర్భాగంగా గుర్తింపు పొందింది. అయితే ఈ స్వేచ్ఛ అపరిమితమైనది కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) కొన్ని సహేతుకమైన పరిమితులను కూడా నిర్దేశించింది. అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, పాలకుల నిర్ణయాలను విమర్శించడం, అధికార దుర్వినియోగాన్ని బయటపెట్టడం పత్రికల ప్రాథమిక బాధ్యతల్లో భాగం. ప్రశ్నించే గొంతులను శత్రువులుగా చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.



భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో పత్రికల పాత్ర చిరస్మరణీయం. మహాత్మాగాంధీ తన 'యంగ్ ఇండియా', 'హరిజన్' పత్రికల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 'అల్ హిలాల్' ద్వారా జాతీయ భావాలను, స్వాతంత్ర్య కాంక్షను ప్రజల్లో వ్యాప్తి చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తన పత్రికల ద్వారా సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం గళమెత్తారు. ఆనాటి పత్రికలు కేవలం వార్తలను అందించలేదు. ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చాయి. అన్యాయంపై పోరాడే స్ఫూర్తిని అందించాయి. అక్షరాలను ఉద్యమ సాధనాలుగా మలిచాయి. ఆ వారసత్వాన్ని నేటి జర్నలిజం ఎంతవరకు కొనసాగిస్తున్నదన్నది ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన ప్రశ్న.

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే పత్రికా స్వేచ్ఛ అనేక వైపుల నుంచి సవాళ్లను ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ సంస్థ రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్ విడుదల చేసిన 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 180 దేశాల్లో భారత్ 157వ స్థానంలో నిలిచింది. 2025లో 151వ స్థానంలో ఉన్న భారత్ మరో ఆరు స్థానాలు దిగజారడం ఆందోళన కలిగించే పరిణామం. ఈ సూచీ రాజకీయ, ఆర్థిక, న్యాయపరమైన, సామాజిక, భద్రతాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ ర్యాంకింగ్ ఒక్కటే దేశంలోని పత్రికా స్వేచ్ఛకు సంపూర్ణ కొలమానం కాకపోయినా, పరిస్థితులను సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని మాత్రం స్పష్టం చేస్తోంది.

పత్రికా స్వేచ్ఛకు ముప్పు ఎప్పుడూ బహిరంగ నిషేధాల రూపంలోనే రాదు. కొన్నిసార్లు ప్రకటనల రూపంలో, మరికొన్నిసార్లు ఆర్థిక ఒత్తిళ్ల రూపంలో, ఇంకొన్నిసార్లు యాజమాన్య ప్రయోజనాల రూపంలో అది వ్యక్తమవుతుంది. ప్రభుత్వ ప్రకటనలపై ఆధారపడే చిన్న పత్రికలు, అధికార వర్గాల ఆగ్రహానికి గురవుతామనే భయంతో పనిచేసే మీడియా సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించడం కష్టమవుతోంది. మరోవైపు మీడియా యాజమాన్యం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం కూడా వార్తల ఎంపిక, వాటి ప్రాధాన్యత, విశ్లేషణలపై ప్రభావం చూపుతోంది. వార్త ప్రజలకు అవసరమైందా అనే ప్రశ్న కంటే యాజమాన్యానికి ప్రయోజనకరమా అనే ఆలోచన ముందుకొస్తే జర్నలిజం తన అసలు లక్ష్యాన్ని కోల్పోతుంది.

ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రశ్నించడం ఎంత ముఖ్యమో, ప్రతిపక్షాల వైఖరిని, సామాజిక సంస్థల వ్యవహారాలను, ప్రజా ఉద్యమాల తీరును నిష్పక్షపాతంగా విశ్లేషించడం కూడా అంతే ముఖ్యం. కానీ కొన్ని మీడియా వేదికల్లో విమర్శనాత్మక జర్నలిజం స్థానంలో వ్యక్తిపూజ, రాజకీయ అనుకూలత, సంచలనాత్మక చర్చలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజా సమస్యలైన నిరుద్యోగం, విద్య, వైద్యం, పేదరికం, రైతుల కష్టాలు, మహిళల భద్రత వంటి అంశాలకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదు.

వాటి స్థానంలో నిరంతర రాజకీయ వాదోపవాదాలు, వ్యక్తిగత ఆరోపణలు, భావోద్వేగాలను రెచ్చగొట్టే చర్చలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రజలకు సమాచారం అందించాల్సిన మీడియా వారిని రాజకీయ శిబిరాలుగా విడదీసే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం.

ఇదే సమయంలో డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలు సమాచార ప్రపంచాన్ని పూర్తిగా మార్చేశాయి. ఒకప్పుడు వార్తలు పత్రికలు, రేడియో, టెలివిజన్ ద్వారా ప్రజలకు చేరేవి. ఇప్పుడు ఒక్క క్షణంలోనే ప్రపంచవ్యాప్తంగా సమాచారం వ్యాప్తి చెందుతోంది. ఇది సానుకూల పరిణామమే అయినప్పటికీ, దానితోపాటు తప్పుడు వార్తలు, అర్ధసత్యాలు, మార్ఫింగ్ చిత్రాలు, కృత్రిమ మేధస్సుతో సృష్టిస్తున్న నకిలీ దృశ్యాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. ఏది నిజమో, ఏది కల్పితమో గుర్తించడం సాధారణ పాఠకుడికి సవాలుగా మారుతోంది. సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ మంది చూస్తున్న వార్తే నిజమైన వార్త అనే అపోహ కూడా పెరుగుతోంది. వేగం కోసం వాస్తవాన్ని విస్మరించడం, సంచలనం కోసం నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయడం జర్నలిజం విలువలను దెబ్బతీస్తున్నాయి.ఈ నేపథ్యంలో జర్నలిస్టుల బాధ్యత మరింత పెరిగింది. వార్తను ముందుగా అందించాలనే పోటీ కంటే, సరైన వార్తను అందించాలనే నిబద్ధత ముఖ్యం. ఒక వార్తను ప్రచురించే ముందు దాని వాస్తవికతను నిర్ధారించుకోవడం, సంబంధిత వ్యక్తుల వివరణకు అవకాశం ఇవ్వడం, తప్పులు జరిగితే వాటిని సరిదిద్దుకోవడం వృత్తిపరమైన నైతికతలో భాగం. వ్యక్తిగత అభిప్రాయాలను వార్తలుగా చూపించడం, నిరాధార ఆరోపణలకు ప్రచారం కల్పించడం, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రీతిలో వార్తలను అందించడం బాధ్యతాయుతమైన జర్నలిజం అనిపించుకోదు. స్వేచ్ఛ అంటే ఏది పడితే అది రాసే అధికారం కాదు; వాస్తవాల ఆధారంగా నిర్భయంగా రాసే నైతిక బాధ్యత.

ఇంకొక ముఖ్యమైన అంశం ప్రాంతీయ, గ్రామీణ జర్నలిజం. ప్రధాన నగరాల్లోని రాజకీయ పరిణామాలకే పరిమితమవకుండా మారుమూల గ్రామాల్లోని ప్రజల సమస్యలకు కూడా మీడియా ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతున్నాయా? పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి? ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుతున్నాయా? పేదలకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. స్థానిక సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే చిన్న పత్రికలు, ప్రాంతీయ విలేకరులు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే వారికి ఆర్థిక భద్రత, వృత్తిపరమైన గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత కూడా ఉంది. ముఖ్యంగా గ్రామీణ జర్నలిస్టుల కష్టాలను విస్మరించకూడదు.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టులు, పాఠకులు కూడా ఇందులో భాగస్వాములే. ప్రభుత్వాలు విమర్శలను సహనంతో స్వీకరించాలి. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు తావులేకుండా చూడాలి. మీడియా సంస్థలు రాజకీయ, వాణిజ్య ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. జర్నలిస్టులు ప్రలోభాలకు లొంగకుండా వాస్తవాల పక్షాన నిలబడాలి. పాఠకులు కూడా తమకు నచ్చిన వార్తలనే నమ్మకుండా, సమాచారాన్ని పరిశీలించి, ఆధారాలను తెలుసుకునే అలవాటు పెంచుకోవాలి. ఎందుకంటే తప్పుడు వార్తలకు ప్రేక్షకులు, పాఠకులు లేకపోతే వాటి ప్రభావం కూడా తగ్గుతుంది.పత్రికలు అధికారానికి అద్దం పట్టాలి తప్ప అధికారానికి అద్దె గొంతుకలుగా మారకూడదు. అవి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉండాల్సిన అవసరం లేదు; ప్రజలకు అనుకూలంగా ఉండాలి. ప్రభుత్వాలు మంచి పనులు చేస్తే ప్రశంసించాలి. తప్పులు చేస్తే నిర్భయంగా ప్రశ్నించాలి. ప్రతిపక్షాలు తప్పు చేసినా అదే నిష్పక్షపాతంతో విమర్శించాలి. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడమే జర్నలిజం కాదు; ప్రతి వ్యవస్థలోని లోపాలను ప్రజల దృష్టికి తీసుకురావడమే దాని అసలు లక్ష్యం.

ఒక పత్రిక విశ్వసనీయత దాని యజమాని పలుకుబడితోనో, ప్రచురణ సంఖ్యతోనో నిర్ణయించబడదు. అది సత్యం పట్ల చూపే నిబద్ధతతోనే నిలబడుతుంది.

చివరగా ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రజల చేతిలోని అధికారం అయితే, పత్రికా స్వేచ్ఛ ఆ అధికారాన్ని అర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన చైతన్యం. ప్రజలకు నిజాలు తెలియకపోతే వారి నిర్ణయాలు కూడా అసంపూర్ణంగానే మిగిలిపోతాయి. ప్రశ్నించే హక్కు బలహీనపడితే జవాబుదారీతనం కనుమరుగవుతుంది. విమర్శించే స్వరం మూగబోతే అధికారానికి అడ్డుకట్ట వేసే వ్యవస్థలు బలహీనపడతాయి. అందుకే పత్రికా స్వేచ్ఛను కాపాడటం అంటే ఒక వృత్తి హక్కును కాపాడటం మాత్రమే కాదు. ప్రతి పౌరుడి సమాచార హక్కును, ప్రజాస్వామ్య భవిష్యత్తును కాపాడటమే. కలం స్వేచ్ఛగా కదిలినప్పుడే ప్రజల గొంతుకకు ప్రతిధ్వని ఉంటుంది. ఆ కలం మీద భయం నీడ పడిన రోజు ప్రజాస్వామ్యానికి చీకటి మొదలవుతుంది.



యండి. ఉస్మాన్ ఖాన్

ఫోన్ ట్యాపింగ్‌పై మోదీకి వ్యతిరేకంగా ఆరోపణ

ఇన్‌స్టాగ్రామ్‌లో మద్దతుదారులతో జరిగిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో గాంధీ ఆరోపణ చేశారు. తన ఫోన్‌లో ఆధారాలున్నాయని చెప్పినా, ఫోన్ ట్యాపింగ్‌ను నిరూపించే సాంకేతిక ఆధారాలను ఆయన సమర్పించలేదు

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ కార్యక్రమంలో గాంధీ మద్దతుదారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. మాట్లాడుతున్నప్పుడు గాంధీ తన ఫోన్‌ను పైకెత్తి చూపించారు. తన ఫోన్‌లో ప్రధానిపై అన్ని ఆధారాలు ఉన్నాయని ఆయన చెప్పారు. మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్న విషయం ప్రధానికే తెలుసని గాంధీ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణకు మద్దతుగా ధృవీకరించగల సాంకేతిక ఆధారాలను గాంధీ కార్యక్రమంలో చూపలేదు. 'ఆస్క్ మీ' పేరుతో జరిగిన ఇన్‌స్టాగ్రామ్ సమావేశంలో ఆయన ఈ ఆరోపణ చేశారు. ప్రధానితో ముఖాముఖి బహిరంగ చర్చకు గాంధీ మళ్లీ సవాలు విసిరారు. ఎన్నికల ప్రక్రియ, విదేశీ ప్రభావం, జాతీయ భద్రతపై చర్చ జరగాలని ఆయన కోరారు. ప్రధానిపై తన వద్ద ఆధారాలు ఉన్నాయని గాంధీ మరోసారి పట్టుబట్టారు. రాహుల్ గాంధీ గతంలోనూ ఫోన్ ట్యాపింగ్‌పై ఆరోపణలు చేశారు. తనతోపాటు పలువురు రాజకీయ నాయకుల ఫోన్లలో పెగాసస్ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర సంస్థలు ఫోన్లను ట్యాప్ చేసేందుకు ఆ నిఘా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాయని గాంధీ ఆరోపించారు. 2023లో నిఘా అధికారులు తనను హెచ్చరించారని గాంధీ చెప్పారు. ఫోన్‌లో మాట్లాడే విషయాలపై జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారని ఆయన తెలిపారు. తన ఫోన్‌లో పెగాసస్ ఉన్నట్లు గాంధీ 2023లో ఆరోపించారు. పలువురు రాజకీయ నాయకుల ఫోన్లలోనూ పెగాసస్ ఉందని ఆయన పేర్కొన్నారు. ఫోన్‌లో మాట్లాడే విషయాలను అధికారులు రికార్డు చేస్తున్నారని తనకు చెప్పారని గాంధీ అన్నారు. ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. శుక్రవారం గాంధీ చేసిన సవాలు 12 రోజుల్లో ఏడోసారి అని కథనం తెలిపింది. ఒకరితో ఒకరు చర్చిస్తే విదేశీ నియంత్రణలో ఉన్నది ఎవరో తెలుతుందని ఆయన అన్నారు. జాతీయ వ్యతిరేకి ఎవరో కూడా ఆ చర్చతో స్పష్టమవుతుందని గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తన డిమాండ్‌ను కాంగ్రెస్ నేత పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ నేత కోరిన చర్చలో ఎన్నికల ప్రక్రియ, విదేశీ ప్రభావం అంశాలున్నాయి. జాతీయ భద్రతపై కూడా బహిరంగంగా మాట్లాడాలని రాహుల్ గాంధీ అన్నారు. భారతీయ జనతా పార్టీ నేతలు గాంధీ చర్చ సవాళ్లను పదేపదే కొట్టిపారేశారు. పార్లమెంటులో అసలు అంశాలపై చర్చను గాంధీ తప్పించుకుంటున్నారని వారు ఆరోపించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో గాంధీ డిమాండ్‌పై ప్రశ్నించారు. ప్రధాని చర్చా వేదికను ఎంచుకోవాలని గాంధీ ఎందుకు కోరుతున్నారని ఆమె అడిగారు. చర్చకు పార్లమెంటే ఇప్పటికే అందుబాటులో ఉందని సీతారామన్ అన్నారు. గాంధీ ఆరోపణలకు కార్యక్రమంలో సాంకేతిక నిర్ధారణ కనిపించలేదు.



ఈమెయిల్ సేవలు దెబ్బతిన్నా కార్యకలాపాలు యథావిధిగా...



ఢిల్లీలో ఇండిగో ఈమెయిల్ సేవలపై మైక్రోసాఫ్ట్ అంతరాయం ప్రభావం చూపింది. నవంబర్ 13, 2026న విమానయాన సంస్థ ఈ విషయం తెలిపింది. ఎక్స్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఇతర సహాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్త మైక్రోసాఫ్ట్ అంతరాయం వల్ల ఈమెయిళ్లు అందకపోవచ్చని ఇండిగో తెలిపింది. విమాన కార్యకలాపాలు మాత్రం ప్రభావితం కాలేదని స్పష్టం చేసింది. ఇండిగో ప్రయాణికుల ప్రశ్నలకు 6ఈ స్కై నిరంతర సహాయం అందిస్తోందని చెప్పింది. ఇతర కస్టమర్ సహాయ మార్గాలన్నీ పూర్తిగా పనిచేస్తున్నాయని సంస్థ పేర్కొంది. విమానాలు, ఇతర వ్యాపార కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని తెలిపింది. కస్టమర్లకు సమాచారం అందించేందుకు నోటిఫికేషన్లు పంపుతున్నట్లు వివరించింది. మైక్రోసాఫ్ట్ అంతరాయం కొనసాగుతున్నప్పటికీ సేవలపై పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొంది. ఎయిర్ ఇండియా తన ఈమెయిళ్లను తాత్కాలికంగా మరో మార్గానికి మళ్లించింది. ప్రతి సందేశం అంతరాయం లేకుండా చేరుతోందని సంస్థ తెలిపింది. సాధారణ 24 గంటల వ్యవధిలో అన్ని ఈమెయిళ్లకు స్పందిస్తున్నట్లు పేర్కొంది. విమాన కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం లేదని ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది. ఎయిర్ ఇండియా అన్ని కమ్యూనికేషన్ మార్గాలు పనిచేస్తున్నాయని తెలిపింది. వాయిస్, ఏఐ.జీ, సామాజిక మాధ్యమాలు, కస్టమర్ నోటిఫికేషన్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. మైక్రోసాఫ్ట్ అంతరాయాన్ని నిశితంగా గమనిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. నవంబర్ 13న రెండు విమానయాన సంస్థలు తమ సేవలపై ప్రకటనలు చేశాయి. మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్, టీమ్స్ సహా కార్యాలయ వేదికలు ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. నవంబర్ 12 రాత్రి నుంచి ఈ అంతరాయం కొనసాగింది. భారతదేశంలోని వినియోగదారులు నవంబర్ 12 రాత్రి నుంచి అంతరాయాలను నివేదించడం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 6:00 గంటల తర్వాత ఫిర్యాదులు మళ్లీ పెరిగాయి. సర్వర్‌లు అనూహ్యంగా అందుబాటులో లేకపోవడమే కారణమని మైక్రోసాఫ్ట్ తెలిపింది. అధిక ట్రాఫిక్ వల్ల సమస్య రాలేదని సంస్థ పేర్కొంది. శుక్రవారం ఉదయం 11:16 గంటలకు మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం ఉందని వెల్లడించింది. ఈ ప్రభావం మైక్రోసాఫ్ట్ 365 వ్యాపార, సంస్థాగత వినియోగదారులకు ఉందని తెలిపింది. సమస్య మూలకారణాన్ని గుర్తించేందుకు మైక్రోసాఫ్ట్ అనేక చర్యలు చేపట్టింది. బ్యాకెండ్ సర్వర్‌లను పునరుద్ధరించేందుకు కూడా పని చేస్తోంది. ఘటనకు హానికర కార్యకలాపాలు కారణమయ్యాయని ప్రస్తుతానికి ఆధారం లేదని సంస్థ చెప్పింది. సమస్య పరిష్కారమైన తర్వాత సమగ్ర నివేదిక విడుదల చేస్తామని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

దూసుకొచ్చిన ట్రక్కు.. 14 మంది ప్రాణాలు కోల్పోయారు

ఆరు దేశాల పౌరులు మృతుల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు



దుబాయ్: నవంబర్ 13న ఫుజైరా ప్రవేశద్వారం వద్ద ఘోర ప్రమాదం జరిగింది. గురువారం అర్ధరాత్రి తర్వాత ట్రక్కు అదుపుతప్పి వాహనాలను ఢీకొట్టింది. ప్రమాదంలో భారతీయుడితోపాటు 14 మంది మరణించారు. అతివేగంగా వచ్చిన ట్రక్కుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. ట్రక్కు మొదట ఓ కారును ఢీకొని బోల్తాపడింది. తరువాత నెమ్మదిగా వెళ్తున్న మరికొన్ని వాహనాలను ఢీకొంది. ఢీకొనడంతో వాహనాల్లో వెంటనే మంటలు చెలరేగాయి. ఘటనాస్థలిలో గందరగోళం నెలకొంది. మంటలు వేగంగా వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. యూఏఈ హోం మంత్రిత్వ శాఖ ఘటనను ధ్రువీకరించింది. రక్షణ బృందాలు వెంటనే అక్కడికి చేరుకున్నాయి. సుదీర్ఘంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. మృతుల్లో భారత్‌తోపాటు యూఏఈ పౌరులు ఉన్నారు. ఒమన్, జోర్డాన్, పాకిస్థాన్, ఈజిప్ట పౌరులూ మృతుల్లో ఉన్నారు. మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు కొనసాగుతున్నాయి. భారతీయుడి మరణాన్ని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు పనిచేస్తోంది. ప్రమాదం తర్వాత ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రమాద కారణాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

దేశ భద్రతకు, శాంతి, మత సామరస్యానికి తీవ్రంగా హానికరం : ప్రభుత్వం

ఢిల్లీకి చెందిన ఈఎంఎస్‌ను అంతర్గత భద్రతకు ముప్పుగా ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర హోంశాఖ ఐఆర్ఎఫ్‌పై నిషేధాన్ని మరో ఐదేళ్లు పొడిగించింది. ప్రస్తుత నిషేధం 14 నవంబర్ 2026న ముగియడానికి ముందే నిర్ణయం వెలువడింది. ఐఆర్ఎఫ్‌ను చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటిస్తూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధం కొనసాగితే సంస్థ కార్యకలాపాలపై ఆంక్షలు అలాగే ఉంటాయి. తాజా చర్యకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటనను ఆధారంగా చూపింది. భారత రాజపత్రంలో హోంశాఖ ఈ నిర్ణయాన్ని ప్రచురించింది. ఐఆర్ఎఫ్‌పై ఆంక్షలను మరో ఐదేళ్లు కొనసాగించాలని ప్రకటన స్పష్టం చేసింది. దేశ భద్రతకు సంస్థ కార్యకలాపాలు తీవ్రంగా హానికరమని అందులో పేర్కొంది. శాంతి, మత సామరస్యం కూడా ప్రభావితమవుతాయని శాఖ తెలిపింది. బహుళత్వ, లౌకిక సామాజిక నిర్మాణానికి ముప్పు ఉందని పేర్కొంది. నిర్ణయం అమలుతో నిషేధ కాలం మరోసారి పొడిగించబడింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం, 1967లోని 3వ సెక్షన్ కింద చర్య తీసుకున్నారు. ఆ సెక్షన్ జాతీయ సమగ్రతకు ముప్పుగా ఉన్న సంస్థలపై నిషేధానికి అధికారం ఇస్తుంది. ప్రజా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలగవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. సంస్థ కార్యకలాపాలు దేశ ఐక్యత, సార్వభౌమత్వాన్ని దెబ్బతీయవచ్చని తెలిపింది. అలాంటి పరిస్థితి సమాజంలో అస్థిరతకు దారితీయవచ్చని పేర్కొంది. నిషేధానికి ప్రభుత్వం ఈ కారణాలను అధికారికంగా నమోదు చేసింది. ఐఆర్ఎఫ్‌పై ఇలాంటి నిషేధం విధించడం ఇదే మొదటిసారి కాదు. కేంద్ర ప్రభుత్వం 17 నవంబర్ 2016న ఒక ప్రకటన జారీ చేసింది. ఆ ప్రకటనలో సంస్థను చట్టవిరుద్ధ సంస్థగా పేర్కొంది. 15 నవంబర్ 2021న మరో అధికారిక ప్రకటన వెలువడింది. ఆ ప్రకటన కూడా ఐఆర్ఎఫ్‌పై నిషేధాన్ని కొనసాగించింది. రెండు నిర్ణయాలు సంస్థపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించాయి. ప్రత్యేకంగా ఏర్పాటైన ట్రిబ్యునల్ ఈ నిషేధాలను సమర్థించింది. ట్రిబ్యునల్ చట్టంలోని 5వ సెక్షన్ కింద ఏర్పాటైంది. ప్రభుత్వ మునుపటి ప్రకటనలను ధృవీకరించే ఉత్తర్వులు జారీ చేసింది. 22 మే 2017న ఒక ఉత్తర్వు వెలువడింది. 30 మార్చి 2022న మరో ఉత్తర్వు జారీ అయింది. ఆ ఉత్తర్వులతో సంస్థ చట్టవిరుద్ధ స్వరూపానికి న్యాయపరమైన ముద్దతు లభించింది. తాజా ప్రకటనలో ఐఆర్ఎఫ్ సభ్యులపైకూడా హోంశాఖ ఆరోపణలు చేసింది. సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు జాకిర్ నైక్‌ను శాఖ ప్రత్యేకంగా ప్రస్తావించింది. అనుచరులను మత ప్రాతిపదికన రెచ్చగొడుతున్నారని పేర్కొంది. వివిధ మత సమూహాల మధ్య వైరం పెంచుతున్నారని తెలిపింది. ద్వేషం, దురుద్దేశాన్ని వ్యాప్తి చేస్తున్నారని ప్రకటనలో ఆరోపించింది. ఈ ఆరోపణలు ప్రభుత్వ తాజా నిర్ణయానికి మరో ఆధారంగా నిలిచాయి. జాకిర్ నైక్ ప్రసంగాలు, ప్రకటనలను ప్రభుత్వం అభ్యంతరకరంగా పేర్కొంది. ఆ ప్రసంగాల ద్వారా మత సమూహాల మధ్య ద్వేషం పెంచుతున్నారని ఆరోపించింది. ఈ ప్రచారం పద్ధతిగా సాగుతోందని శాఖ అభిప్రాయపడింది. భారత్, విదేశాల్లోని ఒక మతానికి చెందిన యువతపై ప్రభావం పడవచ్చని తెలిపింది. యువతను తీవ్రవాద భావాల వైపు నెట్టే అవకాశం ఉందని పేర్కొంది. అలాంటి ప్రసంగాలు ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రేరేపించవచ్చని ప్రకటన ఆరోపించింది. అంతర్గత భద్రత, మత సామరస్య పరిరక్షణే నిర్ణయ లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. జాతీయ ఐక్యతకు ముప్పుగా ఉన్న కార్యకలాపాలను అడ్డుకోవాలని పేర్కొంది. శాంతికి భంగం కలిగించే చర్యలను నిలువరించాల్సిన అవసరాన్ని శాఖ ప్రస్తావించింది. తాజా నోటిఫికేషన్‌తో ఐఆర్ఎఫ్‌పై నిషేధం మరో ఐదేళ్లు అమల్లో ఉంటుంది.



ఆ వ్యవధి 14 నవంబర్ 2026న ముగియాల్సి ఉంది. గడువు ముగియకముందే ప్రభుత్వం పొడిగింపు నిర్ణయం తీసుకుంది. హోంశాఖ ప్రకటనలో నిషేధానికి సంబంధించిన కారణాలు వివరించబడ్డాయి. ప్రజా వ్యవస్థకు ముప్పు ఏర్పడే అవకాశాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. దేశ సమైక్యత, సార్వభౌమత్వంపై ప్రభావాన్ని కూడా పేర్కొంది. సంస్థ నిరంతర కార్యకలాపాలపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక అస్థిరత ఏర్పడవచ్చని అధికారికంగా తెలిపింది. గత నిషేధాలకు సంబంధించిన తేదీలను ప్రకటన గుర్తుచేసింది. 17 నవంబర్ 2016న మొదటి ప్రకటన జారీ అయింది. 15 నవంబర్ 2021న రెండో ప్రకటన వెలువడింది. ట్రిబ్యునల్ 22 మే 2017న ప్రభుత్వ నిర్ణయాన్ని పరిశీలించింది. 30 మార్చి 2022న దానిపై మరో ఉత్తర్వు ఇచ్చింది. ఐఆర్ఎఫ్‌ను చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటించడం కొనసాగింది. తాజా నిర్ణయం చట్టంలోని 3వ సెక్షన్ కింద తీసుకున్నారు. నిషేధాన్ని పర్యవేక్షించే ప్రక్రియకు 5వ సెక్షన్ ఆధారం. జాకిర్ నైక్‌పై చేసిన ఆరోపణలను ప్రకటనలో శాఖ నమోదు చేసింది. ఆ ఆరోపణలను ప్రభుత్వం జాతీయ భద్రతతో అనుసంధానించింది. నిషేధం కొనసాగించాలనే నిర్ణయంతో ప్రక్రియ ముగిసింది.

సర్వర్లు మళ్లీ మళ్లీ విఫలమవడంతో సేవల అంతరాయం



మైక్రోసాఫ్ట్ సేవల అంతరాయంతో వేలాది వినియోగదారులు గురువారం, శుక్రవారం తొమ్మిది గంటలకు పైగా ఇబ్బందిపడ్డారు. మైక్రోసాఫ్ట్ 365, ఔట్‌లుక్, టీమ్స్‌తోపాటు ఇతర యాప్‌లు పనిచేయలేదు. ప్రారంభ పరిష్కారాలు సేవలను తిరిగి తీసుకురాలేకపోయాయి. సంస్థ కొత్త పరిష్కారం కోసం ప్రయత్నాలు కొనసాగించింది. సైబర్ దాడికి ఆధారం లేదని మైక్రోసాఫ్ట్ ప్రతినిధి తెలిపారు. డౌన్ డిటెక్టర్‌లో రాత్రి 1 గంట సమయంలో సమస్యల పెరుగుదల నమోదైంది. మైక్రోసాఫ్ట్ 365కు సంబంధించిన 130,000 సమస్యల నివేదికలు నమోదయ్యాయి. ఆ సమస్యలు 74 దేశాల్లో కనిపించాయి. వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్, ఔట్‌లుక్, టీమ్స్ వినియోగం ప్రభావితమైంది. షేర్‌పాయింట్, వన్‌డ్రైవ్ వంటి సంస్థల సేవలపైనా ప్రభావం పడింది. కోపైలట్ కృత్రిమ మేధ సహాయక సేవ కూడా అంతరాయాన్ని ఎదుర్కొంది. మైక్రోసాఫ్ట్ 365ను నడిపించే సర్వర్ సెట్టింగ్‌లలో సమస్య ఉండొచ్చని సంస్థ సూచించింది. తొమ్మిది గంటల వ్యవధిలో మైక్రోసాఫ్ట్ పలు పరిష్కారాలు ప్రయత్నించింది. సంస్థ కొన్ని నవీకరణలను వెనక్కి తీసుకుంది. ప్రభావిత సర్వర్లకు వెళ్లే ట్రాఫిక్‌ను కూడా పరిమితం చేసింది. పరిష్కారాలు అమలు చేసిన తర్వాత సర్వర్లు మళ్లీ అందుబాటులో లేకుండా పోయాయి. తిరిగి వచ్చిన ట్రాఫిక్‌తో సర్వర్లు మరోసారి విఫలమయ్యాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. శుక్రవారం ఉదయం 3.30 గంటలకు ఔట్‌లుక్ వెనుక పనిచేసే ఎక్స్ఛేంజ్ సేవలే ఎక్కువగా ప్రభావితమయ్యాయి. ఆ ప్రభావం ఇతర ఆధారిత ఉత్పత్తులకు కూడా వ్యాపించింది. టీమ్స్ చాట్‌లు, సమావేశాలపై ప్రభావం తక్కువగా ఉంది. కోపైలట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చార్లెస్ లామన్నా మరిన్ని వివరాలు అందిస్తామని ఎక్స్‌లో తెలిపారు. వినియోగదారులకు అంతరాయం కలిగిందని మైక్రోసాఫ్ట్ విచారం వ్యక్తం చేసింది. హానికరమైన లేదా సైబర్ చర్యకు ఆధారం లేదని సంస్థ మళ్లీ పేర్కొంది. మౌలిక వసతుల్లోని ఒక భాగం అధిక లోడును ఎదుర్కొందని వివరించింది. ఆ లోడు కనెక్టివిటీ లోపాలకు కారణమై ఉండొచ్చని మైక్రోసాఫ్ట్ తెలిపింది. ఆటోమేటెడ్ తనిఖీల సమయంలో కొన్ని సర్వర్లు విఫలమయ్యాయి. దాంతో అవి అనూహ్యంగా అందుబాటులో లేకుండా పోయాయి. ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ మెయిల్‌బాక్స్‌లను తెరవడంపై వచ్చిన నివేదికలను సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఆర్ఎమ్ఐటీ యూనివర్సిటీకి చెందిన మార్క్ గ్రెగరీ సమస్య నెట్‌వర్క్ పొరలో ఉండొచ్చన్నారు. కాన్ఫిగరేషన్ లోపం వల్ల వినియోగదారులు తక్కువ సర్వర్లపై ఆధారపడతారని వివరించారు. మిగిలిన సర్వర్లపై భారం పెరిగితే అవి కూడా నిలిచిపోతాయని చెప్పారు.

హువాంగ్ వైదొలగడంతో ఎన్విడియా నాయకత్వ మార్పు

మిలన్ ఏదితిఓన్ న్యూస్ డెస్క్



ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ నవంబర్ 12న రాజీనామా చేశారు. కంపెనీ నాయకత్వంలో ఆయన 33 ఏళ్లు ఉన్నారు. వ్యక్తిగత సంబంధాలపై వచ్చిన ఆరోపణల కలకలం తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. అమెరికా నిఘా సంస్థలు చైనా గూఢచారిగా అనుమానించిన మహిళతో సంబంధం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఇతర వివాహేతర సంబంధాలపై కూడా వేర్వేరు కథనాలు ప్రచురితమయ్యాయి. పరిణామాలతో ప్రపంచంలోని అత్యంత విలువైన సాంకేతిక సంస్థల్లో ఒకటైన ఎన్విడియా షేర్లు పడిపోయాయి. హువాంగ్ వైదొలగడం సాంకేతిక రంగంలో విస్తృత స్పందనలకు దారితీసింది. సాంకేతిక నాయకులు, కృత్రిమ మేధ పరిశోధకులు, పెట్టుబడిదారులు స్పందించారు. కొందరు రాజీనామా నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరికొందరు హువాంగ్ నాయకత్వాన్ని ప్రశంసించారు. ఎన్విడియాను ప్రభావశీల సాంకేతిక సంస్థగా మార్చడంలో ఆయన పాత్రను వారు గుర్తుచేశారు. సిలికాన్ వ్యాలీ స్పందనల్లో వ్యక్తిగత ప్రవర్తనను వృత్తిపరమైన కృషి నుంచి వేరు చేయాలని పలువురు అన్నారు. టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ స్పందించిన ప్రముఖుల్లో ఉన్నారు. ఎన్విడియా బోర్డు హువాంగ్‌ను తొలగించేందుకు సిద్ధమవుతోందని వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఆ వార్తల తర్వాత జీరోహెడ్జ్ తన ఎక్స్ ఖాతాలో పిలుపునిచ్చింది. జెన్సెన్‌ను నియమించుకోవాలని మస్క్‌ను కోరింది. మస్క్ దానికి గౌరవంగా భావిస్తానని సమాధానమిచ్చారు. కృత్రిమ మేధ రంగంలో హువాంగ్ అత్యంత ప్రభావశీల వ్యక్తిగా నిలిచారు. ఎపిక్ గేమ్స్ వ్యవస్థాపకుడు టిమ్ స్వీనీ ఈ పరిణామాన్ని విచారకరమైన రోజుగా పేర్కొన్నారు. ఎన్విడియాతోపాటు డెవలపర్లు, అమెరికా, మొత్తం మానవాళికి ఇది బాధాకరమని ఎక్స్‌లో రాశారు. హువాంగ్ భారీ స్థాయిలో ఆవిష్కరణలను కొనసాగించారని స్వీనీ అన్నారు. ఎన్విడియాను గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రముఖ సరఫరాదారుగా ఆయన తీర్చిదిద్దారు. ఆ చిప్‌లు కృత్రిమ మేధ అభివృద్ధికి కీలకంగా మారాయి. పెద్ద భాషా నమూనాలు, డేటా కేంద్రాలకు అవి పునాదిగా నిలిచాయి. పెర్ప్లెక్సిటీ ఏఐ సహవ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ హువాంగ్‌ను ప్రశంసించారు. ధైర్యమైన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. చిన్న స్టార్టప్‌ను అమెరికా విలువైన సంస్థగా మార్చారని శ్రీనివాస్ అన్నారు. సమయాన్ని, సలహాలను వ్యవస్థాపకులతో పంచుకున్న హువాంగ్ ఔదార్యాన్ని గుర్తుచేశారు. ఆ కృషి అమెరికా, కృత్రిమ మేధ భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ స్పందన ఎన్విడియా, ఏఐ ఉత్పత్తి సంస్థల మధ్య బంధాన్ని చూపించింది. ఓపెన్‌ఏఐ ఏఐ ఏజెంట్ సృష్టికర్త పీటర్ స్టెయిన్‌బెర్గర్ నిర్ణయ పరిస్థితులపై ప్రశ్నలు లేవనెత్తారు. హువాంగ్‌ను తొలగించడం తొందరపాటు, సరైనది కాదని ఆయన రాశారు. గూఢచారి లక్ష్యం సంస్థను అస్థిరపరచడమైతే అది సాధించినట్లేనని వ్యాఖ్యానించారు. హువాంగ్ వైదొలగడంతో ఎన్విడియాకు అనిశ్చితి ఎదురుకావచ్చని కొందరు భావిస్తున్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన సంస్థను నడిపారు. హగ్గింగ్ ఫేస్ సీఈఓ క్లెమెంట్ డెలాంగ్ కూడా దీనిని విచారకరమైన రోజుగా అన్నారు. క్లెమెంట్ డెలాంగ్ ఎన్విడియా నిర్మాణాన్ని బలంగా అభివర్ణించారు. స్పష్టమైన వారసుడు లేకపోయినా సంస్థ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేశారు. విస్తరించిన నాయకత్వం, మార్పులకు సరిపడే సామర్థ్యం దాని బలాలని చెప్పారు. సంస్థలోనే పలువురు అసాధారణ నాయకులు సీఈఓ బాధ్యతలు చేపట్టగలరని తెలిపారు. బహిరంగ మూల కృత్రిమ మేధ కోసం మరింతగా పోరాడతానని డెలాంగ్ ప్రకటించారు. సీక్వోయా క్యాపిటల్ భాగస్వామి షాన్ మగ్వైర్ వ్యక్తిగత ఆరోపణలను వేరు చేసి చూశారు. అవిశ్వాసం తప్పేనని, అయినా హువాంగ్ కృషిని తక్కువ అంచనా వేయలేమని అన్నారు. అమెరికా ఆవిష్కరణలు, ఏఐ నాయకత్వంలో ఆయన పాత్రను మగ్వైర్ ప్రశంసించారు. హువాంగ్ వైదొలగడం అమెరికా ఏఐ రంగంలో పెద్ద ఖాళీని సృష్టించవచ్చని హెచ్చరించారు. ఆయన వారసుడిగా పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ నికేశ్ అరోరాను సూచించారు. బినాన్స్ వ్యవస్థాపకుడు చాంగ్‌పెంగ్ ఝావో రాజీనామా తప్పిదమని పేర్కొన్నారు.

ఒప్పందం కుదిరితే భారత్‌కు సుంకాల ప్రయోజనం



ఢిల్లీలో భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒప్పందం కుదిరితే పోటీ దేశాలకంటే భారత్‌కు సుంకాల పరంగా ప్రయోజనం ఉంటుందని అమెరికా హామీ ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఒప్పందాన్ని పూర్తిచేయాలని ఇరుపక్షాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఈ విషయాన్ని తెలిపారు. భారత్‌కు తులనాత్మక ప్రయోజనం ఉంటేనే ఒప్పందం ముందుకు సాగుతుందని అధికారులు గతంలో చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 2026 ఉమ్మడి ప్రకటనలో దీనిపై అంగీకరించారు. ఆసక్తి ఉన్న రంగాల్లో పరస్పర ప్రాధాన్య మార్కెట్ ప్రవేశం కల్పిస్తామని ప్రకటన పేర్కొంది. ఆ సదుపాయం నిరంతర ప్రాతిపదికన ఉండాలని ఇరుదేశాలు అంగీకరించాయి. అమెరికా కాంగ్రెస్ నియంత్రణ కోల్పోయే అవకాశం ట్రంప్‌పై ఒత్తిడి పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒప్పందం కోసం భారత్‌పై సుంకాల ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని వారు అంచనా వేశారు. భారత చర్చాకర్తలు దీనిని అవకాశంగా చూడవచ్చని మూల కథనం పేర్కొంది. వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అమెరికా నుంచి ఇద్దరు సభ్యుల బృందం భారత్‌కు వచ్చినట్లు ధ్రువీకరించారు. అమెరికా బృందం నవంబర్ మొదటి వారంలో భారత్‌ను సందర్శించింది. కస్టమ్స్, వాణిజ్య సౌలభ్యంపై బృందం చర్చలు జరిపింది. ఒప్పంద పాఠాన్ని ఖరారు చేయడంలో గణనీయమైన పురోగతి నమోదైంది. అనేక అంశాలపై ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం ఏర్పడింది. భారత్‌పై అమెరికా అదనంగా 10 శాతం బలవంతపు కార్మిక సుంకం విధించింది. ఇండోనేషియా, మలేషియా, పాకిస్థాన్, శ్రీలంకలపైనా అదే సుంకం ఉంది. అదనపు సుంకాలపై అమెరికా మరో దర్యాప్తు కొనసాగిస్తోంది. భవిష్యత్ సుంకాలను పరిగణనలోకి తీసుకునే విధంగానే అమెరికా హామీ ఇచ్చిందని అధికారి తెలిపారు. ఒక దేశం మరో దేశంపై సుంకాలు మార్చితే ప్రతిస్పందనగా కట్టుబాట్లను మార్చుకునే నిబంధనను ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ నిబంధన ఫిబ్రవరి ప్రకటనలోనూ ఉంది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చర్చల్లో ఎక్కువ భాగం పూర్తయిందని తెలిపారు. ఒప్పందాన్ని ప్రస్తుతం సరిదిద్దుతున్నామని గోయల్ చెప్పారు. ఇరుపక్షాల ప్రధాన చర్చాకర్తలు ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా మాట్లాడుతున్నారు.

వుదయం www.voodayam.com

పంటల మార్పిడిపై ప్రత్యేక కార్యాచరణ - కలెక్టర్

ప్రతి క్లస్టర్ కు సమగ్ర యాక్షన్ ప్లాన్

- రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలి

సూర్యాపేట, నవంబర్ 13 : వుదయం ప్రతినిధి



యాసంగి సీజన్ ను దృష్టిలో ఉంచుకొని పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఏఈఓ క్లస్టర్ పరిధిలో ఏ పంటలు సాగు చేయాలి, ఏ రకాలను ప్రోత్సహించాలి, సాగునీటి వనరులు, పెట్టుబడి, మార్కెటింగ్ అవకాశాలను పరిగణనలోకి తీసుకొని ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన క్లస్టర్ వారీ పంటల మార్పిడి నివేదిక ఆధారంగా మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించాలని, లక్ష ఎకరాల్లో పంటల మార్పిడి లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పని చేసి, ఉపాధి హామీ, సూక్ష్మ సేద్యం పథకాలను పంటల మార్పిడితో అనుసంధానం చేయాలన్నారు. రైతుల వద్దకే వెళ్లి ప్రచారంకేవలం వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం పెట్టడం సరిపోదని, ప్రతి అధికారి రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అధికారి కనీసం పది మంది రైతులను కలవాలని, మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టి, ప్రెస్, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి హామీ విభాగాలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసిప్రచార సామగ్రి, వీడియోలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి క్లస్టర్ నుంచి 2 నుంచి 5 మంది విజయవంతమైన రైతుల వివరాలు సేకరించాలని, సాగువిధానం, పెట్టుబడి, దిగుబడి, ఆదాయ వివరాలను నమోదు చేయాలని సూచించారు. రైతుల విజయగాథలను ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేయాలని, వీడియోలను వాట్సాప్ ద్వారా ప్రచారం చేయాలని తెలిపా రు. మూడు, నాలుగు రోజుల్లో ఛానల్ సిద్ధం చేయాలన్నారు. విద్యాశాఖపై వచ్చే మంగళవారం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రాథమికం నుండి వైద్య కళాశాల వరకు అన్ని విద్యా సంస్థలను సమీక్షిస్తామన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో నాణ్యమైన విద్య, జారీ చేసిన సర్క్యులర్ల అమలుపై నివేదిక ఇవ్వాలన్నారు.సమీక్షలు వాట్సాప్ కే పరిమితం కాకుండా రాతపూర్వకంగా జరగాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంల సరఫరాలో లోపాలు ఉండొద్దని, చిన్న పిల్లలకు పెద్ద సైజు, పెద్ద పిల్లలకు చిన్న సైజు ఇవ్వొద్దని, మండల విద్యాశాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజు, డీఆర్డీవో సన్యాసయ్య, సీఏఫ్వో దామోదర్ రెడ్డి, డీపీవో యాదగిరి, డీఐఈవో సులోచన రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

32వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక దీక్షలు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి రెగ్యులరైజ్ చేయాలని వినతి

నల్గొండ జిల్లా నవంబర్ 13 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి (రెగ్యులరైజ్ చేసి) ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్షలు 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రతినిధి బృందం కలిసి తమ సమస్యలను వివరించింది. ఎన్నో సంవత్సరాలుగా ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమను రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగభద్రత కల్పించాలని మంత్రిని కోరారు. చాలాకాలంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమ ఉద్యోగాలపై భరోసా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు విధులకు దూరంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడి పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల వినతిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తెలియజేస్తానని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. 32 రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నా తమ డిమాండ్లు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమను రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డాక్టర్ రాంబాబు, మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక, ఎంఎల్‌హెచ్‌పీ ప్రతిభ,



డాక్టర్ వెంకటేశం, డెంటల్ టెక్నీషియన్ శ్రీనివాస్, డాక్టర్ గణేష్, ఎండీ ఖలీమ్, డాక్టర్ టి.రవి, ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సింగ్ అధికారులు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

పేట లో ప్రభుత్వ చేయూత పెన్షన్ ల పంపిణీ కార్యక్రమం

అశ్వారావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన



అశ్వారావుపేట నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లానారాయణ పురం గ్రామపంచాయతీ చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు మొత్తం 36 మందికి పెన్షన్లు ఇవ్వడం జరిగింది. ఎన్నో రోజులు, ఎన్నో సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న వారి కలను ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు, ఎమ్మెల్యే చేతుల మీదుగా, సర్పంచ్ చేతుల మీదుగా అర్హులైన పెన్షన్ దారులకు పెన్షన్లు ఇవ్వడం జరిగింది.ఎన్నో సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న పెన్షన్ రావడంతో లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తమ జీవితంలో ప్రభుత్వం సాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల శీను, గ్రామపంచాయతీ సెక్రెటరీ క్రాంతికుమార్, 4వ వార్డ్ మెంబర్ మడకం ఆంధ్రయ్య గ్రామ అధ్యక్షులు చిన్నంశెట్టి నాగేంద్ర కుమార్ డీసీసీ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి పెదపూడి సత్యవతి కాంగ్రెస్ యువ నాయకులు పరిటాల సందీప్ కుమార్ పసుపులేటి నరేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చందా రామారావు, VO శ్రీమతి భవాని, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రబీలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి: సీఎస్ సంజయ్ జాజు

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి సీఎస్ అభినందనలు

హనుమకొండ, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):

రబీ సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు వరి సాగును నివారించి పండ్లు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సేద్యం వైపు మళ్లేలా విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారంరోజున సచివాలయం నుంచి వ్యవసాయం, విద్య, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ ఐడీఓసీ నుంచి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు.సీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ మార్కెట్లోనూ రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ దక్కేలా పర్యవేక్షించాలి. కొనుగోలు కేంద్రాలను సిద్ధంగా ఉంచి రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలి. పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ (FRS) ద్వారా పర్యవేక్షిస్తూ విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చూడాలి. అభ్యసన సామర్థ్యాల పెంపునకు 'ఫిజిక్స్ వాలా', 'ఖాన్ అకాడమీ' డిజిటల్ వేదికలను వినియోగించాలి. నిర్మాణాల వేగవంతం: రూ.11 వేల కోట్లతో చేపట్టిన 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూసా 2.0, పీఎం ఉషా పనులను గడువులోగా పూర్తి చేయాలి. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వీధి కుక్కలను నియంత్రించి పునరావాస కేంద్రాలకు తరలించాలి. VBGRAMG కింద నీటి సంరక్షణ, కాలువల పూడికతీత పనులు చేపట్టాలి. హనుమకొండ కలెక్టర్‌కు ప్రశంస:జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగినందుకు హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిని సీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టడం వల్లే ఇది సాధ్యమైందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, డీఈఓ గిరిరాజ్ గౌడ్, డీఐఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.




అర్హులందరికీ జాబ్ కార్డులు.. దరఖాస్తు చేసిన రెండు రోజుల్లోనే మంజూరు

ఎల్‌నినో ఎఫెక్ట్: 19 లక్షల పనిదినాల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక

నిరుపయోగంగాఉన్న కార్డులను పునరుద్ధరించాలి: ములుగు కలెక్టర్

ములుగు, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి) :



జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ కార్డు ఉండి, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్కార్డుమంజూరుచేస్తామని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు స్పష్టం చేశారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం. సంపత్ రావుతో కలిసి నూతన జాబ్ కార్డుల మంజూరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డు ఉండి, 5 ఎకరాలలోపు భూమి ఉన్న అర్హులైన కుటుంబాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోనే కొత్త జాబ్ కార్డులు అందజేయాలి. ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా పేద కుటుంబాలు ఉపాధి కోల్పోకుండా 'వీబీ-గ్రామ్ జీ' పథకం ద్వారా 19 లక్షల పనిదినాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాము.కార్డుల విభజన, పునరుద్దరణకు ఉమ్మడి కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన వారు, వివాహమైన వారు నిబంధనల మేరకు కార్డు విభజన ద్వారా కొత్తవి పొందవచ్చు. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న పాతజాబ్ కార్డులను తిరిగి క్రియాశీలం (యాక్టివేట్) చేసి ఉపాధి కల్పించాలి. సమావేశంలో డీఆర్డీఓ రవీందర్, ఏపీడీ శ్రీనివాస్, ఇతరసంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించి బాధితులకు న్యాయం చేయాలి: సీపీ శ్వేత



హనుమకొండ క్రైం, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. శుక్రవారం రోజున ఆమె ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఠాణాకు చేరుకున్న సీపీకి అధికారులు పూల మొక్కలతో స్వాగతం పలుకగా, సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో సీపీ కొబ్బరి మొక్కను నాటారు. అనంతరం స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులు, పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి పవిత్ర పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలు, ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాఖ ప్రతిష్టను కాపాడేలా సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని హితవు పలికారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ సంతోష్, ఎస్ఐలు అశోక్ (ఐనవోలు), వంశీకృష్ణ (సంగెం), రాజ్‌కుమార్ (పర్వతగిరి), స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత: — డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం ఆదేశాలు

మహబూబాబాద్, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి) :



కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజ్జు, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌లతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు. నవంబర్ 14న నెహ్రూ జయంతి నుంచి పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి. 18న ప్రతి గ్రామంలో టాంటాం వేయించి దరఖాస్తుల స్వీకరణ వివరాలను ప్రజలకు తెలియజేయాలి. నవంబర్ 19నఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. అదేరోజు ప్రతి గ్రామం, వార్డులో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరించాలి. కుటుంబంలోని 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల సంపాదన సభ్యుడికి (ఆధార్ పుట్టిన తేదీ ప్రామాణికం) బీమా వర్తిస్తుంది. వచ్చే 15–20 రోజుల్లో యుద్ధప్రాతిపదికన దరఖాస్తుల సేకరణ, డిజిటలైజేషన్ పూర్తి చేయాలి. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా (వారి వాటా వివరాలతో సహా) నమోదు చేయవచ్చు. నామినీ మైనర్ అయితే గార్డియన్ వివరాలు తప్పనిసరి. దరఖాస్తులపై లబ్ధిదారుడు, ధ్రువీకరణ అధికారి సంతకాలు ఉండి, స్కాన్ చేసిన ప్రతులను బీమా సంస్థకు పంపాలి.క్లెయిమ్‌ల పరిష్కారం: బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీకి రూ.5 లక్షల పరిహారం సజావుగా అందేలా గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, డీఆర్డీఓ; పట్టణాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులు కలెక్టర్ పర్యవేక్షణలో సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజ్జు ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (ఇంచార్జి) పురుషోత్తం, డీఆర్డీఓ మధుసూదన రాజు, సీపీఓ శ్రీనివాసరావు, డీపీఓ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ జ్యోతి దర్శనం, గిరి ప్రదక్షిణ, లక్షదీపోత్సవం

దక్షిణ భారతదేశంలో అఖండ జ్యోతి నిర్వహిస్తున్న మూడవ దేవస్థానంగా పేరుపొందిన పాలకుర్తి ఆలయం

ఈ నెల 24న వైభవంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు

జనగామ, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి) :



జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలోగల శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం ధాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ, అఖండ జ్యోతి దర్శనం, లక్షదీపోత్సవం, తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దక్షిణ భారతదేశంలో అఖండ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మూడవ దేవస్థానంగా పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ప్రత్యేక గుర్తింపు పొందింది.ఈ నెల 24న నిర్వహించే అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని శ్రీ శ్రీ శ్రీ స్వామి దుర్గానందపురి మహారాజ్ (మాజీ అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠం పీఠాధిపతి) చేతుల మీదుగా చేపట్టనున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం రోజున సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అఖండ జ్యోతి దర్శనం, లక్షదీపోత్సవానికి సంబంధించిన ప్రచార గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణకు కంచర్ల భూపాల్‌రెడ్డి నివాళి



నల్గొండ జిల్లా నవంబర్ 13 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో పట్టణంలోని మాన్యంచెల్కలో మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ పార్థివదేహాన్ని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మాతంగి సత్యనారాయణ ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేసి మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. దివంగత సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, గోపగోని స్వాతి రాజశేఖర్, పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, దొడ్డి రమేష్, మాజీ కౌన్సిలర్లు రావుల శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ సమీ, మెరుగు గోపి, అల్లి వేణు, జమాల్ ఖాద్రి, పెరిక కరణ్, జయరాజ్, భాషపాక హరికృష్ణ, మాతంగి అమర్, పెరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా బిడ్డ జయంత్ బాల కథానాయకుడిగా 'జయంత్ & ది జింగో పెన్' విడుదల

సూర్యాపేట, నవంబర్ 13: వుదయం ప్రతినిధి

పిల్లలు చదువులో వెనుకబడితే మందలిస్తున్నామా? ఇతర పిల్లలతో పోల్చి ఒత్తిడికి గురిచేస్తున్నామా? వారి మనసులో ఏం జరుగుతుందో ఎప్పుడైనా అర్థం చేసుకుంటున్నామా? ఇలాంటి ఆలోచింపజేసే ప్రశ్నలకు సమాధానం చెప్పే చిత్రమే 'జయంత్ & ది జింగో పెన్'.పిల్లల చదువు, మానసిక సంఘర్షణలు, తల్లిదండ్రుల బాధ్యత, చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాల్సిన ఆవశ్యకత వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ బాలల చిత్రం నవంబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కానుంది. సూర్యాపేట పట్టణంలోని తిరుమల మల్టీప్లెక్స్ లోనూ ప్రదర్శితం కానుంది. సూర్యాపేట జిల్లా నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన బొలిశెట్టి ప్రవీణ్ పోలీస్ శాఖలో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య బొలిశెట్టి దివ్యా ప్రవీణ్ నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, వారి కుమారుడు జయంత్ ఈ చిత్రంలో బాల కథానాయకుడిగా నటించారు. పోలీస్ విధులతో పాటు కుటుంబం నుంచి వచ్చిన ఈ సృజనాత్మక ప్రయత్నం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.ప్రతి విద్యార్థికీ ఒకే స్థాయి సామర్థ్యం ఉండదు. ఒక సబ్జెక్టులో వెనుకబడినంత మాత్రాన ప్రతిభ లేదని కాదు. అలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఎదుర్కొనే ఒత్తిడి, వారి అంతర్మథనం, దాన్ని అధిగమించే మార్గాలను ఈ చిత్రంలో హృద్యంగా చూపించారు. మలయాళంలో విశేష ఆదరణతో పాటు దాదాపు 8 అవార్డులు అందుకున్న చిత్రానికి రీమేక్ గా దీనిని రూపొందించారు. ప్రముఖ నటులు తనికెళ్ల భరణి, సత్యం రాజేష్ తదితరులు నటించడం విశేషం.వినోదం కోసమే కాకుండా పిల్లలను అర్థం చేసుకోవడానికి, వారి ప్రతిభను గుర్తించడానికి, ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి ఈ చిత్రం మంచి ఆలోచనను ఇస్తుంది. హింస, ఆర్భాటాలకు దూరంగా కుటుంబమంతా కలిసి చూడదగిన చిత్రమని, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలతో కలిసి థియేటర్ కు వచ్చి చూడాలని చిత్ర బృందం కోరుతోంది.మన ప్రాంత బిడ్డ జయంత్ వెండితెరపై అడుగుపెడుతున్న ఈ సందర్భంగా జిల్లా ప్రజలు ఆదరించి అండగా నిలవాలని సీఐ బొలిశెట్టి ప్రవీణ్ బంధువులు, మిత్ర బృందం బందు శ్రీధర్ బాబు, బొలిశెట్టి మధు, బంధు వీరయ్య, తొగరు మల్లికార్జున్, పత్తిపాక వేణు, సంధ్యాల వినోద్, సోమిశెట్టి లింగయ్య, సంధ్యాల వెంకట నారాయణ ఒక ప్రకటనలో కోరారు.



తీన్మార్ మల్లన్నకు ప్రాణహాని కలిగించే కుట్రలను సహించేది లేదు

టిఆర్పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

భూపాలపల్లి నవంబర్ 13 వుదయం ప్రతినిధి:



తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపడుతున్న బీసీ రాజ్యాధికార పాదయాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు రాజకీయ శక్తులు ఆయనపై దాడులకు కుట్రలు చేస్తున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తీవ్రంగా ఆరోపించారు.నేటి పాదయాత్ర సందర్భంగా తీన్మార్ మల్లన్న ప్రయాణిస్తున్న ఫార్చునర్ వాహనాన్ని లారీతో ఢీకొట్టే ప్రయత్నం జరిగిందనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.గతంలో బెల్లి లలిత, మారోజు వీరన్న, సాంబశివుడు, ఎర్ర సత్యం వంటి ఎందరో ఉద్యమకారులు సామాజిక న్యాయం, తెలంగాణ హక్కుల కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. నేడు అదే తరహాలో బీసీల రాజ్యాధికారం కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్నకు ముప్పు కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.51 రోజులుగా నిర్విరామంగా వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ బీసీల విద్య, వైద్యం, ఉద్యోగాలు, రాజకీయ వాటా, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న మల్లన్నను బెదిరింపులతో ఆపలేరని, ఈ ఉద్యమం ఇప్పటికే ప్రజల ఉద్యమంగా మారిందని స్పష్టం చేశారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలారా! ఇకనైనా మేల్కొనండి. మన హక్కుల కోసం, మన భవిష్యత్తు తరాల కోసం పోరాడుతున్న నాయకులకు అండగా నిలవండి. మన విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ అధికార సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం. ఆధిపత్య రాజకీయాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టి సమాధానం చెబుదామని రవి పటేల్ పిలుపునిచ్చారు.ఈ ఘటనను తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండించాలని, రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే స్పందించి తీన్మార్ మల్లన్నకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలని, ఆయన ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తీన్మార్ మల్లన్నకు ఏదైనా హాని జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని బెదిరింపులతో అణచివేయాలని చూస్తే సహించేది లేదు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి కుట్ర వెనుక ఉన్న వారిని చట్టం ముందు నిలబెట్టాలని రవి పటేల్ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మరో భారీ బీసీ ఉద్యమానికి ఈ ఘటన కారణం కాకముందే ప్రభుత్వం మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని, బీసీ రాజ్యాధికార సాధన కోసం ప్రజలందరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, అధికార ప్రతినిధి మడే సంతోష్, కోశాధికారి జినుకల శ్రీను, జిల్లా కోఆర్డినేటర్ మోటపోతుల సమ్మయ్య, జిల్లా నాయకులు జిలకల అశోక్, గట్టు శ్రీకాంత్, రోడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభం

ప్రతి కుటుంబానికి పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి

నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం

18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుడికి 5 లక్షల రూపాయల బీమా రక్షణ

దరఖాస్తుల సేకరణ నామినీ వివరాల నమోదు డిజిటలైజేషన్ పక్కాగా జరగాలి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి

జగిత్యాల నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమని దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. కులం మతం ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జీవిత బీమా పథకాలు కొన్ని నిర్దిష్ట వర్గాలకే పరిమితమయ్యాయని రాష్ట్ర ప్రభుత్వ దార్శనికత మాత్రం ప్రతి కుటుంబం భద్రతతో జీవించాలనే లక్ష్యంతో ఉందన్నారు. నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా పథకం ప్రారంభమవుతుందని తెలిపారు.

నవంబర్ 14 నుంచి విస్తృత ప్రచారం చేపట్టాలి

భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నవంబర్ 14 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశ అభివృద్ధికి బాటలు వేసిన నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ పథకం సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే ద్వారా అన్ని కుటుంబాల వివరాలు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నవంబర్ 19న ప్రతి గ్రామంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కుటుంబ పెద్ద సూచించిన వ్యక్తిని నామినీగా నమోదు చేసుకోవచ్చని ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ప్రతిపాదించే అవకాశం ఉంటుందని వివరించారు.

ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఈ పథకం అమలును దేశమంతా నిశితంగా గమనిస్తోందని, ప్రతి జిల్లా కలెక్టర్ బాధ్యతతో వ్యవహరించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పథకాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి స్వయంగా పథకం అమలు తీరును పర్యవేక్షిస్తారని తెలిపారు. పంచాయతీరాజ్ మున్సిపల్ శాఖల అధికారులు సిబ్బంది చురుగ్గా పని చేస్తూ గ్రామాలు పట్టణ ప్రాంతాల్లోని వార్డుల వారీగా అవసరమైన నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఈ పథకంపై సమాచారం చేరేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించి పథకం ఉద్దేశం ప్రయోజనాలు దరఖాస్తుల స్వీకరణ వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎలాంటి కుటుంబం ఈ పథకం గురించి తెలియక లబ్ధి పొందకుండా ఉండిపోకూడదని రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పథకం చేరేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని, దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సూచించారు.



కుటుంబంలోని సంపాదన సభ్యుడికి జీవిత బీమా కల్పించే విధంగా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల అర్హులైన వ్యక్తుల వివరాలను సేకరించాలని తెలిపారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు బీమా పొందే వ్యక్తి పేరు, తండ్రి లేదా భర్త పేరు లింగం ఆధార్ నంబర్ మొబైల్ నంబర్ కుటుంబ సభ్యుల వివరాలు.వారి ఆధార్ నంబర్లు సేకరించాలని తెలిపారు. దరఖాస్తులో జిల్లా మండలం గ్రామం లేదా పట్టణ వార్డు వివరాలు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నామినీ వివరాలను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ప్రతిపాదించిన సందర్భంలో ప్రతి ఒక్కరి వాటా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. నామినీ మైనర్ అయిన పక్షంలో అతని తరపున నియమించిన గార్డియన్ లేదా ప్రతినిధి వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తులో అవసరమైన వివరాలు పూర్తిగా ఉండాలని దరఖాస్తుదారుడి సంతకంతో పాటు సంబంధిత ధ్రువీకరణ అధికారి సంతకం కూడా ఉండేలా చూడాలన్నారు. వివరాల నమోదు నామినీ వివరాల సేకరణలో ఎలాంటి తప్పులు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. సంతకం చేసిన దరఖాస్తులను స్కాన్ చేసి డిజిటల్ విధానంలో బీమా సంస్థకు పంపించాలని సీఎస్ సూచించారు. అసలు దరఖాస్తులను జిల్లా స్థాయిలో భద్రపరచాలని భవిష్యత్తులో అవసరమైన పరిశీలన ధ్రువీకరణ క్లెయిమ్‌ల పరిష్కారానికి వీలుగా రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు. వచ్చే 15 నుంచి 20 రోజుల పాటు యుద్ధప్రాతిపదికన ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు నామినీ వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు డిజిటల్ వ్యవస్థలో సక్రమంగా నమోదయ్యేలా చూడాలని ఏ ఒక్క కుటుంబం కూడా నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీకి 5 లక్షల రూపాయల బీమా పరిహారం అందించే ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవో సీపీఓ/డీఆర్డీఓ జిల్లా కలెక్టర్ లేదా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమన్వయంతో క్లెయిమ్‌ల పరిశీలన ధ్రువీకరణ చేపట్టి బీమా సంస్థ ద్వారా నామినీకి పరిహారం అందేలా చూడాలన్నారు. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు మున్సిపల్ కమిషనర్లు సీపీఓ/మెప్మా సంబంధిత అధికారులు సమన్వయంతో క్లెయిమ్‌ల ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు అధికారులు. డిప్యూటీ కమిషనర్లు.మున్సిపల్ కమిషనర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో సీపీఓ డీఆర్డీఓ ఎంపీడీఓలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మున్సిపల్ కమిషనర్లు మెప్మా అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్లెయిమ్‌లకు సంబంధించిన వివరాలు పెండింగ్ దరఖాస్తులు పరిష్కార పురోగతిని జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

వరి సాగును నియంత్రించి నీటి లభ్యతకు అనుగుణంగా ప్రణాళిక

ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతం హాజరు లక్ష్యం

జిల్లా కలెక్టర్లతో సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):

యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున వరి సాగును నియంత్రించి, ఆయిల్‌పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్య, భూసేకరణ, వీబీజీ రామ్ జీ పథకం, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు. యాసంగిలో నీటి లభ్యతను బట్టి పంటల సాగు చేపట్టాలని సీఎస్ సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పంటల వైవిధ్యీకరణ, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానేసిద్ధంచేసి, సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

పాఠశాలల్లో 90 శాతం హాజరు లక్ష్యం...

ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు కనీసం 90 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వారీగా హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మంజూరైన 41 పనుల్లో ఇప్పటివరకు ఎనిమిది పూర్తయ్యాయని, మిగిలిన 33 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. సమగ్ర శిక్ష, పీఎం శ్రీ పథకాల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో రూ.11వేల కోట్లతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు సహా ప్రభుత్వ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు..

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండేప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే వీబీజీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాబార్డ్ నిధులతో చేపట్టిన విద్యాలయాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయుల హాజరును రోజువారీగా పరిశీలించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించి జిల్లాలో వరి సాగును నియంత్రించాలని సూచించారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతరఉద్యానపంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. అగ్రహారంలో డిగ్రీ బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్బేగం, పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామ కృష్ణ, నీటిపారుదల శాఖ అధికారి యుగంధర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, ఎస్‌డీసీ మోహన్ సింగ్, పర్యాటక, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి

ధర్మపురి, నవంబరు13 (వుదయం ప్రతినిధి):

ధర్మపురి పట్టణంలోని ఖానా పూర్ సిఎం గార్డెన్స్‌లో నిర్వ హించిన మున్సిపల్ ఎన్విరా న్‌మెంట్ ఇంజనీర్ మహేష్, శ్రీజల వివాహ మహోత్సవ వేడుక ఘనంగా జరిగింది.ఈ వేడుకలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి ,ప్రత్యేక అతిథిగా విచ్చేసి,నూతన వధూవరులను ఘనంగా ఆశీ ర్వదించి తమ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న దంపతులు ఆయురారోగ్యాలతో,సంతోషం గా కలకాలం వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు.ఈ వివాహ వేడు కలో జిల్లా



గ్రంథాలయ సంస్థ చై ర్మన్ సంగనబట్ల దినేష్,మండ ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

భారత్ సమిట్ పై విమర్శలు చేయడం సరికాదు:

డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్

కరీంనగర్ నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

భారత్ సమిట్‌పై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నానని కరీంనగర్ డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ పేర్కొన్నారు. భారత్ సమిట్‌ను దేశ వ్యతిరేక శక్తుల కోసమే నిర్వహిస్తున్నారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యానించడం, అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భారత్ సమిట్ కాదు దేశ వ్యతిరేక సమిట్ అంటూ విమర్శలు చేయడం వారి రాజకీయ సంకుచిత వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు.తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, ప్రపంచ దేశాల ప్రతినిధులు,




మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఒకే వేదికపై చర్చించేందుకు భారత్ సమిట్ దోహదపడుతుందని తెలిపారు. ఇలాంటి అంతర్జాతీయ వేదికను స్వాగతించాల్సింది పోయి, రాజకీయ కక్షతో దేశ వ్యతిరేక కార్యక్రమంగా చిత్రీకరించడం బాధ్యతాయుతమైన నాయకుల లక్షణం కాదన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, అంతర్జాతీయ పెట్టుబడులు, తెలంగాణ ఖ్యాతిని పెంపొందించే కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా అనవసర ఆరోపణలు చేయడం ద్వారా బీజేపీ నేతలు తమ రాజకీయ ఆలోచనా విధానాన్ని బయటపెట్టుకుంటున్నారని అన్నారు.తెలంగాణ అభివృద్ధిని, రాష్ట్ర గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనకు విస్తృత అవగాహన కల్పించాలి- కలెక్టర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 13:

మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా రూపొందించిన మత్తు పదార్థాల నివారణ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్ లో ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులు, ప్రజ లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు



సూచించారు. మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తుపదార్థాల నిర్మూలనకు విస్తృత ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈవో మాధవి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మనోహర్ రావు, స్టేట్ ఈసీ మెంబర్ రాజేశ్వరరావు, డైరెక్టర్లు రాజు, బండారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ప్రత్యేక పిల్లల ప్రజావాణి కలెక్టర్



ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి)


జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో ఈ నెల 16న సోమవారం ఉదయం 10:30 గంటలకు సాధారణ ప్రజావాణితో పాటు ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.హరిత తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లల హక్కుల ఉల్లంఘన, భద్రత, విద్య, ఆరోగ్యం, పోషకాహారం తదితర సమస్యలపై బాలబాలికల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమస్యలను పరిష్కరించడంతో పాటు పిల్లల వివరాల గోప్యతను పాటిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS

నిర్మల్ జిల్లా(వుదయం ప్రతినిధి) 14 నవంబర్ 2026

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో పాల్గొని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రహదారులపై అక్రమ పార్కింగ్, ఆక్రమణలను తొలగించాలని, పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా



ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరం చేస్తూ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించేవారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని, ప్రమాదాల నివారణకు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై బాధ్యతగా వ్యవహరించి తమప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని కలెక్టర్, ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట మాధవ రావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రాజేందర్, ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 16న ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహణ: కలెక్టర్

మంచిర్యాల /నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమి షన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన (సాధారణ ప్రజావాణితో పాటు) ప్రత్యేకంగా "పిల్లల ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాలలకు సంబంధించిన వ్యక్తిగత, సామాజిక సమస్యలు, ఇబ్బందులు, ఇతర ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని బాలబాలికలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకొని, పిల్లలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో తెలియ జేయవచ్చని వివరించారు.



సింగరేణి స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత శ్రీరాంపూర్ జట్టు

-క్రీడల్లో గెలుపోటములు సహజం..

-మందమర్రి జీఎం ఎన్. రాధాకృష్ణ

మంచిర్యాల /రామకృష్ణాపూర్/ నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు క్రీడల అభివృద్ధికి కూడా సముచిత ప్రాధాన్యతనిస్తూ కార్మికుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపు సాధించిన వారు మరింత బాధ్యతతో ముందుకు సాగాలని, ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా పట్టుదలతో సాధన కొనసాగించాలని సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించిన కంపెనీ స్థాయి వార్షిక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింగరేణి పరిధిలోని 11 ఏరియాల నుంచి వచ్చిన ఆరు జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో మణుగూరు, ఇల్లందు, శ్రీరాంపూర్ ఏరియా జట్లు ఫైనల్ దశకు చేరుకోగా, చివరకు శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజేతగా నిలిచింది. మణుగూరు, ఇల్లందు జట్టు రన్నర్ అప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ...మూడు రోజులపాటు క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా, క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతి జట్టు విజయం కోసం కృషి చేసినప్పటికీ ఫైనల్‌లో ఒక జట్టుకే విజయం



దక్కుతుందని పేర్కొన్నారు. గెలుపొందిన శ్రీరాంపూర్ ఏరియా జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విజేత జట్టును కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించే క్రికెట్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సంస్థ అభివృద్ధిలో కార్మికుల కృషి ఎంతో కీలకమని, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సమష్టి కృషితో సింగరేణిని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఐకమత్యం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు కార్మికుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని అలవర్చుతాయని అన్నారు. ఇలాంటి టోర్నమెంట్ల నిర్వహణతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, సీనియర్ పిఓ కార్తీక్, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ ఆలీ,ఇప్పకాయల లింగయ్య, స్పోర్ట్స్ సూపర్వైజర్లు సీహెచ్. అశోక్, ఎం. నరేందర్ రెడ్డి, పరస్ప శ్రీనివాస్, మందమర్రి ఏరియా స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ శివ, క్రికెట్ రిఫరీలు, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వుదయం



ముఖ్యమంత్రి పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

సభా ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ

సిద్దిపేట, నవంబర్ 13 (వుదయం బ్యూరో)

నవంబర్ 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ ప్రాంగణాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి మరియు పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల ముందుగా అనుకున్న సిరిసిల్ల బైపాస్ రోడ్డు మార్గంలో ని స్థలాన్ని మార్చి జిల్లా కేంద్రంలోని నాగ దేవత ఆలయం ఎదురుగా గల నందాల వెంకట లక్ష్మి గార్డెన్ వెనుక బైపాస్ మరియు చిన్నగుండవెల్లి రహదారికి ఆనుకుని ఉన్న సుమారు పదహారు ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ వేదికను ఖరారు చేసినట్లు వెల్లడించారు. ఎంపిక చేసిన ప్రాంగణం సరిహద్దులను వెంటనే నిర్ధారించాలని రెవెన్యూ మరియు సర్వే అధికారులను ఆదేశించడంతో పాటు మైదానంలోని చెట్లపొదలు మరియు పిచ్చి మొక్కలను యంత్రాల సహాయంతో పూర్తిగా తొలగించి శుభ్రపరచాలని పురపాలక కమిషనర్‌కు సూచించారు. నేల చదును చేసిన అనంతరం ప్రధాన సభా వేదిక అత్యున్నత ప్రముఖుల వాహనాల నిలుపుదల ప్రాంతం పాత్రికేయ వేదిక ప్రజాప్రతినిధులు మరియు ప్రజల ఆసన ఏర్పాట్లు బస్సులు ఇతర వాహనాల పార్కింగ్ తదితర వివరాలతో కూడిన సమగ్ర నమూనా చిత్రపటాన్ని రూపొందించాలని ఇంజనీరింగ్ మరియు రెవెన్యూ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో రెవెన్యూ డివిజనల్ అధికారి సదానందం సహాయ పోలీస్ కమిషనర్ రవీందర్ రెడ్డి పురపాలక కమిషనర్ మల్లికార్జున్ తహసీల్దార్ హరికిరణ్ సర్వే పోలీస్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

మహబూబ్‌నగర్

బాలల హక్కుల పరిరక్షణ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుంది: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాబాలల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం, వివిధ శాఖలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

అనంతరం మాట్లాడుతూ.. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. పిల్లలు సంతోషంగా, స్వేచ్ఛగా జీవితాన్ని గడిపేందుకు, వారి అభిరుచులు, ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్రతి చిన్నారికి జీవించే హక్కు, విద్యను పొందే హక్కు, ఆరోగ్యంగా ఉండే హక్కు, రక్షణ పొందే హక్కు ఉన్నాయని పేర్కొన్నారు. బాలల హక్కులకు ఎక్కడైనా భంగం కలిగితే పోలీసు, వైద్యారోగ్య, విద్య, న్యాయ శాఖలతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు వారికి అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని పిల్లలకు సూచించారు.వివిధ కారణాలతో తల్లిదండ్రులకు దూరమైన పిల్లలను తిరిగి వారి కుటుంబాలకు చేరువ చేసేందుకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా అవసరమైన



చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలల భద్రత, హక్కులు, చట్టపరమైన రక్షణ, సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేకంగా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా, ఉత్సాహంగా, ఆనందంగా ఉండటమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం, అభివృద్ధి పనులు బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్నామని చెప్పారు. వారికి మెరుగైన వాతావరణం, విద్య, వసతులు, పౌష్టికాహారం అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని వివరించారు.పిల్లలు ప్రస్తుతం తమ జీవితంలో ఎంతో విలువైన బాల్యదశలో ఉన్నారని, ఈ సమయాన్ని ఆనందంగా గడుపుతూ కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, సంరక్షకులు పిల్లల పట్ల ఓర్పు, సహనంతో వ్యవహరించాలని కోరారు. పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి అభిరుచులకు తగిన అవకాశాలు



కల్పించాలని అన్నారు.CCI విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతం కలెక్టర్‌ను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఎంతో చక్కగా, ఏకాగ్రతతో పాటలను నేర్చుకుని ఆలపించడం అభినందనీయమని ఆమె ప్రశంసించారు. పిల్లల స్వచ్ఛమైన మనసు, నేర్చుకునే ఆసక్తి పెద్దలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తాము కూడా వారి నుంచి స్ఫూర్తి పొంది పాటలను నేర్చుకోవాలని కలెక్టర్ అన్నారు.బాలల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ బాలల సంరక్షణ సంస్థల్లో చిత్రలేఖనం, పెయింటింగ్, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, కబడ్డీ తదితర క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. CCI విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఎస్. రవికుమార్, వివిధ బాలల సంరక్షణ సంస్థలకు చెందిన చిన్నారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- **డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి**
- **34 మంది పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేత**

మెదక్, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసులో పక్కా సాక్ష్యాధారాలు సేకరించి, సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, దర్యాప్తు పూర్తి చేసి సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో బాధితుల ఆచూకీ గుర్తించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని, ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఎస్పీ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.నేరాల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

అన్ని శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, నవంబర్ 13 (వుదయం బ్యూరో) :

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన, విద్య, పశుసంవర్ధక, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, వివిధ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న సివిల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక



వసతుల కల్పనకు చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరును పర్యవేక్షించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్‌వాలా వంటి డిజిటల్ విద్యా వేదికలను విస్తృతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగంలో సమర్థవంతంగా ఉపయోగించుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించేలా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిఈఓ రమేష్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు.ఏఈడీపీ (AEDP) కోర్సుల అమలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు (GDC), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు (GPT)లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించే అంశాలపై కూడా సమీక్షించారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ఉపాధి రంగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా సంబంధిత శాఖలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రోడ్లు భవనాల శాఖ పరిధిలో జాతీయ రహదారులు (NH), భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ రహదారి ప్రాజెక్టుల పురోగతిని, ఆయా ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ, అటవీశాఖ అనుమతులు, విద్యుత్ లైన్ల మార్పిడి, ఇతర మౌలిక సదుపాయాల తరలింపు (యుటిలిటీ షిఫ్టింగ్) వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.రహదారి నిర్మాణ పనులు అనవసర జాప్యానికి గురికాకుండా అవసరమైన అనుమతులు, భూసేకరణకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక దృష్టిసారిస్తూ, పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు ముందుకు సాగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు అవసరమైన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టిందని, అందులో భాగంగానే నాగర్‌కర్నూల్ జిల్లాలో 2500 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, అదేవిధంగా 2500 ఎకరాల్లో కూరగాయల పంటల సాగుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి రైతులకు అవగాహన కల్పించి కూరగాయల సాగును ప్రోత్సహించేలా ప్రణాళికలను అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బిందు సేద్యం వంటి ఆధునిక పద్ధతులను రైతులు అనుసరించేలా ప్రోత్సహించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి యశ్వంతరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి

- **ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి**
- **యంగ్ ఇండియా, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి**
- **సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను గడువులోగా పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల, నవంబర్ 13 (వుదయం బ్యూరో)

రాబోయే రబీ 202627 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీ జీరాంజీ పనుల పురోగతిపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత

రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లించాలని, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. పంటల వైవిధ్యీకరణ, రైతు గుర్తింపు కార్డుల నమోదు, వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించినప్పుడు కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పాఠశాలల్లో 90 శాతం హాజరు తప్పనిసరిప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ముఖ గుర్తింపు హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరును పర్యవేక్షిస్తూ విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల వారీగా హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడితే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని, తద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఫిజిక్స్



వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని తెలిపారు.

పాఠశాలల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా నివాస పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్లు నిరంతరం సమీక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూసేకరణ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం తగిన పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

వీబీ జీరాంజీ పథకం కింద చేపట్టే పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులను విస్తృతంగా చేపట్టాలని, సాగునీటి కాలువలను శుభ్రం చేసి అవసరమైన మరమ్మతులు పూర్తి చేయా...



బాలలు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలి

నారాయణపేట టౌన్ నవంబర్ 13(వుదయం ప్రతినిధి)

బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్ లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చాచా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు జీవితంలో పెద్ద పెద్ద కలలు కనాలని అయితే కలలు కనడంతోనే సరిపోదని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు.విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై సమాన ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన విషయాల్లో మరింత ప్రతిభ కనబరుస్తూనే, కష్టంగా భావించే సబ్జెక్టులను కూడా శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులను ప్రశ్నలు అడుగుతూ విషయాలను లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజం, పరిసరాలు, దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు.విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీఈఓ గోవింద రాజులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ బాలాజీ, ఏ ఎం వో విద్యా సాగర్, రాజేంద్ర కుమార్, డీ సీ పీ వో కరిష్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి

- **వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి**
- **యంగ్ ఇండియా పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి**
- **కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీ.ఎస్ సంజయ్ జాజు**

సంగారెడ్డి, నవంబర్ 13 :-వుదయం.

రాబోయే రబీ 202627 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళికను రూపొందించాలని, రైతులను వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.కూరగాయలు వంటి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశించారు.

శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో



వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీజీరాంజీ పనుల పురోగతి పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ పలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రబీ 2026 27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని, పంటల వైవిధ్యీకరణ, పంటల ఉత్పాదకత పెంపు, రైతు రిజిస్ట్రీ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాలని, రైతులందరి వివరాల నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి పనులు, జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సూచించారు. భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సీఎస్ సూచించారు. వీబీజీరాంజీ కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జలసిరి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి కలెక్టర్ ప్రతీక్ జైన్,అదనపు కలెక్టర్ పాండు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి

అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్

వనపర్తి నవంబర్ 13 వుదయం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) విధానం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు విధిగా నమోదు చేయాలి రాబోయే రబీ 2026 27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలనిఅదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, VBGRAMG పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సీఎస్ స్పష్టం చేశారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా సమీక్షించాలని, ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడితే విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను పెంపొందించేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఘణంగా బాలల దినోత్సవ వేడుకలు....

ఊర్కొండ వుదయం

స్థానిక ఊర్కొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాలలో చాచా నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. విద్యార్థులు ఆటలు, పాటలు, డాన్స్‌లతో అలరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల గౌరవ కరస్పాండెంట్ బాల్ రాజు బాల్యం ఎంతో విలువైనదని ఎంతో నేర్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జార్జ్ జోసెఫ్ , వైస్ ప్రిన్సిపాల్ రామ్ పెరుమాండ్ల మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విధులకు గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడు,

ఆరుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీకి ఆదేశం

మహబూబ్‌నగర్

నగ్రుల్లాబాద్ జెడ్పీ హెచ్ఎస్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మిక తనిఖీజడ్చర్ల మండలంనగ్రుల్లాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు.దీనిపై అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ,విధులకు గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడు,ఆరుగురు ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని (డీఈఓ) ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

గద్వాల జిల్లాలో సీఎంఆర్ అక్రమాలపై సీఎం వెంటనే స్పందించాలి

- **ప్రభుత్వ ధాన్యం దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలి**
- **అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి మిల్లులను సీజ్ చేయాలి**
- **సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు డిమాండ్**



గద్వాల, నవంబర్ 13 (వుదయం బ్యూరో)

జోగులాంబ గద్వాల జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పేరుతో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం గద్వాలలోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం రైస్ మిల్లులకు అప్పగిస్తే, మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యాన్ని పూర్తిస్థాయిలో అందించడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారంలో వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందించాల్సిన సన్న బియ్యాన్ని పక్కదారి పట్టించి, దొడ్డు బియ్యాన్ని తిరిగి శుద్ధి చేసినట్లు చూపుతూ, అందులో నూకలు కలిపి నాసిరకం బియ్యంగా మార్చి ప్రభుత్వ గోదాములకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. అనంతరం అదే బియ్యాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గత ఆరు సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతున్నట్లు చెబుతున్న ధాన్యం అక్రమాలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఆగకపోవడం ఆందోళనకరమని అన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు రైస్ మిల్లర్లకు బడా ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

సీఎంఆర్ లావాదేవీలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి ప్రభుత్వ ధాన్యం, ప్రజాధనం దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణలపై ఉన్నతస్థాయి సమగ్ర విచారణ చేపట్టాలని ఆంజనేయులు కోరారు. జిల్లాలోని రైస్ మిల్లుల వారీగా సీఎంఆర్ లావాదేవీలు, ధాన్యం నిల్వలు, మిల్లింగ్ చేసిన బియ్యం పరిమాణం, ప్రభుత్వ గోదాములకు సరఫరా చేసిన బియ్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైస్ మిల్లులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం, బియ్యాన్ని పూర్తిస్థాయిలో రాబట్టడంతో పాటు ఈ వ్యవహారంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆశన్న, కృష్ణ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ప్రవీణ్, వెంకటేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల గ్రామంలో

నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

వట్టిపల్లి, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

వట్టిపల్లి మండల పరిధిలోని మంచిర్యాల గ్రామంలో 20 లక్షల తో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ జ్యోతి మోహన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విశ్వాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కచ్చర్ రావు, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్, వట్టిపల్లి సర్పంచ్ రవిగోరేకల్, లింగారెడ్డి, మాజీ ఎంపీపీ విఠల్, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్ రావు, యువ నాయకులు ప్రవీణ్ గౌడ్, పోచయ్య, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రమేష్, ఉపసర్పంచ్ సునీత శర్వన్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల గ్రామంలో ఇనాం భూములపై వివాదం..!

- **సర్వే నంబర్ 28/ఏ/1లో ప్లాట్ల విక్రయాలపై విచారణ జరపాలి**
- **కలెక్టర్, తహసీల్దార్‌కు గ్రామస్థుల విజ్ఞప్తి**



ఐజ, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం ఉప్పల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 28/ఏ/1లో ఉన్న భూముల విషయంలో వివాదం నెలకొంది. ఈ భూములను ఇనాం భూములుగా పేర్కొంటూ, వాటిలో ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇనాం భూములకు సంబంధించి చట్టపరమైన నిబంధనలను పరిశీలించకుండా, హక్కులపై స్పష్టత లేకుండానే ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత భూములకు ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) మంజూరైందా? అసలు హక్కుదారులు ఎవరు? ప్రస్తుతం భూములను విక్రయిస్తున్న వ్యక్తులకు చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇనాం భూముల విషయంలో వారసత్వ హక్కులు, బదలాయింపు నిబంధనలను పరిశీలించకుండా కొనుగోలు చేస్తే భవిష్యత్తులో కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూముల హక్కులు, రికార్డులు, విక్రయాల చట్టబద్ధతపై స్పష్టత వచ్చిన తర్వాతే లావాదేవీలు జరగాలని కోరుతున్నారు.

కలెక్టర్, తహసీల్దార్ స్పందించాలి

సర్వే నంబర్ 28/ఏ/1కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, ఇనాం భూముల వివరాలు, ఓఆర్‌సీ మంజూరు పత్రాలు, గతంలో జరిగిన భూ బదలాయింపులు, ప్రస్తుత విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అమాయక ప్రజలు మోసపోకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఐజ తహసీల్దార్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ విరాళం

- **రూ.5,116 ఆర్థిక సహాయం అందజేత**



అందోల్, వుదయం

అందోల్ మండలం పోసానిపేట్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి రాంసాన్ పల్లి గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు తనవంతు సహాయంగా రూ.5,116 విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ పనులకు సహకరించాలనే ఉద్దేశంతో నిర్మాణ కమిటీకి తన విరాళాన్ని అందించి, సంబంధిత రసీదును స్వీకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పండుగ హనుమంతు మాట్లాడుతూ, గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు.ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తయ్యేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోసానిపేట్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాంసాన్ పల్లి మాజీ సర్పంచ్ పట్లోళ్ల సునీత బసవరెడ్డి, గ్రామ అధ్యక్షుడు సార వర్మ తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన సర్పంచ్ పండుగ హనుమంతును పలువురు అభినందించారు.

భారత రాజ్యాంగం బహుజనుల ఐక్యత కోసం సభను విజయవంతం చేయాలి

- **పోతులబొగుడలో సభ కరపత్రం విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్**



వట్టిపల్లి నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో డిసెంబర్ 8, 2026న నిర్వహించనున్న "భారత రాజ్యాంగం - బహుజనుల ఐక్యత కోసం" అనే సభకు సంబంధించిన కరపత్రాన్ని అందోల్ మాజీ శాసనసభ్యులు క్రాంతి కిరణ్ గురువారం తన స్వగ్రామమైన పోతులబొగుడలోని నివాసంలో నిర్వాహకుల సమక్షంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బహుజనుల ఐక్యత, సామాజిక చైతన్యం కోసం నిర్వహిస్తున్న ఈ సభలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మేధావులు, రచయితలు, కవులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వం, ఐక్యత వంటి అంశాలపై విస్తృత చర్చ జరగడానికి ఇలాంటి సభలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య

ప్రతి న్యాయవాదికి ఆరోగ్య బీమా అందేలా కృషి చేస్తా

టిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు

నారాయణపేట టౌన్ నవంబర్ 13(వుదయం ప్రతినిధి)



న్యాయవాదుల కష్టాలు నాకు తెలుసని ప్రతి న్యాయవాదికి ఆరోగ్య బీమా అందేలా కృషి చేస్తానని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు అన్నారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు నారాయణపేట పర్యటనలో భాగంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు పలువురు న్యాయవాదులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆకాష్‌కొల్లూరు మాట్లాడుతూ నేను పెరిగింది కోర్టు క్యాంటీన్‌లోనే ఎందుకంటే మా అమ్మ న్యాయవాది ఒక న్యాయవాదిగా ఆమె నెలకు కేవలం రూ.500 సంపాదించే రోజుల నుంచి ఆమె జీవితాన్ని దగ్గరగా చూస్తూ పెరిగాను. అందుకే న్యాయవాదులు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు, వృత్తిపరమైన ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతలు నాకు బాగా తెలుసు అని ఆయన అన్నారు.బార్ కౌన్సిల్ తరఫున వచ్చిన అభ్యర్థన మేరకు న్యాయవాదులందరికీ ఆరోగ్య బీమా సదుపాయం కల్పించే అంశంపై ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రస్తుతం బార్ అసోసియేషన్ల ద్వారా న్యాయవాదులు నెలకు రూ.300 చొప్పున చెల్లిస్తూ, అవసరమైన సందర్భాల్లో రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం పొందుతున్న విధానాన్ని ప్రస్తావించారు. ఇదే తరహాలో, తెల్ల రేషన్ కార్డు పథకం మాదిరిగా అర్హులైన న్యాయవాదులందరికీ ఆరోగ్య భద్రత కల్పించే సమగ్ర సంక్షేమ పథకాన్ని తీసుకురావడానికి ప్రభుత్వంతో చర్చించి కృషి చేస్తానని తెలిపారు.

న్యాయవాదులు కేవలం న్యాయవ్యవస్థలో భాగస్వాములు మాత్రమే కాదని, సామాన్య ప్రజలకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వారి ఆరోగ్యం, ఆర్థిక భద్రత, సంక్షేమం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలని ఆకాష్ కొల్లూరు పేర్కొన్నారు.న్యాయవాదుల సంక్షేమం కోసం బార్ అసోసియేషన్లు, బార్ కౌన్సిల్ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే బి.ఎం. రెడ్డి

- **పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్న తాండూరు శాసనసభ్యులు**



తాండూరు నవంబర్ 13(వుదయం ప్రదినిధి)

యాలాల్ మండలం జుంటుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సరదాగా ముచ్చటిస్తూ, వారితో కలిసి అల్పాహారం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు.అనంతరం విద్యార్థుల చదువుల తీరును, పాఠశాలలో అందుతున్న వసతులు మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం అయన

మాట్లాడుతూ..విద్యార్థుల కోసం ఎంత ఖర్చు చేసినా అది ఖర్చు కాదు, భావి తరాల భవిష్యత్తు కోసం పెట్టే గొప్ప పెట్టుబడి. నేటి విద్యార్థులపై పెట్టే ప్రతి రూపాయి రేపటి సమాజ అభివృద్ధికి పునాది అవుతుంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచేందుకు, విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణానికి స్థల పరిశీలన



చిలిపిచేడ్, నవంబర్ 13(వుదయం ప్రతినిధి):

చిలిపిచేడ్ మండలం సోమక్కపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీవో,

ఏపీవో, ఎంఈఓ, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మూడు గిరిజన తండాలకు మహర్దశ..

బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

రూ.3.90 కోట్లతో మూడు గిరిజన తండాలకు బీటీ రోడ్లు.. పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నాగల్‌గిద్ద, నవంబర్ 13 (వుదయం):

నాగల్‌గిద్ద మండల పరిధిలోని మూడు తండాలకు మహర్దశ పట్టనుంది. ఎన్నో ఏళ్లుగా రోడ్ల సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న తండావాసుల కల నెరవేరనుంది. ఇరాక్‌పల్లి హనుమాన్ తండా, ఉమ్లా తండా గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్య తండాకు రూ.1.70 కోట్లు, ఎనక్‌పల్లి కొండ్య నాయక్ తండాకు రూ.2.20 కోట్ల ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులతో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.3.90 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ తండాలకు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో తమ చిరకాల కోరిక నెరవేరుతోందని హర్షం వ్యక్తం చేశారు. తమ తండాలకు రహదారుల సౌకర్యం కల్పిస్తున్న ఎమ్మెల్యేకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన తండాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత పదేళ్లలో తండాల రహదారుల అభివృద్ధిని పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా రోడ్లను మంజూరు చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీఈ సంపత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విట్టల్ రావు పాటిల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, సర్పంచులు కవిత, నారాయణ జాదవ్, అశోక్, హాట్టి సింగ్, రతన్ సింగ్, సువాలి బాయి, గోవింద్, సంతప్ప, నాగమ్మ, నాయకులు శరణప్ప, సురేష్, ప్రేమ్‌సింగ్, కమల్‌సింగ్, ఎషప్ప, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, విట్టల్ రెడ్డి, సర్పంచ్ అనిల్ పాటిల్, ఎంపీటీసీ నర్సప్ప, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 14 నుంచి 20 వరకు సంగారెడ్డిలో

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- **విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి**
- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కార్యదర్శి మనోజ్ కుమార్**

సంగారెడ్డి, నవంబర్ 13 .వుదయం.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు, పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కార్యదర్శి మనోజ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.వారోత్సవాలలో భాగంగా నవంబర్ 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవం, బాలల దినోత్సవం నిర్వహిస్తారని,నవంబర్ 15 న పుస్తక ప్రదర్శన, 16న జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాసరచన పోటీలు, 17న జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లోఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నవంబర్ 18న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు,19న మహిళా దినోత్సవ కార్యక్రమం ఉంటుందని,నవంబర్ 20వ తేదీ వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం, వారోత్సవాల ముగింపు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థినీ, విద్యార్థులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ పోటీల్లో తమ ప్రతిభను చాటుకోవాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రికి

శాశ్వత 108 అంబులెన్స్ కేటాయింపు

- **ప్రభుత్వ ఆసుపత్రికి శాశ్వత 108 అంబులెన్స్ కేటాయింపు**
- **మంత్రి దామోదర రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముజఫర్ హుస్సేన్**



కోహీర్, నవంబర్ 13 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల ప్రజలకు అంబులెన్స్ అందుబాటులోకి వచ్చింది . కోహీర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) శాశ్వతంగా 108 అంబులెన్స్ కేటాయించారు. ఇప్పటివరకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉండగా, ఇకపై కోహీర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు సకాలంలో అత్యవసర వైద్య సేవలు అందనున్నాయి.

కోహీర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆయన చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించి కోహీర్ ప్రభుత్వ ఆసుపత్రికి శాశ్వత 108 అంబులెన్స్‌ను కేటాయించడంతో స్థానిక ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.ఈ సందర్భంగా ఆసుపత్రి వద్ద అంబులెన్స్‌ను ప్రారంభించి హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదాలు,

గుండెపోటు, ప్రసవాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు ఈ అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, మాజీ వైస్ ఎంపీపీ మహమ్మద్ షకీర్ అలీ, అబ్దుల్ మతీన్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కోహీర్ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నాగుల చవితి పండుగ

- **మేళ్లచెరువు శివాలయంలో పోటెత్తిన భక్తజనం**



మేళ్లచెరువు నవంబర్ 12 (వుదయం విలేకరి):

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ ఇష్ట కామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం నందు పవిత్ర నాగుల చవితి సందర్భంగా తెల్లవారుజాము న నాలుగు గంటల నుంచే భక్తులు దేవాలయంలో ఉన్నటువంటి పుట్టకు పూజా కార్యక్రమంలో నిర్వహించి పాలు పోయడం జరిగింది. దేవాలయంలో ప్రాతఃకాలంలో స్వామివారికి విశేష అభిషేకములు, వివిధ పూజా కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన శర్మ,కొంకపాక ధనుంజయ శర్మ, దేనియేషన్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, కార్యనిర్వహణ అధికారి నాగేల్ల.శంబిరెడ్డి

అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

ఎంత తిన్నా నీరసమేనా!?



ఉదయాన్నే
ఉత్సాహంగానే లేస్తాం..వేళకు టిఫిన్ తింటాం... మధ్యాహ్నం భోజనం చేస్తాం... అయినా మనలో కొంత మందికి అలసట, నీరసంగా అనిపిస్తుంది. దానికి అసలు కారణమేంటో తెలుసా! రోజుకి మూడు పూటలా తింటున్నా మన ఒంటికి సరిపడా పోషకాలు అందుతున్నాయా? అంటే లేదనే చెబుతున్నారు పోషకాహార నిపుణులు. కారణం మనం తినే కొన్ని ఆహార పదార్థాలు త్వరగా మన ఎనర్జీని కోల్పోయేలా చేస్తాయట. దానివల్లే ఈ పరిణామాలన్నీ అంటున్నారు. ఆకలి అనిపిస్తే కిచెన్‌వైపు వెళ్లడం మానేసి, ఫోన్‌లో స్విగ్గీ, జొమాటో యాప్‌ల్ని ఓపెన్ చేసి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ పెట్టేస్తాం. ఇంకేం నిమిషాల వ్యవధిలో మన ముందు ఫుడ్ ఉంటుంది. ఎప్పుడైనా ఒక్కసారి ఆలోచించారా? ఇలా ఆర్డర్ చేయగానే అలా వచ్చేస్తోందంటే అది ఎప్పుడు పండి ఉంటారో అని. పోనీ అందులో మనకు ఆరోగ్యకరమైన ఆహారం పెట్టుకుంటామా అంటే అదీ లేదు. పిజ్జాలు, బర్గర్‌లనే ఎంచుకుంటాం. వాటితో ఆ క్షణానికి ఆకలి తీరుతుంది. కారణం వాటిలో ఉండే అదనపు చక్కెరలు, ప్రిజర్వేటివ్స్ తక్షణ శక్తినిస్తాయి. కానీ శరీరానికి కావాల్సిన శక్తిని అందించవు.
సాధారణంగా పండ్ల కంటే పండ్ల రసాల్నే ఇష్టపడతారు చాలామంది. ఇవి ఆరోగ్యానికి మంచివే కానీ, శారీరక శక్తిని త్వరగా కోల్పోయేలా చేస్తాయి. ఫైబర్ మనం తీసుకునే ఆహారంలోని చక్కెరలను నెమ్మదిగా శరీరంలోకి విడుదలయ్యేలా చేస్తుంది. పండ్ల ద్వారా లభించే పీచు పండ్ల రసాల్లో ఉండదు. పైగా చక్కెర స్థాయిలు కూడా ఎక్కువగా ఉంటాయి. వీటిని మనం తీసుకున్నప్పుడు రక్తంలో షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పెరిగి, అంతే వేగంగా తగ్గుతాయి. దాంతో అలసట ఆవరిస్తుంది.
కాఫీ, టీ లేనిదే రోజు మొదలవదు... ఉత్సాహంగా పని చేయలేం ఈ మాటలు మన చుట్టూ ఎవరో ఒకరి నుంచి వింటూనే ఉంటాం. వీటిలో ఉండే కెఫీన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ రోజులో ఎక్కువసార్లు వీటిని తీసుకోవడం వల్ల శరీరంలోని సహజ శక్తి స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు న్యూట్రిషనిస్టులు. వీటితో పాటు తీసుకునే బేకరీ పదార్థాలు... షుగర్, మైదాలతో తయారయ్యేవే. వీటిని మోతాదుకి మించకుండా చూసుకోమని హెచ్చరిస్తున్నారు. తక్షణ శక్తినిచ్చే ఎనర్జీ డ్రింక్స్ శరీరానికి తాత్కాలిక సత్తువనిచ్చినా... వీటిలో వాడే కృత్రిమ చక్కెరలు ఎక్కువసేపు నిల్వ ఉండవు. పైగా జీవక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అందుకే నేటి యవతలో విటమిన్ డి, బి12, ఐరన్ లోపాలు విపరీతంగా పెరుగుతున్నాయి. దాంతో అలసట ఆవరిస్తోంది. నిజానికి పోషకాహార లోపం శరీరాన్ని మాత్రమే కాదు, ఏకాగ్రతనీ దెబ్బతీస్తుంది. నిద్రలేమిని పెంచుతుంది. మూడ్ స్వింగ్స్‌కి కారణం అవుతుంది. ప్లేట్ నిండా ఏది పడితే అది తినే కంటే శరీరానికి రోజంతా శక్తిని అందించే తాజా పండ్లు, కూరగాయలు, నట్స్, కోడి గుడ్లు, పాలు, పాల పదార్థాలు, చేపలు, పప్పు దినుసులు వంటివి తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు. పాటిస్తారుగా మరి!

ఎండల్లో మాధుర్యం!



వేసవిలో మామిడిపండ్లు మనల్ని మహా ఊరిస్తాయి కదూ! వీటితో అప్పటికప్పుడు జ్యూస్ చేసి తాగటం సరే.. ఇవి విస్తారంగా దొరికే ఈ సీజన్‌లో కాన్‌సన్ట్రేట్ డ్రింక్ తయారు చేసుకుంటే.. ఎంచక్కా చల్లటి నీళ్లలో కలిపి ఎండల్లో సేద తీరవచ్చు. కావలసినవి: మామిడిపండ్లు – 4, పంచదార – నాలుగు కప్పులు, నిమ్మరసం – రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – పావు స్పూన్, నీళ్లు – ఒకటిన్నర కప్పులు, తయారీ: మామిడిపండ్లను శుభ్రంగా కడిగి చెక్కు తీసి ముక్కలు కోయాలి. వాటిని జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న గిన్నెలో నీళ్లు, పంచదార వేసి వేడిచేయాలి. పంచదార కరిగిన తర్వాత మామిడి గుజ్జు వేసి కలియతిప్పుతూ ఉడికించాలి. చివర్లో నిమ్మరసం, యాలకుల పొడి వేసి సెగ తీసేయాలి. ఈ చిక్కటి పానీయం పూర్తిగా చల్లారిన తర్వాత గాలి చొరబడని గాజు సీసాలోకి తీసి భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు.. గ్లాసు నీళ్లలో రెండు స్పూన్లు కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. ఈ కొలతల ప్రకారం ఇంకా ఎక్కువ పరిమాణంలోనూ చేసుకోవచ్చు. సులభంగా చేసుకోదగ్గ ఈ పానీయాన్ని ఒకసారి ప్రయత్నించి చూడండి. రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే సుమారు రెండు నెలలు నిల్వ ఉంటుంది.

నిద్ర లేవగానే.. ఈ పొరపాట్లు వద్దు!

ఉదయం లేవగానే టీ, కాఫీ తాగడం.. సమయం లేదని బ్రేక్‌ఫాస్ట్ తినకుండానే ఆఫీసుకి వెళ్లడం.. వంటివి చేస్తుంటారు కొందరు. అయితే వీటివల్ల వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి ఉదయం లేవగానే చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లేంటో తెలుసుకుని, వాటిని సరిదిద్దుకుంటే మంచి జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండచ్చంటున్నారు నిపుణులు. కొంతమంది ఉదయం నిద్ర లేచేటప్పుడు వెల్లకిలా పడుకొని అదే పొజిషన్‌లో గబుక్కున లేచి కూర్చుంటారు. కానీ అలా లేవడం వల్ల బిగుసుకుపోయిన కండరాల్లో నొప్పి వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి ఉదయం లేచేటప్పుడు కుడిపక్కకు తిరిగి నెమ్మదిగా లేవడం మంచిది. ఆపై కాస్త అటూ ఇటూ కదలడం వల్ల రాత్రంతా నిశ్చలంగా ఉన్న శరీర భాగాలకు రక్తప్రసరణ మెరుగవుతుందట. ఇదే రోజంతా మనల్ని ఉత్సాహంగా ఉంచుతుందట. కొంతమంది ఉదయం త్వరగానే నిద్ర లేచినా ఆఫీసు టైం వరకు ఏదో ఒక పని చేస్తూ ఆఖరి క్షణాల్లో కంగారుగా రడీ అవుతుంటారు. ఫలితంగా మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. కాబట్టి ఇలా జరగకుండా.. ఆ రోజుకు కావాల్సిన కాయగూరలు తరుక్కోవడం, ఆఫీసుకి వేసుకునే డ్రస్ తీసి పెట్టుకోవడం.. వంటి పనుల్ని ముందు రోజు రాత్రే చేసుకోవాలి. ఫలితంగా మరుసటి రోజు ఉదయం ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా నిద్ర లేవడానికి, పనులు ముగించుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఆఫీస్‌కు టైమవుతోందని బ్రేక్‌ఫాస్ట్ తినడం కూడా మానేస్తుంటారు కొందరు. ఈ అలవాటు దీర్ఘకాలంలో రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు.. స్థూలకాయం, మధుమేహం.. వంటి సమస్యలు తెచ్చి పెట్టే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఉదయం లేచిన దగ్గర్నుంచి సమయాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే బ్రేక్‌ఫాస్ట్‌కూ సమయం సరిపోతుంది చాలామంది ఉదయం లేవగానే చేసే మరో పెద్ద పొరపాటేంటంటే.. మొబైల్ చెక్ చేసుకోవడం, కాల్స్ మాట్లాడడం, చాటింగ్ చేయడం.. ఈ క్రమంలో ప్రతికూల సమాచారం కంట పడితే మూడ్ మొత్తం అప్‌సెట్ అవుతుంది. ఇది కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి అత్యవసర కాల్స్, మెసేజెస్ చేసే పనుంటే తప్ప ఉదయం లేవగానే మొబైల్స్ జోలికి వెళ్లకపోవడం మంచిది. దీనికి బదులుగా ఉదయం లేవగానే కాసేపు పుస్తకం చదవడం అలవాటు చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. ఉదయాన్నే చేసే వ్యాయామం రోజంతటికీ కావాల్సిన శక్తిని, ఉత్సాహాన్ని అందిస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఉదయం లేవగానే కొంతమంది అధిక బరువులెత్తడం, ఇతర కఠినమైన వ్యాయామాలు చేయడం.. వంటివి చేస్తుంటారు. ఇవి కండరాల ఆరోగ్యానికి అంత మంచివి కావు. ఎందుకంటే రాత్రి నిద్రపోయే సమయంలో శరీరంలో పెద్దగా కదలికలు లేకపోవడంతో ఉదయం లేచే సమయానికి కండరాలు, ఎముకలు బిగుసుకుపోతాయి. కాబట్టి వీటిని వెంటవెంటనే కదిలించడం, ఒకేసారి ఎక్కువ బరువులెత్తడం, కఠినమైన వ్యాయామాలు చేయడం కాకుండా.. నెమ్మదిగా కదిలించే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం వ్యాయామానికి ముందు కాసేపు వార్మప్ చేయడం, యోగా, ధ్యానం.. వంటివి చేయడం మంచిది. దీంతో కండరాలు రిలాక్సయ్యే అవకాశం ఉంటుంది. ఆపై అసలైన వ్యాయామ రొటీన్‌ని పాటించవచ్చని సూచిస్తున్నారు నిపుణులు.



చక్కని ఆరోగ్యం

నోటి దుర్వాసన నలుగుట్లో ఇబ్బంది పెడుతోందా..


కొబ్బరిపాల (కొబ్బరిని కోరి మెత్తగా రుబ్బి పిండితే వచ్చే రసం) లో తగినంత పచ్చ కర్పూరం వేసుకొని తాగాలి. ఈ కొబ్బరి పాలను పచ్చిగా అయినా తాగవచ్చు, వేడి చేసుకుని అయినా తాగవచ్చు. ఇలా తరచూ చేయడంవల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. అదేవిధంగా గజ నిమ్మకాయ (దబ్బ నిమ్మకాయ) ను ముందు నాలుగు ముక్కలుగా కోయాలి. ఆ తర్వాత దాన్ని చిన్న ముక్కలుగా తరుగుకుని, ఒక్కో ముక్కను దవడకు వేసుకుని చప్పరిస్తే నోరు శుభ్రపడుతుంది. తద్వారా నోటి



దుర్వాసన తగ్గుతుంది. జాజికాయ, జాపత్రీ, పచ్చ కర్పూరం కొద్దికొద్దిగా తీసుకొని దంచుకోవాలి. అనంతరం ఆ పొడిని ఎండుద్రాక్షలతో కలిపి నూరాలి. ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న గోళీల్లా చుట్టుకుని, ఒక్కో గోళిని దవడకు పెట్టుకొని చప్పరిస్తుండాలి. దాంతో క్రమంగా నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. తరచూ దాల్చిన చెక్క చిన్నముక్కను తీసుకుని దవడకు పెట్టుకుని నములుతుంటే కూడా నోరు శుభ్రంగా పడుతుంది. ఫలితంగా నోటి దుర్వాసన నుంచి ఉపశమనం కలుగుతుంది. తమలపాకులు కూడా నోటి దుర్వాసనను పోగొట్టడంలో తోడ్పడుతాయి. ఇవి నాలుకమీద జిగురును హరిస్తాయి. తమలపాకుపై పచ్చకర్పూరం వేసిన కిళ్లీ తింటే నోటిలో మంచి సువాసన వస్తుంది.

చేతి వేళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే..

చేతులు, వేళ్లలో రక్త ప్రసరణ సక్రమంగా ఉండడం ఎంతో అవసరం. ఇది వాటి బలం, వశ్యత, రోజువారీ పనితీరుకు ఎంతో అవసరం. రక్తం సరైన విధంగా ప్రసరిస్తే కండరాలు, కీళ్లు, కణజాలాలకు అవసరమైన ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. అయితే ఎక్కువసేపు ఒకే స్థితిలో ఉండటం, నిరంతరం ఒకే రకమైన పనులు చేయడం, చల్లని వాతావరణం వంటి కారణాల వల్ల రక్త ప్రసరణ తగ్గి చేతుల్లో బిగుతు, మొద్దుబారడం లేదా అసౌకర్యం కలుగుతుంది. అలాంటి సమస్యలను తగ్గించేందుకు కొన్ని సులభమైన చేతి, వేళ్ల వ్యాయామాలు ఉపయోగపడతాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచడమే కాకుండా చేతుల చురుకుదనాన్ని, సౌకర్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండా ఇంట్లోనూ, కార్యాలయంలోనూ, విరామ సమయంలోనూ వీటిని చేయవచ్చు. వేళ్లను చాపడం అత్యంత సులభమైన వ్యాయామాల్లో ఒకటి. చేతిని బల్లపై ఉంచి లేదా ముందుకు చాచి, వేళ్లను మెల్లగా వీలైనంత వరకు నిటారుగా చాపాలి. 10 నుంచి 15 సెకన్ల పాటు ఆ స్థితిలో ఉంచి మళ్లీ సడలించాలి. ఈ వ్యాయామం వేళ్లలో రక్త ప్రవాహాన్ని పెంచి బిగుతును తగ్గించడంలో సహాయపడుతుంది. కంప్యూటర్‌పై ఎక్కువసేపు టైపింగ్ చేసే వారు లేదా మొబైల్ ఎక్కువగా ఉపయోగించే వారికి ఇది ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. చేతిని పిడికిలిగా బిగించడం కూడా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. మొదట వేళ్లను నిటారుగా ఉంచి, తర్వాత నెమ్మదిగా లోపలికి మడిచి పిడికిలి చేయాలి. కొన్ని సెకన్ల తర్వాత చేతిని పూర్తిగా తెరవాలి. ఈ కదలికను పలుమార్లు చేయడం వల్ల వేళ్లలోని చిన్న రక్తనాళాల ద్వారా రక్త ప్రవాహం మెరుగుపడుతుంది. అలాగే కీళ్ల చలనం, చేతి బలం కూడా పెరుగుతాయి. వేళ్లతో ట్యాపింగ్ చేయడం ఎక్కడైనా సులభంగా చేయగలిగే వ్యాయామం. బొటనవేలిని ఒక్కో వేలు చివరికి తాకిస్తూ O ఆకారాన్ని రూపొందించాలి. ఈ కదలిక వేళ్ల కీళ్లను చురుకుగా ఉంచి రక్త ప్రసరణను ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా చేతి సమన్వయాన్ని మెరుగుపరిచి రోజువారీ పనులను సులభతరం చేస్తుంది. మణికట్టులను వృత్తాకారంలో తిప్పడం కూడా ప్రయోజనకరం. చేతులను ముందుకు చాచి మణికట్టులను ఒక దిశలో 10 సెకన్ల పాటు తిప్పి, తర్వాత వ్యతిరేక దిశలో తిప్పాలి. ఇది మణికట్టు చుట్టూ ఉన్న కండరాలను సడలించి చేతులకు రక్త ప్రసరణను పెంచుతుంది.



నువ్వులు దివ్యౌషధం..



పుష్కలంగా ఉంటాయి. అందువల్ల నువ్వులను క్రమం తప్పకుండా తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మధుమేహాన్ని అదుపులో ఉంచడంలో.. చెడు కొలెస్టరాల్‌ను కరిగించి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో.. ఎముకలను పటిష్టం చేయడంలో.. జీర్ణవ్యవస్థ, మెదడు పనితీరును మెరుగుపర్చడంలో.. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో నువ్వులు కీలకపాత్ర పోషిస్తాయి. ఈ ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..నువ్వులలో పీచు పుష్కలంగా ఉంటుంది. కాబట్టి నువ్వులను తీసుకోవడంవల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు నువ్వులు చాలా మంచిది. నువ్వులు తింటే గుండె ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిలోని 'ఒలియిక్ యాసిడ్', 'లినోలిక్ యాసిడ్' వంటివి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. నువ్వులు ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. నువ్వులలో ఉండే అధిక కాల్షియం ఎముకల బలోపేతానికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులతో పోరాడేందుకు నువ్వులను తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. నువ్వులు మన జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా చాలా మేలు చేస్తాయి. నువ్వులలోని అధిక పీచు అరుగుదలకు తోడ్పడుతుంది. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యల నుంచి బయటపడటానికి నువ్వులు దివ్యౌషధంగా పని చేస్తాయి.

నువ్వులు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నువ్వులలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్‌లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియంతోపాటు ఇతర యాంటీ ఆక్సిడెంట్లు

స్మార్ట్‌గా పరిగెత్తండి

ఉదయం నిద్రలేవగానే మనల్ని పలకరించే తొలి నేస్తం స్మార్ట్ ఫోన్. వాట్సాప్, ఫేస్‌బుక్ , ఇన్‌స్టాగ్రామ్ చూడటానికి మాత్రమే కాకుండా ఈ స్మార్ట్‌ఫోన్.. మన ఆరోగ్యాన్ని శాసించే ఒక అద్భుతమైన పరికరమని చాలామందికి తెలియదు. మన శరీరాన్ని మెరుగుపరుచుకోవడం కోసం మనం జిమ్‌కోచ్ కోసమో, డైటీషియన్ అపాయింట్ కోసమో చూడాల్సిన పనిలేదు. మన జేబులో ఉండే స్మార్ట్ ఫోనే మనల్నీ పరిగెత్తిస్తుంది. మనం ఏం తినాలో చెబుతుంది.. చివరికి మనం ఎంతసేపు నిద్రపోవాలో కూడా డిసైడ్ చేస్తుందని ఇటీవల ఓ అధ్యయనం సైతం పేరొంది. యాక్టివిటీ ట్రాకింగ్: మన ఫోన్‌లో ఉండే యాక్సిలరోమీటర్ అనే సెన్సర్ సాయంతో మనం నడవడం, మెట్లు ఎకడం, పరిగెత్తడం వంటి పనులను గుర్తించి ఆ డేటాను మనకు అర్థమయ్యే విధంగా మారుస్తుంది. అలాగే మనం ఎంత దూరం ప్రయాణించాం? ఏ మార్గంలో వెళ్లామో ఇది మ్యాప్ రూపంలో చూపుతుంది. ఇందులో అడుగుల లెకింపు, క్యాలరీల ఖర్చు, దూరం, యాక్టివ్ టైమ్ లాంటివన్నీ గమనించవచ్చు. పర్సనల్ వరౌట్ కోసం: ఇది మన శరీర తత్వం, బరువు, ఎత్తు, మన ఆరోగ్య లక్ష్యాలను బట్టి మనకు సరిపోయే వ్యాయామాలను రూపొందించే ఒక డిజిటల్ సిస్టమ్. ఇది మన సామర్థ్యాలను బట్టి వ్యాయామాలను సూచిస్తూ మనల్ని గైడ్ చేస్తుంది. డైట్ ట్రాకింగ్: మనం ప్రతిరోజూ తీసుకునే అల్పాహారం, లంచ్, స్నాక్స్, డిన్నర్‌లో ఉండే క్యాలరీలను, పోషకాలను లెకగట్టడమే ఈ డైట్ ట్రాకింగ్. మన లక్ష్యం ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండటమైనా మనం తీసుకునే ఆహారంపై అవగాహన ముఖ్యం. ఇది క్యాలరీల లెకింపు, మాక్రో న్యూట్రియెంట్స్‌ని విశ్లేషణ చేస్తుంది. దీనివల్ల మనం మైండ్‌ఫుల్ ఈటింగ్ అలవాటు చేసుకుంటాం. స్లీప్ అనాలసిస్: ఆరోగ్యకరమైన జీవితానికి సరైన ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నాణ్యమైన నిద్రకూడా అంతే ముఖ్యం. మనం రాత్రి పడుకున్నప్పటి నుంచి ఉదయం నిద్ర లేచే వరకు మన శరీరం ఏ స్థితిలో ఉంది, మధ్యలో ఎన్నిసార్లు మెలకువ వచ్చింది, ఎంతసేపు గాఢనిద్రలో ఉన్నాం.. తదితర వివరాల నిటినీ అనాలిస్ చేసి డేటాను అందిస్తుంది. సాధారణంగా మనం చేసే ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే మనం ఎంత వరకు సాధించామో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఈ ఫిట్‌నెస్ ప్రయాణంలో కూడా అంతే.

ఆనె పరిగెతో లాభాలెన్నో!

ఈ అడవి పండుకు ఇంగ్లీష్ పేరు: వైల్డ్ జుజుబె. తెలుగు పేర్లు: గొట్టె తీగ, పిండి పరిఘము, ఆనె పరిగె, తెల్ల పరిగె. అస్సామీస్: బిధావో భోగారి, బోన్ బాగరి, బోన్ బొగోరి, డిండవో బోగన్. ఒరియా: తినకోలి. కన్నడ: కట్టిలండల్, బేలహడు, బిళీ ముళ్ళి హను, కనిక, కొట్ట ముల్లుహణ్ణు. గుజరాతీ: తోరన్. తమిళం: కట్టిలండల్, తోతరి, తోటన. మలయాళం: జాలి, కొట్టముళ్ళు, తొడలి, తుటరి, మలంతుటలీ. మరాఠీ: తురన్, తోరణ. హిందీ: చూర్ణ, సూరన్. సంస్కృతం: ఘంటా అని పిలుస్తారు. ప్రాంతాలను బట్టి ఉచ్చారణలో కొంత తేడా ఉంటుంది. ఇది జిట్ట రేగు కుటుంబానికి చెందినది. దీనికి కూడా ముండ్లు కురచగా జంటగా కానీ ఒంటరిగా కానీ ఉంటాయి. తెల్ల పరిగె దాదాపు 5–7 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతుంది. మానుకు దగ్గరలో వేరే చెట్టు ఉంటే దాని సహాయంతో తీగలా కూడా పెరుగుతుంది. రేగు చెట్టులా ఇది కూడా ఆకులు రాల్చుతుంది. పండ్లు తెల్లగా ఉండి, అడుగు భాగాన కొద్ది నాటి కాషాయం రంగు ఉంటుంది. పండ్లు తెల్లగా ఉన్నందున దీనికి చెంచులు 'తెల్ల పరిగె' లేక ఆనె పరిగె అని పిలుస్తారు. థాయిలాండ్‌లో దీని ఉనికి ఎక్కువగా ఉంది. ఇండియా, చైనా, మయన్మార్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, బాంగ్లాదేశ్ తదితర దేశాల్లోని ఉష్ణ మండల అడవుల్లో పెరుగుతుంటాయి. భారతదేశంలో మాత్రం ఉత్తర ప్రదేశ్, బీహార్, వెస్ట్ బెంగాల్, అస్సాం, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్–నికోబార్ దీవుల్లో ఈ చెట్లు ఉన్నాయి. తెలంగాణలోని నల్లమల అడవులలో అక్కడక్కడా ఉన్నాయి. ముఖ్యంగా మల్లాపూర్, కుడిచింత బయలు మొదలగు ప్రాంతాలలో గమనించవచ్చు. అక్కడి చెంచుల అభిప్రాయం మేరకు ఈ చెట్లు చాలా వరకు కనుమరుగవుతున్నాయి. వీటిని అభివృద్ధి పరిచే అవసరం ఎంతైనా ఉంది.పండ్లు తెలుపు రంగులో ఆకర్షణీయంగా ఉంటాయి. పండులో గుజ్జు కొంత వరకు పిండిగా ఉండి రుచికరంగా ఉండటం వలన చెంచులు ఈ పండ్లను బాగా ఇష్ట పడుతారు. జీవాలు వీటి ఆకులను బాగా ఇష్టపడతాయి. పంటపొలం చుట్టూ తెల్లపరిగె కొమ్మలను కంచెగా వేసుకొని పశువులు ఇతర జంతువుల నుండి పంటను కాపాడుకోవచ్చు. రాలిన పండ్లను ఉడుతలు, కుందేళ్లు ఇతర జంతువులు ఇష్టంగా తింటాయని చెంచులు అన్నారు. చెంచులు, ఇతరులు అనేక రోగాలను నయం చేయటానికి వాడుతారు. ముఖ్యంగా విరేచనాలు, అల్సర్లు, చర్మ వ్యాధులు, దగ్గు, రక్తపోటు మొదలైన వాటికి వాడతారు. ఈ పండులో ఉన్న ఔషధ, పోషక గుణాలు ఉన్నందు వల్ల పోషక లోపాలను కొంతవరకు అరికట్టవచ్చు. ఆ పండ్లలో కూడా ఇతర పంటల్లో మాదిరిగానే చక్కెర, కొవ్వు, పీచు మొదలైన పదార్థాలు ఉంటాయి. పోషకాల విశ్లేషణ ఈ పట్టికలో పొందుపరిచాం... పండ్లు: మార్చ్ – ఏప్రిల్ నెలలోకాస్తాయి. 5–7 మీటర్ల ఎత్తు పెరుగుతుంది.



చంకల్లో నలుపు.. తగ్గాలంటే..!

వ్యక్తిగత శుభ్రత పాటించినా సరే.. కొంతమందికి చంకల్లో నలుపుదనం ఏర్పడుతుంటుంది. అయితే ఆ నలుపుని తరిమికొట్టడానికి ప్రస్తుతం కొన్ని రకాల క్రీములు, చికిత్సలు అందుబాటులో ఉన్నా.. కొన్ని సహజ చిట్కాలు సైతం పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఒక గిన్నెలో రెండు చెంచాల బ్రౌన్ షుగర్ లేదా చక్కెర వేసి అందులో ఒక నిమ్మచెక్కను పిండి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని అండర్ ఆర్మ్‌కు అప్లై చేసి పది నిమిషాల పాటు ఆరనివ్వాలి. అలా పూర్తిగా ఆరాక రెండు నిమిషాల పాటు నెమ్మదిగా రుద్ది ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరి. చక్కెర



స్క్రబ్‌లా పనిచేసి నలుపును తగ్గిస్తుందంటున్నారు నిపుణులు. కీరా ముక్కలను సన్నగా కట్ చేసి చంకల కింద నల్లగా ఉన్న ప్రాంతంలో ఐదు నిమిషాల పాటు రుద్దాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. రోజూ స్నానానికి వెళ్లేముందు కీరా ముక్కలతో ఆ ప్రాంతంలో క్రమం తప్పకుండా రుద్దుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. గుప్పెడు వేపాకులు తీసుకుని వాటిని మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు అందులో ఒక చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లగా ఉన్న ప్రాంతంలో రాసి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. వేప, పసుపు.. ఈ రెండింటిలో ఉండే యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల చంకల్లో ఏర్పడిన బ్యాక్టీరియా తగ్గడమే కాకుండా నలుపుదనం కూడా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

సెన్సెక్స్ ▼ 81,592.45	గోల్డ్ 1,37,692 (10 గ్రాములు)	యూస్ డాలర్ $ 94.2300	ఎస్ బి ఐ రూ. 1,992.90
నిఫ్టీ ▼ 25,144.30	సిల్వర్ 1,81,040 (1 కిలో)	బ్రిటన్ పౌండ్ £ 124.7370	NTPC రూ. 3,937.70
	చమురు 8,413 (రూ. బ్యారెల్)	యూరో € 104.1840	Bharti Airtel రూ. 2,106.00
		జపాన్ యెన్ ¥ 0.5893	Grasim రూ. 3,034.00
			Hindalco రూ. 943.60
			Tata Motors Passenger Vehicles రూ. 287.40

బిజినెస్



ప్రపంచంలోనే అతిపెద్ద ఒప్పందానికి నియంత్రణ

◆ టెక్సాస్‌లో టెరాఫ్యాబ్ చిప్ తయారీ కేంద్రాన్ని రెండు సంస్థలు నిర్మిస్తున్నాయి.

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, టెస్లా విలీనాన్ని డిసెంబరులో ప్రకటించే అవకాశముంది. రెండు సంస్థలు విలీన చర్చలను కొనసాగిస్తున్నాయని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ప్రతిపాదిత ఒప్పందం ప్రపంచంలోనే అతిపెద్ద కార్పొరేట్ లావాదేవీ కావచ్చు. చర్చలు సాగకపోతే ప్రకటన 2027 ప్రారంభానికి వాయిదా పడవచ్చని సమాచారం. రెండు సంస్థల బోర్డులు, సలహాదారులు విలీన సంస్థ పాలనా నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు. విలీనం మస్క్ విద్యుత్ వాహన, ఇంధన నిల్వ వ్యాపారాలను ఏకం చేస్తుంది. రాకెట్లు, ఉపగ్రహాలు, కృత్రిమ మేధస్సు రంగాలూ ఒకే సంస్థ పరిధిలోకి వస్తాయి. అంతరిక్ష కార్యకలాపాలు, స్వయంచాలక వాహనాలు, మానవరూప రోబోట్లు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. అమెరికా, చైనాల్లోని భిన్న వ్యాపార ప్రయోజనాలు నియంత్రణ అడ్డంకులు సృష్టించవచ్చు. చైనాలో టెస్లా కార్యకలాపాలను ఎలా వేరు చేయాలన్నది కీలక చర్చగా మారింది. స్పేస్‌ఎక్స్‌కు అమెరికా ప్రభుత్వం, రక్షణ వ్యవస్థతో సున్నితమైన ఒప్పందాలున్నాయి. చైనాలో టెస్లాకు భారీ, లాభదాయక తయారీ కార్యకలాపాలున్నాయి. ఈ విభేదాలు నియంత్రణ, వాటాదారుల అనుమతులను క్లిష్టం చేయవచ్చు. అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత విలీనానికి రాజకీయ పరిశీలన కూడా ఎదురుకావచ్చు.

పేటీఎంకు వాలెట్ లైసెన్సుపై ఆర్‌బీఐ ఆమోదం

రికార్డు ధర

పేటిఎం పేమెంట్స్ సర్వీసెస్‌కు ఆర్‌బిఐ ప్రాథమిక అనుమతి లభించింది. డిజిటల్ వాలెట్లతోపాటు ప్రీపెయిడ్ చెల్లింపు ఉత్పత్తులు జారీ చేయవచ్చు. ఈ పరిణామంతో పేటీఎం షేరు ధర రికార్డు స్థాయికి చేరింది. పేటీఎం దాఖలు చేసిన పత్రంలో ఈ వివరాలు వెల్లడించింది. తుది ఆర్‌బీఐ అనుమతి వచ్చిన తర్వాతే సేవలు అందుబాటులోకి వస్తాయి. తుది



అనుమతి లేకుండా వినియోగదారులకు వాలెట్ సేవలు అందవు. పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ తన వినియోగదారులకు వాలెట్లు అందించనుంది. ప్రీపెయిడ్ చెల్లింపు సాధనాల్లో వాలెట్లు కూడా ఉంటాయని కంపెనీ తెలిపింది. ప్రాథమిక అనుమతి సేవల తక్షణ ప్రారంభాన్ని నిర్ధారించదు. ఆర్‌బీఐ చర్యలతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ సాధారణ వాలెట్ కార్యకలాపాలు ఆగిపోయాయి. రెండేళ్లకు పైగా కొనసాగిన విరామం తర్వాత తాజా అనుమతి వచ్చింది. కొత్త డిపాజిట్లు, వాలెట్ టాప్‌అప్‌లను స్వీకరించడాన్ని ఆర్‌బీఐ నిలిపింది. నిరంతర నియమావళి ఉల్లంఘనలు, పర్యవేక్షణ సంబంధిత ఆందోళనలు కారణాలుగా నిలిచాయి. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. ఈ చర్యలు సాధారణ వాలెట్ కార్యకలాపాలను వాస్తవంగా నిలిపివేశాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఆర్‌బీఐ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ బ్యాంకింగ్ లైసెన్సును రద్దు చేసింది. తాజా అనుమతి పేటీఎం పూర్తిస్థాయి అనుబంధ సంస్థను వాలెట్ సేవల పునఃప్రారంభ దిశగా నడిపించనుంది. పేటీఎం షేరు ధర రికార్డు స్థాయిలో 1,960 రూపాయలకు చేరింది. తుది అనుమతి తర్వాతే పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ సేవలు అందించగలదు. పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ పేటీఎంకు పూర్తిగా స్వంతమైన సంస్థ. వాలెట్ సేవలకు తుది ఆర్‌బీఐ అనుమతి తప్పనిసరి.

వాణిజ్య ఉద్రిక్తత తగ్గించే ప్రయత్నంలో చైనా..



బీజింగ్‌లో చైనా అమెరికా దిగుమతులపై అదనపు సుంకాన్ని వాయిదా వేసింది. 24 శాతం అదనపు టారిఫ్‌ను రెండు నెలలు నిలిపివేసింది. ఈ నిర్ణయం 10 నవంబర్ 2026 నుంచి అమల్లోకి వస్తుంది. అప్పటివరకు అమెరికా వస్తువులపై 10 శాతం సుంకం కొనసాగుతుంది. చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయాన్ని ప్రకటించింది. అమెరికా నుంచి వచ్చే వస్తువులపై అదనపు సుంకాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. వాషింగ్టన్‌లో అగ్రనేతల సమావేశం తర్వాత కుదిరిన అంగీకారం మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల వాణిజ్య ఉద్రిక్తత తగ్గించడం లక్ష్యంగా మార్పు చేపట్టారు. చైనా స్టేట్ కౌన్సిల్ సుంక చర్యల్లో మార్పుకు ఆమోదం తెలిపింది. కస్టమ్స్ టారిఫ్ కమిషన్ గత నిర్ణయాల ఆధారంగా మార్పు జరిగింది. అదనపు సుంకాల నిలిపివేత వాణిజ్య చర్చలకు కొంత ఉపశమనంగా కనిపిస్తోంది. చైనా, అమెరికా వాణిజ్య సంబంధాలు ఇటీవల ఉద్రిక్తంగా ఉన్నాయి. టారిఫ్‌లు, ఇతర ఆర్థిక ఆంక్షలపై ఇరుదేశాల మధ్య విభేదాలు కొనసాగాయి. తాజా నిర్ణయం వ్యాపారులు, దిగుమతిదారులు, ఎగుమతిదారులపై ప్రభావం చూపవచ్చు. సెప్టెంబరులో షీ జిన్‌పింగ్, డొనాల్డ్ ట్రంప్ చర్చలు జరిపారు. మూడు రోజుల పర్యటనలో వాణిజ్య అంశాలపై అంగీకారం కుదిరింది. వైట్‌హౌస్ ఫ్యాక్ట్‌షీట్ ప్రకారం, సుమారు 30 బిలియన్ డాలర్ల వస్తువులకు అనుకూల టారిఫ్ విధానంపై ఒప్పందమైంది. ఇరుదేశాలు యూఎస్‌చైనా బోర్డ్ ఆఫ్ ట్రేడ్‌ను క్రియాశీలం చేశాయి. యూఎస్‌చైనా బోర్డ్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ కూడా పనిచేయడం ప్రారంభించింది. రెండు సంస్థలు మే 2026లో బీజింగ్ శిఖరాగ్ర సమావేశంలో ఏర్పడ్డాయి. వ్యవసాయ మార్కెట్ అడ్డంకులపై చర్చించేందుకు కార్యసమూహం ఏర్పాటైంది. వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్య సమస్యలను ఈ బృందం పరిశీలిస్తుంది. అదనంగా, సుమారు 30 బిలియన్ డాలర్ల విలువైన సున్నితత్వం లేని వస్తువులకు ప్రత్యేక రాయితీలపై అంగీకారం కుదిరింది.

100 శాతం పెరిగినా అమెరికా మార్కెట్‌కు ట్యాంకర్ చేరలేదు



ట్రంప్ ఆంక్షలు సడలించినా అమెరికాకు రష్యా అదనపు డీజిల్ చేరలేదు. అక్టోబరులో రష్యా ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయి. ప్రపంచ మార్కెట్లకు ఇంధన సరఫరా పెంచేందుకు ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ ఒప్పందం ప్రకటించారు. కెప్లర్ ప్రకారం అక్టోబరులో రోజుకు సుమారు 271,000 బ్యారెళ్ల డీజిల్ రష్యా ఎగుమతి చేసింది. సెప్టెంబరులో ఈ పరిమాణం 135,000 బ్యారెళ్లుగా ఉంది. అమెరికా బదులు బ్రెజిల్, టర్కీ మార్కెట్లకు అదనపు ఇంధనం వెళ్లింది. అమెరికాకు బయలుదేరిన కనీసం రెండు ట్యాంకర్లు ఇటీవలి వారాల్లో దారి మార్చుకున్నాయి. రష్యా డీజిల్ తీసుకెళ్తున్న అజియోయి ఫనెండెస్ నౌక అమెరికా తూర్పు తీరంలో కొనుగోలుదారుని ఎదురుచూస్తోంది. నౌక యజమానితో చర్చలు కొనసాగుతున్నాయని వైట్‌హౌస్ తెలిపింది. ట్రంప్ -పుతిన్ ఒప్పందం అక్టోబర్ 9న ప్రకటితమైంది. నవంబరులో 500,000 టన్నులు, ఆపై మరో పది లక్షల టన్నులు సరఫరా చేస్తామని ట్రంప్ చెప్పారు. అమెరికా ఖజానా శాఖ అక్టోబర్ 9న జనరల్ లైసెన్స్ నంబర్ 135 జారీ చేసింది.

అదానీ జలవిద్యుత్ ప్రాజెక్టు వ్యయాన్ని తగ్గించాలని కోరడంపై దర్యాప్తు డిమాండ్



కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ నవంబర్ 13, 2026న అదానీపై విమర్శలు చేశారు. మహారాష్ట్ర సాతారా జిల్లాలోని జలవిద్యుత్ ప్రాజెక్టు వ్యయాన్ని 99 శాతం తగ్గించాలని అదానీ గ్రీన్ ఎనర్జీ కోరిందని వార్తా కథనం తెలిపింది. కాంగ్రెస్ దీనిని భారీ కుంభకోణంగా అభివర్ణించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 1,500 మెగావాట్ల ప్రాజెక్టు వ్యయాన్ని ₹5,675 కోట్ల నుంచి ₹56.75 కోట్లకు తగ్గించాలని కోరిందని కథనం పేర్కొంది. ఈ సంస్థ అదానీ గ్రూప్‌కు చెందిన పునరుత్పాదక ఇంధన సంస్థ. సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ మళ్లీ డిమాండ్ చేసింది. వ్యయ తగ్గింపుతో వన్యప్రాణి అభయారణ్య పరిరక్షణకు అదానీ చెల్లించాల్సిన మొత్తం కూడా తగ్గుతుందని నివేదిక తెలిపింది. ఆ మొత్తం ₹227 కోట్ల నుంచి ₹2.27 కోట్లకు పడిపోతుందని పేర్కొంది. అక్టోబర్ 30న ఫిర్యాదు నమోదైంది. ప్రాజెక్టు వ్యయం తప్పుగా చూపారన్న ఆరోపణపై ఫిర్యాదు వచ్చింది. ప్రధాని ఫిర్యాదు పోర్టల్, మహారాష్ట్ర ఆప్లే సర్కార్ పోర్టల్‌లలో ఫిర్యాదు చేశారు. పర్యావరణ మంత్రిత్వశాఖ నవంబర్ 6న రాష్ట్ర అటవీశాఖను ప్రాధాన్యంగా దర్యాప్తు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర అటవీశాఖ కూడా ఈ వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించింది. ఆరోపణలపై అదానీ గ్రూప్, మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం నుంచి తక్షణ స్పందన రాలేదు. కాంగ్రెస్ నేత శక్తిసింహ్ గోహిల్ మరో పథకంపైనా ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ జైరాం రమేశ్ ఎక్స్ పోస్టులో ఆరోపణలు చేశారు. మార్చి 2023 నుంచి జేపీసీ దర్యాప్తును కాంగ్రెస్ కోరుతోందన్నారు.

క్రీడలు

మీరట్ రేస్‌వాకర్ ప్రియాంక గోస్వామికి అర్జున అవార్డు దక్కనుంది



అంతర్జాతీయ రేస్‌వాకర్ ప్రియాంక గోస్వామికి రాష్ట్రపతి భవన్‌లో అర్జున అవార్డు ప్రదానం చేయనున్నారు. 2022 కామన్వెల్త్ క్రీడల్లో ప్రియాంక 10 వేల మీటర్ల నడకలో రజత పతకం గెలిచారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు సహా పలు పోటీల్లో ఆమె భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. అవార్డు కార్యక్రమం కోసం ప్రియాంక తండ్రి మదన్ గోస్వామి, తల్లి అనితా గోస్వామితో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. ప్రారంభ దశ కోచ్ గౌరవ్ త్యాగీని కూడా ఆమె కార్యక్రమానికి ఆహ్వానించారు.

పోచెట్టినోను ప్రధాన కోచ్‌గా ఖరారు

నవంబర్ 22న అన్‌ఫీల్డ్‌లో తొలి మ్యాచ్

మాంచెస్టర్ యునైటెడ్ కొత్త ప్రధాన కోచ్‌గా మౌరిసియో పోచెట్టినోను ఖరారు చేసింది. నవంబర్ 22న లివర్‌పూల్‌తో అన్‌ఫీల్డ్‌లో జరిగే మ్యాచ్‌తో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. పోచెట్టినో యునైటెడ్ స్టేట్స్ పురుషుల జాతీయ జట్టు కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. గురువారం ఒప్పందం ఖరారైన తర్వాత ఆయన ఓల్డ్ ట్రాఫోర్డ్‌కు చేరనున్నారు. 54 ఏళ్ల పోచెట్టినో యునైటెడ్‌తో



రెండున్నరేళ్ల ఒప్పందం కుదుర్చుకున్నారు. మైఖేల్ కారిక్‌ను గురువారం పదవి నుంచి తొలగించారు. రెండేళ్ల ఒప్పందంలో కేవలం 15 మ్యాచ్‌లకే కారిక్ ప్రయాణం ముగిసింది. యునైటెడ్ సీఈఓ ఒమర్ బెరాడా బుధవారం యూఎస్ సాకర్‌కు సమాచారం ఇచ్చారు. పోచెట్టినో ఒప్పందంలోని విడుదల నిబంధనను అమలు చేసేందుకు క్లబ్ సిద్ధమని ఆయన తెలిపారు. ఆ నిబంధన ఉనికిని పోచెట్టినో ప్రతినిధులే ముందుగా యునైటెడ్‌కు తెలియజేశారని వర్గాలు పేర్కొన్నాయి. కారిక్ వారసుడి ఎంపికలో పోచెట్టినోతోనే నేరుగా మాట్లాడారు. క్లబ్ నాయకత్వ బృందం ఆయనను ఏకగ్రీవంగా సిఫారసు చేసింది. మైనారిటీ వాటాదారు సర్ జిమ్ ర్యాట్‌క్లిఫ్, మెజారిటీ యజమానులైన గ్లేజర్ కుటుంబం ఎంపికను ఆమోదించారు. బెరాడా, ఫుట్‌బాల్ డైరెక్టర్ జేసన్ విల్కాక్స్ పోచెట్టినోను 2024 మేలో ఇంటర్వ్యూ చేశారు. ఆ సమయంలో ఆయన చెల్సియా నుంచి వైదొలిగిన కొద్దికాలమే అయ్యింది. యునైటెడ్ చివరకు ఎరిక్ టెన్ హాగ్‌తో కొనసాగాలని నిర్ణయించింది. పోచెట్టినో సెప్టెంబరు 2024లో యునైటెడ్ స్టేట్స్ జాతీయ జట్టు బాధ్యతలు స్వీకరించారు. సౌతాంప్టన్, టోటెన్‌హామ్, చెల్సియా, పారిస్ సెయింట్ జర్మైన్ క్లబ్‌లలో ఆయన పనిచేశారు. పారిస్‌లో లియోనెల్ మెస్సీ, కిలియన్ ఎంబాప్పే, నేయ్‌మార్ ఉన్న జట్టుకు ఆయన కోచ్‌గా ఉన్నారు. యునైటెడ్ ఈ సీజన్‌లో ఒక్క లీగ్ విజయంతో పట్టికలో 18వ స్థానంలో ఉంది. పోచెట్టినో అంతర్జాతీయ విరామంలో హైతీతో శనివారం, మంగళవారం జరిగే రెండు మ్యాచ్‌లకు బాధ్యత వహిస్తారు. అనంతరం బుధవారం క్యారింగ్టన్‌లో పని ప్రారంభించి, నాలుగు రోజుల తర్వాత లివర్‌పూల్‌కు వెళ్తారు. పోచెట్టినో మే 2024లో యునైటెడ్‌తో ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

గంభీర్ అసలు ఆందోళన

గౌతమ్ గంభీర్ జట్టు 90 పరుగులకే కుప్పకూలడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచకప్ పరిస్థితులు న్యూజిలాండ్ పరిస్థితులకు దగ్గరగా ఉంటాయని గంభీర్ చెప్పారు. బడీలో పరుగుల కొరత కాదు, 2627 ఓవర్లలోనే ఆలౌటవడమే అసలు ఆందోళన అని వివరించారు. న్యూజిలాండ్ ముందుగా 50 ఓవర్లలో 333 పరుగులు చేసింది. మాట్ హెన్రీ ఆరు వికెట్ల ధాటికి భారత్ 26.4 ఓవర్లలోనే ఆలౌటైంది. గత మ్యాచ్‌లోనూ భారత్ వర్షం ప్రభావిత పోరులో ఇబ్బంది పడింది. 135 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ భారత్ 111



పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. వరుస వైఫల్యాల నేపథ్యంలో స్వింగ్ బంతులను ఎదుర్కొనే సాంకేతిక, మానసిక సిద్ధతపై గంభీర్ దృష్టి పెట్టారు. న్యూజిలాండ్‌లో తొలి 10 ఓవర్లు బ్యాటింగ్‌కు అత్యంత కఠినమని తెలిపారు. భారత్‌లో ఇన్నింగ్స్ ఆరంభం సాధారణంగా సులభంగా ఉంటుందని గంభీర్ చెప్పారు. తొలి 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 40 పరుగులు చేస్తే మంచి ఆరంభమేనన్నారు. మాట్ హెన్రీ, కైల్ జేమిసన్ బంతుల లెంగ్త్‌పై భారత బ్యాటర్లు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని గంభీర్ సూచించారు.

ఒలింపిక్ ఉద్యమ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది

డిసెంబర్ 5న ఐఓఏ ఎన్నికలు

ఢిల్లీ నుంచి ఐఓసి కిలక హెచ్చరిక జారీ చేసింది. ఐఓఏ ఎన్నికల వివాదం భారత ఒలింపిక్ ఉద్యమ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియను న్యాయంగా నిర్వహించాలని కోరింది. బాహ్య జోక్యానికి తావులేకుండా ఎన్నికలు జరగాలని స్పష్టం చేసింది. నవంబర్ 13, 2026న ఐఓసీ ఈ ప్రకటన విడుదల చేసింది. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉషా ఫిర్యాదు



చేసిన తర్వాత స్పందన వచ్చింది. సోమ్స్ ప్యానెల్‌కు ఎన్నిక కాకపోవడం వెనుక అవకతవకలు ఉన్నాయని ఉషా ఆరోపించారు. బాహ్య శక్తుల ఒత్తిడితో అభ్యర్థులు వ్యవహరించారని ఆమె పేర్కొన్నారు. ఐస్ హాకీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉషాను మళ్లీ నామినేట్ చేసింది. డిసెంబర్ 5న జరిగే సాధారణ మండలి సమావేశంలో ఐఓఏ ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో ఉషా రెండోసారి అధ్యక్ష పదవికి పోటీలో కొనసాగుతున్నారు. గత కొన్నేళ్లుగా బలమైన పరిపాలనా వ్యవస్థ కోసం ప్రయత్నాలు జరిగాయని ఐఓసీ తెలిపింది. ఒలింపిక్ చార్టర్‌కు అనుగుణంగా ఆ వ్యవస్థను నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొంది. అయినా ఐఓఏ ఎన్నికల నిర్వహణపై సమస్యలు మళ్లీ తలెత్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్నికల నిబంధనల అమలుపైనా వివాదాలు పునరావృతమయ్యాయని ఐఓసీ చెప్పింది. ఈ పరిస్థితి భారత ఒలింపిక్ ఉద్యమ కార్యకలాపాలు, ప్రతిష్ఠపై ప్రతికూల ప్రభావం చూపుతోందని వెల్లడించింది. ఐఓసీ ఈ వ్యాఖ్యలను పలు భారతీయ మీడియా సంస్థలకు పంపిన సమాచారంలో పేర్కొంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం భారత్ మరో ఆరు దేశాలతో పోటీలో ఉంది. ఐఓఏలోని అధికార పోరు దేశ పరిపాలనా వ్యవస్థపై అనుకూలమైన చిత్రాన్ని చూపడం లేదని కథనం పేర్కొంది. ఈ నేపథ్యం ఆతిథ్య పోటీపై అదనపు దృష్టిని తెచ్చింది. ఐఓఏ, ఎన్నికల నిర్వహణకు బాధ్యుడైన ఎన్నికల అధికారిని ఐఓసీ కోరింది. ఒలింపిక్ చార్టర్, ఐఓఏ రాజ్యాంగం, వర్తించే నిబంధనలు పాటించాలని సూచించింది. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, బాహ్య జోక్యం లేకుండా జరపాలని ఆదేశించింది. ఒలింపిక్ ఉద్యమంలో సుపరిపాలనా సూత్రాలు అమలు కావాలి.

మ్యాట్ హెన్రీ మారక బౌలింగ్‌తో భారత్ కుప్పకూలింది

న్యూజిలాండ్‌తో జరిగిన 4వ వన్డేలో భారత్ 244 పరుగుల తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. మౌంట్ మౌంగనుయిలోని బే ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 334 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు 26.4 ఓవర్లలోనే 89 పరుగులకు ఆలౌటైంది. దీంతో న్యూజిలాండ్ భారీ విజయాన్ని నమోదు చేసింది. భారత బ్యాటింగ్ పతనానికి న్యూజిలాండ్ వేగబౌలర్ మ్యాట్ హెన్రీ బౌలింగ్ ప్రధాన కారణమైంది. ఇన్నింగ్స్ తొలి బంతికే రోహిత్ శర్మను హెన్రీ ఔట్ చేయగా, ఆ బంతి రోహిత్ బ్యాట్‌ను తాకి స్లిప్‌లో ఉన్న ఫిన్ అలెన్ చేతికి వెళ్లింది. దీంతో రోహిత్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత హెన్రీ లోపలికి దూసుకొచ్చిన బంతికి విరాట్ కోహ్లీ బౌల్డ్ అయ్యాడు. నాలుగు బంతులు ఎదుర్కొన్న కోహ్లీ పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా తొలి బంతికే ఎల్‌బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఫలితంగా భారత ప్రధాన బ్యాటర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ ముగ్గురూ తొలి ఓవర్లోనే డకౌట్ అయ్యారు. ప్రారంభంలోనే కీలక వికెట్లు కోల్పోవడంతో భారత మధ్యక్రమంపై ఒత్తిడి పెరిగింది. ఇషాన్ కిషన్ 27 పరుగులు చేయగా, అక్సర్ పటేల్, నమన్ ధీర్ చెరో 21 పరుగులతో కొంతసేపు న్యూజిలాండ్ బౌలర్లను ఎదుర్కొన్నారు. అయితే భారత్‌ను పరాజయం నుంచి కాపాడేందుకు ఆ ప్రయత్నం సరిపోలేదు. భారత్ 16 సంవత్సరాల తర్వాత మరోసారి ఇలాంటి దెబ్బను ఎదుర్కొంది. చివరికి 26.4 ఓవర్లలో 89 పరుగులకే అన్ని వికెట్లను కోల్పోయి 244 పరుగుల తేడాతో ఓడిపోయింది.

న్యూజిలాండ్ విజయంలో మ్యాట్ హెన్రీ కీలక పాత్ర పోషించాడు. అతను 9.4 ఓవర్లు బౌలింగ్ చేసి, 2 మెయిడిన్లతో కేవలం 27 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనకు హెన్రీకి మ్యాచ్‌శ్రేష్ఠ పురస్కారం లభించింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఒకే మ్యాచ్‌లో డకౌటయ్యారు.

- రోహిత్, కోహ్లీ, అయ్యర్ తొలి ఓవర్లోనే డకౌట్
- హెన్రీ 27 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు
- హెన్రీ ఆరు వికెట్లతో చెలరేగాడు
- భారత తొలి ముగ్గురు బ్యాటర్లు డకౌట్



'దాదా' షూటింగ్ దాదాపు పూర్తి



వుదయం సినిమా: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాల కృష్ణ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా' షూటింగ్ దాదాపు పూర్తయింది. బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. గతంలో 'వీరసింహారెడ్డి'తో మంచి విజయాన్ని అందుకున్న బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'దాదా'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, పోస్టర్లు ఆ అంచనాలను మరింత పెంచాయి. ఇప్పుడు బాల కృష్ణ 'దాదా ధమాకా'తో మ్యూజికల్ హీట్ పెంచారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పబ్ బ్యాక్ డ్రాప్‌లో బాలకృష్ణ, బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫక్రీ కలిసి కనిపించిన ఈ పాట ఫుల్ ఎనర్జీతో సాగుతూ ఆకట్టుకుంటోంది. బాల కృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేనితో మంచి మ్యూజికల్ జర్నీని కొనసాగిస్తున్న తమన్ ఈ పాటకు అదిరిపోయే మ్యూజిక్ అందించారు. ఇన్ఫెక్షియస్ బీట్స్, క్యాచీ రిథమ్స్‌తో పాటను ఫుల్ ఎనర్జిటిక్ డ్యాన్స్ నంబర్‌గా రూపొందించారు. పాటలోని పార్టీ మూడ్‌కు తమన్ సంగీతం అద్భుతంగా కుదిరింది. నర్గీస్ ఫక్రీ గ్లామర్, బాలకృష్ణ తనదైన ఎనర్జీతో డ్యాన్స్ ఫ్లోర్‌పై సందడి చేశారు.రామజోగయ్య శాస్త్రి రాసిన లిరిక్స్ పాటకు సరదా టచ్‌ను తీసుకొచ్చాయి. బాలకృష్ణ మౌనంగా ఉండటంపై నర్గీస్ తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, పాట పాడుతూ డ్యాన్స్‌లో పాల్గొనాలని ఆయన్ని ప్రోత్సహించేలా సాహిత్యం సాగుతుంది. రజిని శ్రీ పూర్ణిమ తన వాయిస్‌తో పాటను మరింత ఆకట్టుకునేలా చేశారు. బాలకృష్ణ కూడా ఈ పాటలో కొంత భాగాన్ని స్వయంగా పాడటం మరో ప్రత్యేకత.పాట విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. శేఖర్ వీజే మాస్టర్ ఈ పాటకు స్టైలిష్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా కొరియోగ్రఫీ అందించారు. సన్‌గ్లాసెస్, సిగార్‌తో బాలకృష్ణ ఫుల్ పార్టీ అవతార్‌లో కనిపించగా, నర్గీస్ ఫక్రీ తన గ్లామరస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. వీరిద్దరి ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్, కెమిస్ట్రీ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.బాలకృష్ణ వాయిస్, స్టైలిష్ మూవ్స్, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ పాటకు మరింత మాస్ అప్పీల్ తీసుకొచ్చాయి. మరోవైపు నర్గీస్ తన గ్లామర్, గ్రేస్‌తో పాటను విజువల్ ట్రీట్‌గా మార్చారు. టైటిల్‌కు తగ్గట్టుగానే 'దాదా ధమాకా' ఫుల్ ఎనర్జీతో సాగుతూ మాస్ ఆడియన్స్‌కు ఫేవరెట్ సాంగ్‌గా నిలిచేలా ఉంది.

వుదయం సినిమా

గత నెల చివరలో 'ఆదర్శ కుటుంబం' రిలీజైంది..



వుదయం సినిమా: గత నెల చివరలో 'ఆదర్శ కుటుంబం' రిలీజైంది. వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోరంగా ఫెయిలైంది. అయితే దీని ప్రభావం.. త్రివిక్రమ్–ఎన్టీఆర్ మూవీపై పడిందని.. ఈ ప్రాజెక్ట్ సదరు నిర్మాణ సంస్థ నుంచి చేతులు మారిందని పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇప్పుడు వీటిపై స్వయంగా నిర్మాణ సంస్థనే క్లారిటీ ఇచ్చేసింది.త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా గాడ్ ఆఫ్ వార్ కాన్సెప్ట్‌తో ఓ చిత్రాన్ని చాలారోజుల క్రితమే ప్రకటించారు. దీనిని హారిక–హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. అయితే 'ఆదర్శ కుటుంబం' ఫ్లాప్ దెబ్బకు హారిక సంస్థతో త్రివిక్రమ్ విడిపోయారని.. మరో బడా నిర్మాణ సంస్థతో చేతులు కలిపారని.. ఎన్టీఆర్ మూవీ కూడా ఇందులో ఉంటుందని టాక్.

'అలియాస్ రుక్మిణి' నుంచి క్యాచీ సాంగ్ రిలీజ్



వుదయం సినిమా: నేచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్, నితిన్ హీరోగా 'అలియాస్ రుక్మిణి' ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'దండోరా' ఫేమ్ మురళీ కాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ దీప్తి గంట నిర్మిస్తున్నారు. రొమాన్స్, హ్యూమర్ కలగలిసిన ఎంటర్‌టైనర్ గా ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'రుక్మిణి'కి మంచి రెస్పాన్స్ రావడంతో, తాజాగా ఈ సినిమా నుంచి రెండో పాట 'పిచ్చి ప్రేమలో'ను మేకర్స్ విడుదల చేశారు.విజయ్ బుల్గానిన్ కంపోజ్ చేసిన ఈ పాట మంచి మెలోడీగా ఆకట్టుకుంటోంది. అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్, వినసొంపైన ట్యూన్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్తీక్ తన వాయిస్‌తో పాటను మరింత బాగుండేలా చేశారు. కృష్ణకాంత్ అందించిన లిరిక్స్ హీరో తన భార్యపై చూపించే ప్రేమను చాలా అందంగా తెలియజేస్తున్నాయి.తన భార్య అందంగా ఉండటమే కాకుండా, అల్లరి చేసే స్వభావం, అప్పుడప్పుడు మారాం చేయడం, చిన్న చిన్న విషయాలకు అలగడం తనకు మరింత ప్రత్యేకంగా అనిపిస్తుందని హీరో ఈ పాటలో చెబుతాడు. ఆమె ప్రేమలో పూర్తిగా మునిగిపోయిన అతను ప్రతిరోజూ కొత్తగా ఆమె ప్రేమలో పడుతుంటాడు. తన ప్రేమను ఎంతగా వ్యక్తం చేసినా, తన మనసులో ఉన్న భావాలను, ఆమె తన జీవితంలో తీసుకొచ్చిన ఆనందాన్ని మాటల్లో పూర్తిగా చెప్పలేనని భావిస్తాడు. ఈ పాటకు ఈశ్వర్ పెంటి అందించిన కొరియోగ్రఫీ కూడా చక్కగా కుదిరింది.'పిచ్చి ప్రేమలో' పాట కొత్తగా పెళ్లైన జంట మధ్య ఉండే ప్రేమను, అనుబంధాన్ని చాలా సహజంగా చూపిస్తుంది. ఇద్దరూ కలిసి బయటకు వెళ్లడం, భర్త తన భార్యను స్కూల్ దగ్గర డ్రాప్ చేయడం వంటి చిన్న చిన్న సందర్భాలు వైవాహిక జీవితంలోని అందమైన క్షణాలను గుర్తుచేస్తాయి. ఒక సాధారణ మిడిల్ క్లాస్ భర్త పాత్రలో నితిన్ చాలా సహజంగా కనిపించగా, సంప్రదాయ దుస్తుల్లో ఆఫియా సయ్యద్ అందంగా కనిపించారు. లీడ్ పెయిర్ మధ్య ఉన్న సహజమైన కెమిస్ట్రీ పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది.మొత్తంగా 'పిచ్చి ప్రేమలో' పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకునే అన్ని అంశాలతో రూపొందింది. ఈ ఆల్బమ్ నుంచి మరో ఫేవరెట్ సాంగ్‌గా నిలవడంతో పాటు మ్యూజిక్ చార్ట్స్‌లో కూడా టాప్ ప్లేస్‌కు చేరనుంది ఈ సినిమాకు జోమోన్ టి. జాన్ ISC సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, సృజన ఆదుసుమిల్లి ఎడిటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 4న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

'ఆకాశంలో ఒక తార' మోడర్న్ క్లాసిక్ మూవీగా నిలిచిపోతుంది..

వుదయం సినిమా: వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ ఏడాది వరుసగా విజయాలు అందుకోవడం ఎలా అనిపిస్తోంది?

'విశ్వనాథ్ అండ్ సన్స్' పెద్ద బ్లాక్‌బస్టర్ అయింది. అలాగే 'ఇరుముడి' జనరేషనల్ బ్లాక్‌బస్టర్‌గా ప్రేక్షకుల ఆదరణ అందుకుంది. ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార' సినిమాతో వస్తున్నాం. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా. ఫ్యామిలీస్ అందరూ ఈ సినిమాను ఎంతో ఇష్టపడతారు. ఇదొక బ్యూటిఫుల్ ఇన్‌స్పిరేషనల్ ఫిల్మ్.

ఈ సినిమా కోసం మ్యూజిక్ ఎలా ఉండబోతుంది?

–ఇది ఎమోషనల్ ఫిల్మ్. అలాగే చాలా మోటివేషనల్‌గా ఉంటుంది. ఈ సినిమాకు ఒక స్పెషల్ మ్యూజికల్ టచ్ కావాలని ప్రత్యేకంగా మ్యూజిక్ చేశాం. ఈ సినిమా మ్యూజిక్ చాలా ఐకానిక్‌గా ఉండబోతోంది.

సాంగ్స్‌కు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ఎంత ప్రాధాన్యత ఉంది?

–ఈ సినిమాలో పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ రెండూ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి . ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటకు చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందిఇందులో శ్రుతి హాసన్‌తో ఒక పాట పాడించాం. అది త్వరలోనే రిలీజ్ కాబోతోంది. తను అద్భుతంగా పాడారు.

ఈ మధ్య మీరు ఎక్కువగా తెలుగు సినిమాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టుగా ఉంది?

ప్రత్యేకంగా అలా ఏమీ లేదు. నేను చేస్తున్న తెలుగు సినిమాలన్నీ చాలా పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. 'లక్కీ భాస్కర్', 'ఇరుముడి', 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఇలా వరుస విజయాలు రావడంతో ఆటోమేటిక్‌గా అవకాశాలు కూడా పెరుగుతాయి.

మీకు ఏమైనా డ్రీమ్ ప్రాజెక్ట్స్ ఉన్నాయా?

'ఇరుముడి' లాంటి సినిమా చేయడం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. అలాగే ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార' కూడా చాలా మంచి సంతృప్తిని ఇచ్చింది. నాకు మంచి కథ వస్తే



వుదయం సినిమా: 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన క్రేజీ గ్యాంగ్ మరోసారి సందడి చేసేందుకు సిద్ధమైంది. ఆ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'ENE Repeat' నవంబర్ 19న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి తమ పాత పాత్రలతో మళ్లీ అలరించనున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మేకర్స్ తాజాగా బతుకమ్మ పాటను లాంచ్ చేశారు. వివేక్ సాగర్ అద్భుతంగా స్వరపరిచిన ఈ పాటకు చంద్రబోస్ రాసిన సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రేయా ఘోషల్ పోకల్స్ పాట చాలా.'ఆకాశంలో ఒక తార' ఎలా ఉండబోతోంది?–సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా ఇది. ప్రతి మహిళ ఇష్టపడే సినిమా అవుతుంది.

నిర్మాతల గురించి?

ఈ మ్యూజిక్ జర్నీలో స్వప్న గారు ఎంతో సపోర్ట్ చేశారు. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా.

'ఈ నగరానికి ఏమైంది' సాంగ్ లాంచ్ ఈవెంట్

పాటను మరోస్థాయికి తీసుకెళ్లాయి. ఈ పాట ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. నాకు మణిరత్నం 'సఖి' సినిమాలోని 'ఏడే ఏడేడే' పాట చాలా ఇష్టం. నా సినిమాల్లో అలాంటి ఒక పాట ఎప్పుడైనా చేయాలనుకునేవాడిని. ఫైనల్‌గా ఈ బడ్డీ కామెడీ సినిమాలో అలాంటి సిచువేషన్ కుదిరింది. ఇందులో ఒక ఫ్యామిలీ మీకు కొత్తగా కనిపిస్తుంది. ఆ కథకు ఈ ఫ్యామిలీకి ఏం సంబంధం అనేది మొదటి 15 నిమిషాల్లోనే అర్థమైపోతుంది. సాంగ్ డ్యాన్స్ చేయడం అనేది నాకు కూడా ఫస్ట్ ఎక్స్‌పీరియన్స్. ఇది చాలా బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్. వివేక్ సాగర్ అద్భుతమైన పాట ఇచ్చారు. చంద్రబోస్ గారు మాకు ఎంతో గైడ్ చేశారు. ఆయనతో డిస్కస్ చేసినప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఒక సాంగ్ డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఇంత ఎంజాయ్‌మెంట్ ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. అలాగే ఈశ్వర్ గారు అద్భుతంగా కొరియోగ్రఫీ చేశారు. చాలా మంచి డ్యాన్స్ ఉంటుంది. శివాత్మికను ఇందులో కీర్తన అనే పాత్రలో పరిచయం చేస్తున్నాం. తన డ్యాన్స్ కూడా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా ప్రేక్షకులందరూ ఈ పాటను ఎంజాయ్ చేస్తారు. ఇది ఒక ఫెస్టివల్ సాంగ్. ఈ సినిమాలో ఈ పాట ఎందుకు ఉందనేది నవంబర్ 19న ఆడియన్స్ చూస్తారు. శ్రేయా ఘోషల్ గారితో పాట చేయించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. లిరిక్ రైటర్ చంద్రబోస్ మాట్లాడుతూ.. ముందుగా ఈ సినిమాలో పాట రాసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్‌కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.



'హైందవ' నుంచి మెస్మరైజింగ్ రొమాంటిక్ మెలోడీ



'**వుదయం సినిమా:** కిష్కింధపురి' బ్లాక్‌బస్టర్ విజయంతో జోష్‌లో ఉన్న యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఆకల్ట్ థ్రిల్లర్ 'హైందవ'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంయుక్త హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది.తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఎవరైనా' ను విడుదల చేశారు. ప్రేమ, భావోద్వేగాలను కలిపి రూపొందించిన ఈ పాట వినగానే ఆకట్టుకుంటుంది. సామ్ సీఎస్ అద్భుతమైన ట్యూన్ కంపోజ్ చేశారు. మెలోడీ ట్యూన్, చక్కటి లిరిక్స్‌తో పాట మొదటిసారి విన్నప్పుడే కనెక్ట్ అయ్యేలా ఉంది.కపిల్ కపిలన్, శ్వేతా మోహన్ తమ వాయిస్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. కిట్టు విస్సాప్రగడ అందించిన సాహిత్యం పాటకు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. .పాటలోని విజువల్స్ కూడా చాలా ఆహ్లాదకరంగా ఉన్నాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. లీడ్ పెయిర్ మధ్య కనిపించే మ్యాజిక్, వారి స్క్రీన్ ప్రెజెన్స్ పాటను మరింత ఆకట్టుకునేలా చేశాయి. 'ఎవరైనా' పాట 'హైందవ' ఆల్బమ్‌పై అంచనాలు పెంచుతోంది. ఇప్పటికే టీజర్‌తో ఆసక్తి కలిగించిన ఈ సినిమా, ఇప్పుడీ మెలోడీతో అంచనాలు పెంచింది.ఈ చిత్రంలో మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా కీలక పాత్రలు పోషిస్తున్నారు. హరీష్ కన్నన్ డీవోపీగా పని చేస్తున్నారు, కార్తిక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైనర్.

'రియాలిటీ' సాంగ్ లాంచ్



వుదయం సినిమా: వరుస బ్లాక్‌బస్టర్స్‌తో అలరిస్తున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా కూడా బాధ్యతలు చేపట్టారు. ప్రతి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఒక మంచి ఎంటర్‌టైనర్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్నారు. సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. గ్లింప్స్‌కు ఫీల్ గుడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మంచి స్పందన రాగా, ఫస్ట్ సింగిల్ భజ గోవిందం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. జీవితంలో చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే అందమైన భావనతో రూపొందిన ఈ పాట శ్రోతలకు వెంటనే కనెక్ట్ అయి వైరల్‌గా మారింది.ఇప్పుడు మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను మరోస్థాయికి తీసుకెళ్తూ మేకర్స్ రెండో సింగిల్ 'రుత్తూ'ను విడుదల చేశారు. ఈ పాట 'రియాలిటీ'లోని రొమాంటిక్ కోణాన్ని అందంగా ఆవిష్కరిస్తుంది. వినసొంపైన మెలోడీగా, మనసుకు హాయినిచ్చేలా ఈ పాట సాగుతుంది. ఫీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం కొత్త అనుభూతిని ఇస్తుంది. అద్భుతమైన ఇన్‌స్ట్రుమెంటేషన్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. పూర్ణాచారి రాసిన సాహిత్యం కవితాత్మకంగా సాగుతూ, తన ప్రేయసిపై హీరోకు ఉన్న ప్రేమను, ఆమెతో ఉన్నప్పుడు కలిగే ఆనందాన్ని, ప్రతి క్షణం ఆమెతోనే గడపాలనే ఆరాటాన్ని అందంగా ఆవిష్కరించింది. ప్రేమలోని భావాలను వ్యక్తపరిచిన తీరు మరింత అందంగా చూపిస్తుంది.కపిల్ కపిలన్ బ్యూటిఫుల్ వోకల్స్ పాటకు మరింత ప్రాణం పోశారు. ఎం. షరీఫ్ చేసిన గ్రేస్‌ఫుల్ కొరియోగ్రఫీ ఆకట్టుకుంది. చాలా సింపుల్ మూవ్‌మెంట్స్ కూడా ఎంతో అందంగా కనిపించాయి. ముఖ్యంగా పాటలోని క్యాచీ హుక్ స్టెప్ సోషల్ మీడియా రీల్స్, షార్ట్స్‌లో ట్రెండ్ అయ్యేలా ఉంది.కిరణ్ అబ్బవరం తన పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. పక్కింటి కుర్రాడిలా కనిపించే పాత్రలో తనదైన చార్మ్‌తో ఆకట్టుకున్నారు. దేవిక భట్ అందంగా కనిపిస్తూ, తన స్క్రీన్ ప్రెజెన్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో పాటకు మరింత మ్యాజిక్ తీసుకొచ్చారు. వీరిద్దరి కెమిస్ట్రీ ఈ పాటలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కిరణ్ తన ఆనందాన్ని వ్యక్తపరచడం, దేవికకు పానీపూరీ తినిపించడం వంటి చిన్న చిన్న మూమెంట్స్ కూడా ఎంతో ముచ్చటగా అనిపిస్తాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ప్రేమకథలోని మ్యాజిక్ ప్రేక్షకులకు ఒక అందమైన అనుభూతిని అందిస్తుంది.

"బుస్సా ఫిల్మీ ఫోకస్ విజేత అవార్డ్స్" సెకండ్ యానివర్సరీ అనౌన్స్‌మెంట్

"బుస్సా ఫిల్మీ ఫోకస్ – విజేత అవార్డ్స్" రెండో వార్షికోత్సవానికి శ్రీకారం చుట్టింది.గత ఏడాది నిర్వహించిన తొలి వార్షికోత్సవం ఘన విజయాన్ని అందుకోవడంతో, అదే స్ఫూర్తితో రెండో వార్షికోత్సవ వేడుకలను మరింత ప్రతిష్టాత్మకంగా, మరింత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా "బుస్సా ఫిల్మీ ఫోకస్ విజేత అవార్డ్స్" సెకండ్ యానివర్సరీ అనౌన్స్‌మెంట్‌ను ప్రముఖ నటుడు "చిత్రం శీను" చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ ప్రకటన కార్యక్రమం రెండో వార్షికోత్సవ వేడుకలకు ఉత్సాహభరితమైన ప్రారంభంగా నిలిచింది.సినీ మరియు వివిధ రంగాల్లో ప్రతిభను గుర్తించడం...ప్రతిభావంతులను గౌరవించడం...సినీ ప్రముఖులను ఒకే వేదికపై సత్కరించడం అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న "బుస్సా ఫిల్మీ ఫోకస్ విజేత అవార్డ్స్" రెండో వార్షికోత్సవాన్ని కూడా మరింత ప్రత్యేకంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది."మొదటి అడుగు విజయాన్ని ఇచ్చింది...ఆ విజయం మరింత బాధ్యతను పెంచింది. అదే స్ఫూర్తితో రెండో వార్షికోత్సవాన్ని మరింత బ్రహ్మాండంగా నిర్వహించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం" అని బుస్సా ఫిల్మీ ఫోకస్ నిర్వాహకులు "బుస్సా బాలరాజు" తెలిపారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.